# ప్రచ్ఛన్న పాండవము

చిలకమర్తి లక్ష్మీనరసింహం



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# ప్రచ్ఛన్న పాండవము

రచయిత

చిలకమర్తి లక్ష్మీనరసింహము

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2007

**PRACHANNA PANDAVAMU**
By
CHILAKAMARTHI LAKSHMI NARASIMHAM

T.T.D. Religious Publications Series No:728

© All Rights Reserved

T.T.D. First Edition : **2007**

Copies:1000

*Published by*
**K.V. Ramanachary, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati-517 507.

DTP by
M/S SAR Infotec (P) Ltd,
15-3-200,G.N. Mada Street,
Tirupati- 517501.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

"తింటేగారెలు తినాలి, వింటే భారతం వినాలి" అనేది నానుడి. విందు భోజనంలో గారెలు ఎంతో రుచిగా ఉండడమే గాక, ఆ విందు సంతృప్తికరంగా వుంటుంది. అలాగే జీవితంలో భారతకథా పఠనం గూడ అంతేరుచిగా ఉంటుందని సారాంశం. కనుకనే ఈ నాటికి గూడ "మహాభారతం" తెలుగు సాహిత్యంలో మహోన్నత స్థానాన్ని పొంది, తెలుగు ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటున్నది.

భారత కథామృతంలోని కొన్ని ప్రసంగాల ఆధారంగా శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహము "ప్రచ్ఛన్న పాండవము" అనే పుస్తకాన్ని రచించారు. వీరి గ్రాంధికభాష, శైలి, వాక్పటుత్వము ఎందరో పాఠకులను విశేషంగా ఆకర్షించింది. వనవాసానంతరం విరాటుని కొలువులో పాండవుల అజ్ఞాతవాసం, దుర్యోధనాదుల కుయుక్తులు, ఉత్తర గోగ్రహణము మొదలగు కథా ఘట్టాల ఆధారంగా కథను నడుపుకుంటూ పాత్రల ఔచిత్యాన్ని ప్రకటింపజేశారు.

ఈ చక్కటి కథా సన్నివేశాలను నాలుగు ప్రకరణాలలో సరళమైన శైలిలో పాఠకుల కందించారు. ధర్మానికి, నీతికి సమాజంలో గెలుపు వుంటుందని ఈ రచన ద్వారా వారిచ్చిన సందేశం అమూల్యం.

ధార్మిక సాహిత్య ప్రచురణలో భాగంగా, తిరుమల తిరుపతి దేవస్థానం తొలిగా ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నది. భాషాజ్ఞాన కోవిదులు, పండితులు, పామరులు ఈ పుస్తకాన్ని ఆదరించి, మధురానుభూతిని పొందగలరని ఆశిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# విషయసూచిక


| | | పుటసంఖ్య |
|---|---|---|
| 1. | ప్రథమ ప్రకరణము | 1-19 |
| 2. | ద్వితీయ ప్రకరణము | 20-30 |
| 3. | తృతీయ ప్రకరణము | 31-44 |
| 4. | చతుర్థ ప్రకరణము | 45-94 |


***

# ప్రచ్ఛన్నపాండవము

# ప్రచ్ఛన్న పాండవము

## ప్రథమ ప్రకరణము

ఆర్యావర్త దేశమున సూర్యవంశమని, చంద్రవంశమని రెండు వంశములు సుప్రసిద్ధములై యుండెను. సూర్యవంశప్రభూతు లగుమహీపాలుర కయోధ్యానగరమునుఁ జంద్రవంశ సంజాతులగు నృపాలురకు హస్తినాపురమును రాజధానులు. చంద్రవంశమున లోకమాన్యులగు కురువు, భరతుఁడు మున్నగు మహామహులుదయించిరి. కురువుంబట్టి కురువంశ మనియు, భరతునింబట్టి భరతవంశ మనియుఁ జంద్రవంశమునకు మారు పేర్లు కలిగెను. ఆకురువంశమున నధిక తేజోరాశి యగు శంతనుఁడు జనియించెను. శంతనునకుం బ్రథమకళత్ర మైనగంగాదేవి వలనఁ భీష్ముఁడును, ద్వితీయకళత్ర మైనసత్యవతివలన, చిత్రాంగద విచిత్రవీర్యులును నందనులై పొడమిరి. అందు భీష్ముఁడు పితృప్రియా చరణలాలసుఁడై రాజ్యమునందుఁ దనకుఁ గలయధి కారమును, వివాహమును గూడ మానుకొనెను. విచిత్ర వీర్యుఁడు కాశీ రాజపుత్రిక లగు నంబికను నంబాలికను బరిణయం బయ్యెను. వారిలో నంబిక ధృతరాష్ట్రుం గనియెను. అంబాలిక పాండురాజుం గనియెను. ధృతరాష్ట్రుఁడు జనుషాంధుఁ డయినకతనఁ బాండురాజు కనిష్ఠుఁడయ్యు భీష్ముని పంపున రాజ్యభారమువహించి దిగ్విజయంబు గావించి కురువంశంబున కపారయశంబు సముపార్జించి ధృతరాష్ట్రునియందుఁ బెత్తన ముంచి మహీమండలము శాసించుచుండెను. ధృతరాష్ట్రుఁడు గాంధార రాజగు సుబలు తనయను గాంధారిని వివాహ మయ్యెను. పాండుమహీజాని కుంతిభోజాత్మజ యగు కుంతిని, మద్ర రాజకన్యక యగు మాద్రిని వివాహ మాడెను. ధృతరాష్ట్రుఁడు హస్తి నాపురంబున వసియించుచుండె; పాండు రాజు ప్రకృతి సౌందర్య దర్శ నౌత్సుకుఁడై మునిజననివాస యోగ్యములును

పుణ్యనదీనద విరాజితములును బహుగిరిసరోవర శోభితములును నానామృగశకుంతసం తానసంకులములు నగు నడవులయందుఁ గాపుర ముండెను. ఆమహీధరునకు దండధరుని ప్రసాదమున యుధిష్ఠిరుండు, వాయుదేవుని యనుగ్రహంబున భీమసేనుండు, మహేంద్రునికరుణచే నర్జునుఁడును ననుకుమారులు కుంతీదేవి యందుఁబొడమిరి. ధృతరాష్ట్రునకు గాంధారి యందు దుర్యోధనదుశ్శాసన ప్రముఖులగు నూర్వురు కొడుకులును, దుస్సలయను కూఁతురును నుద్భవించిరి. పాండుక్ష్మాపాలునకు రెండవ యిల్లాలు మాద్రియందు నశ్వినీ దేవతలవరంబున నకులసహదేవు లను కవలబిడ్డలు జనించిరి. పాండుక్షోణీశ్వరుఁడు యుధిష్ఠిర ప్రభృతి కుమారులు సంప్రాప్త యౌవనులు గాకమున్నె బంధు గణశూన్య మైన యరణ్యమందుఁ గాలధర్మమొందెను. సాటిలేని పతిభక్తి గలమాద్రి మగనితో సహగమనముఁ జేసెను. వనౌకసు లగు మహామునులు పాండు నిర్యాణానంతరమున దత్కుటుంబముపైఁ జాలినొంది యేవురుకొడుకులం గుంతిని హస్తిపురమునకుఁ దోడ్కొనిపోయి కురువృద్ధులగు భీష్మ ధృతరాష్ట్రుల కొప్పగించిరి. భీష్ముఁడు పాండునరనాథునకుఁబారలౌకికక్రియలు జేయించి యుధిష్ఠి రాదికుమారులను గడుగారాబమునం బెంచుచుండె. కుంతి సవతిబిడ్డ లగుమా ద్రేయులకు దనకన్న బిడ్డలకన్న మిన్నగ గారాబముఁ జూపి పోషించుచుండెను. వంశమునుఁ బట్టి పాండవధార్త రాష్ట్రులు కౌరవు లను పేరఁ బరఁగఁ దగినవా రయ్యును ధార్త రాష్ట్రులు కౌరవులను పేరను, బాండునందనులు పాండవు లను పేరం జగంబునఁ బ్రసిద్ధులయిరి. కురుపాండవరాజకుమారులకు విలువిద్దెఁ గఱపుటకై మందాకినీ నందనుఁడు గౌతమగోత్రజుఁడైన కృపాచార్యుని మొట్ట మొదట గురువుగా నియమించి కొంత కాలము గడచిన పిదప నతని కన్న నన్ని తెఱఁగుల నధికుఁడయి పరశురామశిష్యుఁడై సకల రాజకుమారులకు ధనుర్విద్యాగురుఁ డగుద్రోణాచార్యుని నుపదేష్టగా నేర్పఱిచెను. ఆచార్యుఁడు

శిష్యు లందఱకు సకలశస్త్రాస్త్రమర్మములు సమానముగ నుపదేశించినను బాండవమధ్యముఁడగు నర్జునుఁడు తక్కిన రాజకుమారు లందరికంటె నధికముగ ధనుర్విద్యాకుశలుఁడయ్యెను. ఆచార్యునకును వానియందె మిక్కుట మగు నభిమానము కలిగెను. భీమసేన దుర్యోధనులు గదాయుద్ధకుశలులయిరి. అర్జునుఁడు ధనుర్విద్యాకౌశలమునఁ దృణీకృత కార్తవీర్యార్జునుఁడై ధను ర్వేద రహస్యవేదియై భీష్మాది కురువృద్ధ జనంబులకును బంధు జనంబులకును భరతకులంబు వీనివలన నెంతయు వన్నె కెక్కు ననునాశ గలుగునట్లు, వీనివలనఁ దనకుఁగౌరవంబు గలుగు నని ద్రోణాచార్యుఁడు సంతసించునట్లు శత్రురాజకుమారులు మనంబుల సడలునట్లు , నెల్ల వారికి బ్రశంసనీయుఁడై యుండె. సూతనందనుఁ డగు కర్ణుఁడు పరశురామునొద్ద ధనుర్విద్యనధిగమించి యర్జునున కించుమించు సమానుఁ డని బ్రసిద్ధిగాంచి పాండవమధ్యమునెడల మత్సరంబు స్పర్ధయు వహించె. ఆకారణంబున దుర్యోధనునకు మిత్రు డయ్యెను. యుధిష్ఠిరుఁడు విద్యావినయవివేక సంపన్నుడగుటం జేసియు, భీమసేనుఁడు నిరుపమాన బాహుబలాతిశయుఁ డగుటం జేసియు నర్జునుఁడు ధనుశ్శాస్త్రకోవిదుఁ డగుటం జేసియు నకులసహదేవుఁలు కృపాణాదిసాధన ప్రయోగ చతురు లగుటం జేసియు విశేషించి వారెల్ల నిగర్వులు, నిష్కాములు, నిరహం కారులు, నిత్య సత్య వ్రతులు, నగుటం జేసియుఁ బ్రకృతిజనమునకుఁ బాండురాజకుమారుల మీఁదఁ గాలక్రమంబున నెక్కువ పక్షపాతము కలిగెను. అయ్యది ధార్త రాష్ట్రులకింతంత యన రాని మత్సరంబు గల్గించి వారు యుధిష్ఠి రాదిసోదరపంచకంబును నందుముఖ్యముగ భీమసేనుని నేతెరంగున నైనదుదముట్టింపజతనంబులఁ గావించిరి. ఒకనాఁడు భీమసేనుఁడు గాఢనిద్రాసక్తుఁడై యున్న సమయమునఁ గాలు సేతులు త్రాడులంగట్టి యమునానదిలోఁ బాఱవైచిరి. కానియాతఁడు నీటమునిఁగి పంచత్వమునొందక మేలు కాంచి యావులించి యొడలు విఱుచుకొనునప్పటి కిఁగట్టిన త్రాడు లన్నియుందెగిపోయెను. ఈఁత

నేర్చినవాఁడగుటం జేత నిరపాయంబుగ నదీజలంబులనీఁది కౌరవభయంకరుఁడై మరలగృహంబుజేరె. వేఱొకనాఁడు వెండియు నిదురించుసమయంబునసె కుబుసములూడ్చినకోఁడెత్రాచుపాములం దెచ్చి భీమసేనుని కరపించిరి. వెండియునొకనాఁడన్నములో విసము బెట్టించిరి. ఆవిసంబువాని కమృతప్రాయమగుటం జేసి భీముఁడు చెక్కు చెదరక తొంటికన్న నుక్కు మిగిలియుండెను. యుధిష్ఠిరుఁడు సంప్రాప్తయౌవనుఁడయ్యెను. ధృతరాష్ట్రుఁడు పుట్టిగ్రుడ్డియగుట మహీపాలనంబు చక్కఁగం జేయలేమి కురుపాండవరాజకుమారులలో విద్యావినయవివేక సంపత్తిచేఁ బ్రశంసనీయుఁడగువానిని యువరాజుం జేయ గాంగేయాది కురువృద్ధులుసంకల్పించియట్టివాఁడ యుధిష్ఠిరుండె యగుటం జేసి వానిని యువరాజుం జేయదలంచిరి. మాయోపాయ శోధనుఁడగు దుర్యోధనుఁడు వయసునందెగాక దుర్గుణంబులయందుం దనకు దమ్ముఁడగు దుశ్శాసనుని "శ్యాలకోగృహనాశాయ" యనుసామెత సార్థకముగాఁ దన తోఁబుట్టువు కాపురమునకు వచ్చినది మొదలు కాలసర్పము గృహంబు సొచ్చినవిధమున ధృతరాష్ట్రునియింటనె యుండి మేనల్లురకు దుర్బుద్ధులు గఱపుచున్న శకునిని మధ్యమ పాండవునితో స్పర్థ వహించిన సూతనందనుఁ డగురాధేయునిఁ గూడగట్టుకొని వారితో నాలోచించి పాండవులను హస్తిపురమునుండి పాఱదోల నిశ్చయించి పాండవులను వారణావతమునకుఁ బంపవలసినదని యావృద్ధుని బలు తెరంగుల వేడుకొని వాని నొడంబరచి, పాండవులనిమిత్తము వారణావతమున లాక్షాగృహము నిర్మింపఁ జేసివారి నక్కడఁ గాపురముండ బంపెను. వారచ్చట నుండఁగా నాలక్క యిల్లుఁ దనమిత్రుఁడైన పురోచనునిచేత నొకనాఁడర్ధరాత్రమునఁ గాల్పించెను. దైవానుగ్రహముననో విదురుని యుపదేశముననో పాండవులు లాక్షాగృహానలంబున మిడుతలవలె మ్రగ్గక విదుర ప్రేక్షితుఁడై వచ్చిన ఖనకుఁడు త్రవ్వినబిలమార్గంబున హిడింబాసురవనముఁ బ్రవేశించిరి. భీమసేనుఁడు

హిడింబుని జంపి వా నిచెల్లెలగు హిడింబను వివాహ మయ్యెను. అనంతరము పాండునందను లేకచక్రపురాగ్రహారంబునకుం జని విప్ర వేషంబులు దాల్చి మాధుకరవృత్తిం జీవించుచుండిరి. చిరకాలమునుండి యాయగ్రహార జనంబులఁ బీడించుచుండిన లోకకంటకుఁ డగుబకాసురుని భీమసేనుఁడు కడ తేర్చి పురవాసులకువుహోపకారవు గావించెను. అప్పుడు ద్రౌపదీస్వయంవ రవుజరుగుచున్న వార్తవిని పాండవులు పాంచాలపురమునకుంజనిరి. పాంచాలభూభర్తయగు ద్రుపదరాజు ద్రోణాచార్యునకుం బాలమిత్రుఁ డయ్యు నాపేదజన్ని గట్టు మహేశ్వర వర ప్రసాదమున నశ్వత్థామ యనుకొడుకుం బడసి వానికిం బాలు లేక మిక్కిలి కటకటంబడి చిరమిత్రుఁడగుతన్ను గోవులనిమిత్తమైయాచింప రాగ బ్రాహ్మణోత్తముని నధిక్షేపించి యవమానించి పంచె. అదిమనంబునం బెట్టుకొని కుంభసంభవుడు నర్జునుని ద్రుపద రాజు మీదికిఁ బంచియా శిష్యుని చేత నతనిం గెలిపించి తన పాదములపై బడ వేయించు కొనియెను. పాంచాల రాజు దానికింగడంగనలి ద్రోణాచార్యుంజంపఁ గలకువూరునినర్జునుని బెండ్లి యాడ గలకువూర్తెనుగనవలెనని సంకల్పించియాజోపయజాలనుమునుల నాశ్రయించి వారి వరంబున నగ్ని గుండం బునధృష్టద్యుమ్నుడనుకువూరుని నిరుపమాన సౌందర్య విరాజితయగు కృష్ణయనుకూతునుంగనియెను. తన కూతు నర్జుననకే గాని తదన్యుల కిచ్చి పెండ్లి సేయ నని తానుప్రతిన పట్టుటయు, మధ్యమపాండవుఁడు మాతృభ్రాతృ సహితుఁడై లక్క యింట మడిసెనని లోకమున బ్రవాదము గల్గుటయు దలంచి ద్రుపదుడు తనప్రతిజ్ఞకు భంగమగునని విచారించి ఫల్గునున కేగాని తదన్యులకు సాధ్యముగాని మత్స్యయంత్రంబు గల్పించి దాని నెవ్వడు తెగనేయునతనికి తనకూతునిచ్చి పెండ్లిసేయుదునని లోకంబునఁ జాటఁబంచెను. ఆమహోత్సవము కనులపండువుగాఁ జూచుటకును మత్స్యయం త్రంబు నేసి జగదేకసుందరి యగుపాంచాలి కేలు వట్టుటకును నుత్సుకులై దేశంబునందలి

రాజకుమారులందరు మహావైభవమున ద్రుపపురమునకుం జనిరి. శత్రుహృదయశల్యుఁడగు శల్యుఁడును, సహజకుండల శోభితకర్ణుఁడుగు కర్ణుఁడును నపారభుజబల ధౌరేయులగు గాంధారేయులును, జరాసంధ శిశుపాల దంతవక్త్ర ప్రముఖులగు మహీపతులును వాసుదేవ బలరామ ప్రభృతులగు యాదవులును మత్స్యయంత్రము నేయబోయి కృతకృత్యులు గాకపోయిరి. బ్రాహ్మణ వేషధారి యగు పార్థుఁడు విప్రమధ్యంబునుండి రంగస్థలము నకుఁ బోయి వింట నలుఁగు దొడిగి యంతరిక్ష స్థితయంత్రఁబునం దున్న మత్స్యంబును దెగనేసె. ఏయుటయు ద్రుపద రాజనందన యభిమానధనులగు రాజనందనులెల్ల సిగ్గునఁ దలవంచునట్లు గంధ సింధుర రాజగమనంబులతో సల్లనల్లనఁ జని పాండవ మధ్యముని కంఠంబునఁ బుష్పదామంబు వైచెను. అది గని దుర్నయు లగుకర్ణ ప్రముఖులు గాటమగు నసూయనొంది నర్జునునిపై దుమికి పోరు సలిపిరి. ఆకయ్యమున రాధేయప్రముఖులకుఁ బరాజయంబును విజయునకు విజయంబును జేకూరెను. లబ్ధవిజయుఁడైన ధనంజయుఁడు విజయలక్ష్మినింబోలె జగదేక సుందరి యగుపాంచాల రాజనందనను దామువిడిసియున్న కుంభ కారగృహమునకుఁ దోడ్కొనిపోయి తల్లికి సమర్పింప నామె యాఫలం బేవురుకుమారులు ననుభవించునది యని శాసించెను. ద్రుపదుఁడు భగవానుఁడగు బాదరాయణుని యుపదేశమునఁదనకూఁతును బాండునందనుల కేవురకు నిచ్చి మహావైభవమున వివాహము జేసెను. పాండవులు లక్కయింట ప్రుగ్గక బ్రతికియుండిరనియు, విశేషించి ప్రబలుఁడగు పాంచాలనృపాలుని కల్లురై రనియువిని దుర్యోధనుఁడు తద్దయు దుఃఖించె. ధృతరాష్ట్రుఁడు భీష్మాదాదికురువృద్ధజనుల యుపదేశంబునఁ బాండురాజకుమారులను రావించి హస్తిపురమునకు సమీపమున విశ్వకర్మచే నింద్రప్రస్థ మనుపురము గట్టించి వారినందుంచి యర్థ రాజ్యము వారికొసగి యాదరించె. హస్తిపురమున దుర్యోధనుఁడును నింద్ర ప్రస్థనగరమున

యుధిష్ఠిరుండునుదమ్ములు చుట్టములు నెచ్చెలులు ననుచరులుఁ దద్దయు భక్తింగొలువ నతులిత వైభవంబున రాజ్యంబు నేలు చుండిరి. ధర్మనందనునిచేత ననుజ్ఞాతుఁడై యర్జునుఁడు తీర్థయాత్రలకుం జని దక్షిణా పథంబునఁ బాండ్యవల్లభుని కూఁతురగు చిత్రాంగ దను వివాహమాడి యటనుండి ద్వారకానగరమున కేగి సన్యాసి వేషంబు ధరియించి బలదేవాదులచేతఁ బూజితుఁడై సుభద్రను వివాహమాడి యామెందోడ్కొని యింద్రప్రస్థనగరమున కరిగెను. యుధిష్ఠిర భీమసేన నకుల సహదేవు లును ద్రుపద రాజపుత్రికం బెండ్లియైన పిదప వేరువేరు కన్నియలం బెండ్లియాడిరి. దుర్యోధనుఁడు భానుమతియను రాజపుత్రికను బరిణ యంబయ్యె. అర్జునుఁడు సుభద్ర వలన నభిమన్యుఁ డనుపుత్రునిం గాంచెను. బదరికా వనమునఁ దొల్లి పరమతపోనిరూఢులై యుండిన నరనారాయణు లనుమహామునులు క్రమంబున ద్వాపరయుగంబున నర్జున వాసుదేవులై జనియించిరని కొందఱును శ్రీమన్నారాయణుఁడు మహీభారావతరణార్థము యదువంశము నవతరించె నని కొందఱును మహర్షులు స్తవము చేయ శ్రీకృష్ణుఁడు బాండవమిత్రుఁడై ముఖ్యముగ నర్జున సహాయకారియై వానికిం దనకు మేనులు రెండుగాని ప్రాణం బొక్కటి యనునట్లు మెలంగుచు సకలకార్యములయందు యుధిష్ఠిరునకు మంత్రియుంబోలెఁ గర్త వ్యాకర్త వ్యములం దెలుపుచు బాండవమిత్రులు తన మిత్రులుఁగ వారిపగతురు తనపగతురుగ భావించుచు సుఖంబున వర్తించుచుండిరి. అంతటనొక్కనాడు వీతిహోత్రుఁడు నరనారాయణులను దర్శించి మహేంద్రుని ఖాండవవనము దాను దహింప నిచ్చ గలదనియు మహేంద్రుఁడాపనిఁదాను సేయకుండ నడ్డమువచ్చు ననియుఁ దనచేత నక్కార్యంబు సేయించి కృతకృత్యుం జేయుమనియు వేడుకొన వానిప్రార్థన మంగీకరించి యాదవ పాండవోత్తములు వేఁడివేల్పునకుఁ దోడై నిల్చిరి. వేల్పుదొర విశృంఖలపుష్కలావర్త మేఘములను విడిచి ఖాండవంబుచల్లార్ప బహుప్రయత్నములు సలి పెను గాని కృష్ణార్జునుల సహాయంబున నగ్ని

హోత్రు డవ్వన మంతయు నిశ్శేషంబుగ గాల్చివైచె. అగ్ని దేవుఁడు వారొనర్చిన మహోపకారమునకు సంతసించి కృతజ్ఞుడయి యర్జునునకు గాండీవం బను మహాధనుస్సును నక్షయ తూణీరములను గంధర్వహయములుగల రథమును వరుణ దేవుని చేత నిప్పించెను. పార్థుని యనుగ్రహంబున ఖాండవ వనదావానలంబున బడక మయుఁడను దానవవి శ్వకర్మబ్రదికి దనకు బాండవుని యెడ గలకృతజ్ఞతను మూర్తీ భవింపజేయుటకోయన నతిరమ్యం బగు సభ నొక్క దానిని నిర్మించి యుధిష్ఠిరునకు సమర్పించెను. ఆసభాభవనము మనోహరోప వనములతోడను రమణీయ జలాశయములతోడను విశాల ద్వారములతోడను నానారత్నమయ కుట్టిమస్థలములతోడను సుందరసాలభంజికాసహస్రము తోడను భువనైక సుందరమ్మై విరాజిల్లుచుండెను. ఆసభాభవనమధ్య గుణగరిష్ఠుఁడగు యుధిష్ఠిరుడు మంత్రి బాంధవ సామంత పురోహిత ప్రముఖులు సేవింప నొక్క నాడు నిండుకొలువై యుండ బ్రహ్మమానస పుత్రుడును జగత్త్రయైక సంచారపరాయణుడును నమేయతపఃప్రభావుడును గల హస్యజన విశారదుడునగు నారదుడు ధర్మనందనుంజూడ వచ్చి యాతనిచే విధివిధానంబుగ బూజితుడై కుశలంబడిగి మయదత్త మగునుత్త మసభను దిలకించి సంతసించి వహ్ని వాయువరుణవైశ్రవణ సభలును పశుపతిపలలాశప రేత రాజపాకశాసన సభలనువర్ణించి యాదిక్పాలుర సభలతో మయసభంబోల్చి వానికంటె యుధిష్ఠిర సభామందిరంబు సుందరంబని మెచ్చి రాజసూయమహాధ్వరము సేయుమని యాతనిం బురికొల్పెను. ఆయుపదేశము యుధిష్ఠిరునకు సమ్మతం బగుటయు నతడు వాసుదేవుని రావించి యాతనితోడను దమ్ములతో డను గార్యాలోచనము నెఱపి రాజసూయ యాగము నవశ్యము కర్తవ్యమని నిశ్చయించి దిగ్విజయార్థమై తనకు నాలుగు బాహువులట్ల నుపచారంబులు సేయుచున్న నలువురు తమ్ములం బనిచెను. అందు భీమసేనుడు కృష్ణార్జునసమేతుడై మగధ దేశమున కరిగి రాజధానియైన గిరివ్రజంబు సొచ్చి

మహోభుజబల దుర్మదాంధు జరాసంధుఁ బట్టి ద్వంద్వయుద్ధమున జంపె. అర్జునుడుత్తరకురుభూముల మీద దండు వెడలి యచ్చటం గల మహా తేజుల రాజుల నోడిచిపుచ్చి యుధిష్ఠిరునకు గప్పంబులు గట్టునట్లొడం బఱచె. నకులసహ దేవులు దక్షిణదే శంబునఁ గల రాజులం గెలిచి వారు పాండవ జ్యేష్ఠునకు సామంతులై యుండునట్లు జేసిరి. అనంతరము రాజసూయమహాధ్వరము విధివిధా నంబునం జరిగె. యాగాంతరమున నంతకతనూభవుఁడు శంతనతనూభవునిఁ జూచి మఖాంతమున నర్ఘ్యమిచ్చి యెవనిం బూజింపవలయు నని యడిగెను. అడుగుటయు భీష్ముఁడు లోకానుగ్రహార్థమ్మై పుడమి మీఁద నవతరించిన నారాయణుఁడు శ్రీకృష్ణుఁ డుండఁగా నెవరింబూజింపవలయు నని యడుగ నేల? అతఁడే యాగభోక్త. యెల్లవారికి నతఁడే మన్యుఁడు గాని యతనికి మన్యులు లేరు. కావున వాని నర్చింపుము అని చెప్పెను. అతనియాజ్ఞానుసారముగ యుధిష్ఠిరుఁడు వాసుదేవుని బూజించెను. అది సైపక వెన్నునకుఁ చిన్న నాటినుండియుఁ బగతుఁ డైన చేదిరాజు శిశుపాలుఁడు క్రోధా విష్టుఁడై వాసుదేవుని గాంగేయుని యుధిష్ఠురుని నధిక్షేపించుచు ముఖ్యముగ దేవకీనందనునినోటికి వచ్చినట్లుదూషించి యొుడ లెఱుగని వాని తెఱఁగునఁ గొలువుకూటమంతయుం గలఁచెను. అప్పుడు వాసు దేవుఁడు తన చక్రంబుచే వాని తలనఱికెను. సభాసదు లందఱు జయజయధ్వనులెసఁగఁ గృష్ణుని నుతియించిరి. అంతరాయములు లేకమఖంబు తుదముట్టెను. సేతుహిమా చలమధ్యస్థ మహీమండలమునఁ గలవసుంధరా వల్లభులందఱు మయసభామధ్యంబున హిరణ్మయ సింహాసనంబున నాసీనుఁడై యున్న యుధిష్ఠిరునకు గజముల హయవ్రజముల మణులఁ గాంతామణుల సమర్పించి నిజమకుటమాణిక్యదీధితులచే నాన్నపాల సార్వభౌముని చరణప్రవాళములకు నివాళులంబట్టిరి. ఆమహాప్రై భవంబుగాంచి మందాకినీ నందన దేవకీనందన ప్రముఖులగు హితులు మేఱమీఱిన యానందము నొందిరి. రాధానందన గాంధారీనందనాదులు మితిమీరిన యమర్షను

జెందిరి. నాటంగోలె సుయోధనుఁ డసూయాగ్ని కీలలు మనస్సుంగాల్పఁ దెవులు లేని వేదనంబడుచు ధరణీ రాజ్య వ్యాపార హీనుఁడై మిత్ర పరాఙ్ముఖుఁడై పాండవుల నెట్లయిన వంచించి వారిసంపదలు గ్రహింపవలెనని పాపవ్య వసాయమునఁ గృతనిశ్చయుఁడయ్యెను. మేనమామయైన శకుని మేనల్లు నింజూచి "సుయోధన! యుధిష్ఠిరుడు జూదమం దాసక్తి గలవాడు. వాని నెట్లయిన నిటకు రావించి నాతో జూదమాడింతువేని వానిం గపటద్యూత పరాజితుం జేసి వానియైశ్వర్యము లన్నియు నీకిచ్చెద" నని నొడువుటయు వానిపలుకులు శ్రవణ ప్రియంబులుగ దుర్యోధనుడు ధృతరాష్ట్రుకడకుం బోయి తనదుఃఖకారణ మెఱింగించి యుధిష్ఠిరుని గజపురమునకు రప్పించి జూద మాడింపుమని ప్రార్థించెను. దాని వలన నెగ్గులు పుట్టునని యెఱింగి యాంబికేయుడు తొలుదొల్తనట్లు చేయుట కిష్టపడక పుత్త్ర స్నేహమున సుయోధనుని కోర్కి నిరాకరింపజాలక యెట్టకేల కొడంబడి తన కావ్పుడునం గురుకులక్షేమంకరుడును నయకోవిదుడు నైనవిదురుని రావించి సుహృ ద్ద్యూతమునిమిత్త మింద్రప్రస్థమునకరిగి ధర్మరాజును దోడ్కొని రమ్మని యానతిచ్చెను. జూదము పరస్పర భేదమునకు గారణమగుటం జేసి యది సర్వవిధముల బరిత్యజింపదగు నని విదురుడు విచిత్ర వీర్యనందనునకు బలు తెఱగుల నీతులు చెప్పినను వానినన్నిటిం బెడచెవిని బెట్టి పుత్త్ర వాత్సల్యము పెంపున యుక్తాయుక్తవివేచన జ్ఞానశూన్యుడై తనపలుకు సెల్లవలయునని పట్టుపట్టెను. అంతట విధి లేక విదురుడు విషాదపూరిత మనస్కుడై యింద్రప్రస్థపురమున కరిగి యుధిష్ఠిరుని సందర్శించి తనకొడుకులతో నెయ్యపుజూద మాడుటకు రమ్మని ధృతరాష్ట్రుఁ డానతిచ్చెనని విన్నవించుటయు నన్నరనా యకుడు విధినియోగంబుకన్న బలవత్తరమ్మైన ధృత రాష్ట్రనియోగంబును దాటజాలక చిత్తంబును నెత్తంబునకు బురికొల్పి పాంచాలరాజనందనయు వృకోదర ప్రముఖ సోదరులు వెంటరా విదురుని తో గరిపురమున కరిగెను. దుర్యోధనుడు

మనోగత మైన ద్వేషము గొంతతడవుదాచి గడ్డిగప్పిన బావియుంబోలె సదయాంతరంగుని యట్లు కనబడి పాండవులను గౌరవించి సుహృద్ద్యూత మాడు మని ధర్మరాజును బిలిచినప్పుడు బురికొల్పెను. కితవులు ద్యూతక్రీడకు బిలిచినప్పుడు వారితో నెత్తమాడక యుండుట ధర్మవిరుద్ధం బని ధర్మనందనుడు మనసులో దాని కిష్టపడియె జూదమాడ మెదలుపెట్టెను. సుయోధనుడు తాను స్వయముగా జూదమాడక నీచుడును మాయోపాయవిశారదుడునగు దన మేనమామయగు శకునిని దనపక్షమునజూదమాడ నియోగించెను. పలకలపై సారెలుద్రోచి యాడనారంభించినది మొదలు కొట్ట కొనవరకు శకుని యెల్ల పందెముల గెలిచె. పాండవ జ్యేష్ఠుడన్ని పందెముల నోడె. తురంగములను మాతంగములను స్యందనంబుల నందలంబుల యాయుధముల గోగణములను ధనసంచయములను రత్న రాసులనుసామ్రాజ్యమును గ్రమక్రమముగ నొడ్డి యోడి యారాజారోషా వేశంబున నొడలు మఱచి తమ్ములనొడ్డి తన్నొడ్డి యంతనిలువక ధర్మ పత్నియైన పాంచాల రాజతనయ నొడ్డి యెల్ల పణంబుల బరాజితుడై యటమీద బణంబుగా నొడ్డుట కేమియు లేక సిగ్గున దలవంచి యూరకుండెను. అంతటఁ గౌరవకుల పాంసను డగు దుర్యోధనుడు ద్యూతపరాజితులై దీనవదనులై యున్న పాండుతనయులకు దాను గావించిన యపకారంబునకు దోడుగ నవమానంబు గలిగింప నెంచి వారి మేనుల నున్న యాభరణంబులను నుత్తరీయంబులను హస్తంబుల నున్న యాయుధంబులను నక్కడ బెట్టుడని యానతిచ్చెను. ధర్మమునకు గట్టుపడి పాండునందను లట్లే చేసిరి. ఖలుడగు దుర్యోధనుడంతతో నిలువక యుధిష్ఠిరుడు జాదంబున యాజ్ఞసేనింగూడ నోడె గావున నామెను సభామండపంబునకు దోడ్కొని రమ్మని దురాచారుఁ డగుదుశ్శాసనుం బనిచె. పనుచుటయు నతిక్రూరుఁడగు దుశ్శాసనుఁడు మనంబునఁ గొంకు జంకు లేక యగ్ని కుండసముద్భూతయు నతిపవిత్ర చరిత్రయు బాండవపట్టమహిషియు నైనయాదేవి కడకుంబోయి రాజసూయ

మహాధ్వరంబున నవభృథస్నాన పావనము లైన శిరోరుహముల గ్రహించి సభాసదు లెల్ల విస్మృతులై చిత్తరువులట్లు నిశ్చేష్టితులై యుండ సభకీడ్చి తెచ్చెను. తమ్ముఁడు చేసిన ఘన కార్యమునకు సుయోధనుఁడు కడుంగడు సంతసించి తానుగూడనేదేని మహాకార్యంబుగావించి తమ్మునికన్న గొప్పవాఁడు కాఁదలచి యెట్ట యెదుట నున్న యాపాండవపట్టమహిషిని చూచి దుశ్శాసునుంబిలిచి యామెవలువ లొలువమని యానతిచ్చెను. అపగతల జ్జాసంశయుండైన యాకౌరవాధముఁడు రాజసహస్రమండల మధ్యమున గురువృద్ధ జనసమక్షమున నా పాంచాలరాజనందన కోకలు విప్పఁదొడఁగెను. అప్పుడమ్మహాపతివ్రతఆ ర్తత్రాణపరాయణుఁడైన నారాయణుని చరణంబె శరణంబని మరణంబుకన్న భయంకరమ్మైన యా విపత్సమయమున గజేంద్రవరదుఁడును ప్రహ్లాదరక్షకుఁడును శిష్టజనపరిపాలకుండును నగుగోపాల దేవుని హా కృష్ణా! హాకృష్ణా! యని స్మరియించెను. అపుడు రాజలోకమెల్ల నద్భుతమంద దుస్ససేనుఁడొలిచిన కొలఁది నామెకోక లక్షయములై నలుదెసల మేటులుగఁ బడియెను. అట మీఁద వలువల నొలువలేక సిగ్గుపడి దుస్స సేనుఁడవ్వలకుఁ దొలఁగెను.

అట్టి యమానుషకృత్యంబు నిండుకొలువున జరుగుచుండినను జండ శాసనుఁడగు దుర్యోధనుని భయంబున సభాసదులలో నొక్కరు నది యకార్యమని వారింపరైరి. అంతట భీమ సేనుఁడు మహాకోపోద్దీ పితుఁడై నరపతిసహస్ర మధ్యము నారీశిరోమణి నట్లు పరాభవపఱిచిన దురాత్ముని దుశ్శాసనుని జగద్భయంకరముగా వధియించివాని క్రొన్నెత్తురు త్రావుదుననియు, భరతకుల పాంసనుఁడైన దుర్యోధనుని గదాఘాతంబునఁ దొడలు విరుగఁ గట్టి చంపుదుననియు దారుణ ప్రతిజ్ఞలు చేసెను. జగత్త్రయంబు గెలువఁజాలు తేజో దర్పితులయ్యు ధర్మ పాశబద్ధులగుటం జేసి ధర్మపత్నీ పరాభవమును గన్నులారఁజూచి యు నేదియుఁ జేయఁజాలక పాండవు లూరకుండిరి. అప్పుడు కొల్వు కూటమున హాహాకారంబులు

సెలఁగెను. కురుకులవినాశకాలము సమీపించినదని కురువృద్ధజనంబు లొండొరులతోఁ జెప్పికొనిరి. అది యెల్లఁ దెలిసికొని ధృతరాష్ట్రుఁడులికిపడి కొడుకును, వానిసహకారులగు కర్ణాదులను బిలిచి చీవాట్లు పెట్టి ద్రుపదరాజపుత్రికను, పాండవులను రావించి సముచిత ప్రియభాషణముల వారియలుకఁదీర్చి వారి యర్థరాజ్యంబు వారికిచ్చి వారినింద్ర ప్రస్థపురంబున కంపెను. కష్టపడి కైతవంబుననొడిచిపుచ్చుకొనిన సిరులను గ్రుడ్డి రాజు నిష్కారణంబుగఁబ రులకిచ్చి వ్యాపారంబుఁబాడు సేసెనని పాపనిరతుఁడగు సుయోధనుఁడు బిట్టువగచి మఱల జూదమాడరమ్మని కౌంతేయాగ్రజునకు సందేశమంపెను. ప్రథమ ద్యూతముననైన పరాభవంబు చాలక యుధిష్ఠిరుఁడు పెండియు నెత్తమాడుటకు దంతిపురమున కరిగి యా రెండవ జూదమున నోడిపోయినవారు పంద్రెండు సంవత్సరము లరణ్యవాసమును నదిముగిసినపిదప నొక్కయే డజ్ఞాత వాసమును జేయునట్లు నియమ మేర్పరచుకొని జూదమాడి యందునుందానె పరాజితుడయ్యెను. సమయప్రకారంబు రాజ్యంబు కౌరవులయధీనముచేసి, ద్రుపద రాజపుత్రికయుఁ దమ్ములు వెంటరా యుధిష్ఠిరుఁ డరణ్యము నకరిగెను. కుంతీ దేవితనతనయులు వనవాసము సేయుకాలమునఁ బాండవ పక్షపాతియైనవిదురునియింట నుండెను. అభిమన్యుఁడును సుభద్రయు ద్వారకానగరమునకును ద్రౌపదీతనయులైన ప్రతివింధ్యాదికుమారులు పాంచాలపురమునకును బంపబడిరి. జూదము సురాపానముసొమ్ము వమ్ముసేయుట వాక్పారుష్యము మొదలగు దుర్వ్యసనములయందుఁ దగులు కొన్న వాఁడు భూమండలాఖండలుఁడైన నరపాలుఁడు కాని సకల శాస్త్రవేత్త యైన పండితుఁడు కాని మహామహిమ గలవాఁడుగా తప్పక చెడిపోవును. ఆర్గురు చక్రవర్తులలో రెండవ వాఁడై జగజ్జేగీయ మానయశస్కుఁడై సప్తద్వీప విస్తీర్ణమైన భూమండలమంతయు నేక చ్ఛత్రముగ నేలిన నలచక్రవర్తి దాయాదియైన పుష్కరునితో జూద మాడి సకల సంపదల రాజ్యమును గోల్పోయి తుట్టతుదకుఁదన యాలి నెడఁబాసి

తనకు మున్ను సామంతుఁడైన ఋతుపర్ణునియింట వంటలవాఁడై యనేక దుర్దశలపాలయ్యెను. దుర్వ్యసనాసక్తుఁడైన వానికడ నితర సద్గుణము లెన్నియున్నను నవి కానఁబడవు. కావున నెవ్వఁడు దుర్వ్యసనంబులం దగులఁగూడదు. అట్లు పాండవు లింద్రప్రస్థనగరమున నిరువదిమూడు సంవత్సరములు రాజ్యముచేసి తుదకు దాయాదులచేత వంచింపఁబడి సకల సౌఖ్యంబులు విడనాడి యరణ్యంబులు శరణ్యంబులుగా విహరింప నారంభించిరి. అచ్చట దురాత్ముఁడైన కిమ్మీరుఁడను రాక్షసుఁడు వారిం బరిమార్ప నరిగి దుష్టదానవ వనకృశానుఁడగు భీమసేనునిచేత నిహతుఁడయ్యెను. అరణ్యవాసకాలమునఁ బాండవుల కడకు నఖండతపోగరిష్ఠులగు ముని శ్రేష్ఠులనేకులు పోయి పుణ్య రాజర్షి కథాకథనంబులు చేసి వారి కందఱికి సంతసంబు గలిగించిరి. అందు బృహదశ్వమహాముని నిషధభూపాలుఁడగు నలుని చరిత్ర మెఱింగించెను. మార్కండేయమహాముని నృపాలచంద్రుఁడగు హరిశ్చంద్రుని యుపాఖ్యాన మెఱింగించెను. మఱియొక జడదారి దుష్టరాక్షసవిరాముఁడగు రాముని పావనచారిత్రముం దెలిపెను. మఱియు సావిత్రీచరిత్రము మొదలగు పుణ్యాంగనాకథ లెన్నియో వారు మహర్షుల వలన విని ధన్యులైరి. కీడులో తమకు నప్పుడప్పుడు మేలుకల్గుట నీప్రపంచమున మనమప్పుడప్పుడు చూచుచుందుము. కాంతారవాసక్లేశము ననుభవించు కాలములో సైతము పాండవేయులకు గొన్ని యుపకారములు జరిగెను. కృష్ణద్వైపాయన మహాముని యుపదేశమున నర్జునుఁ డింద్రకీలపర్వతమున కరిగి భక్త వత్సలుఁడగు మహేశ్వరుని గుఱించి తప మొనరించెను. ఆశంకరుఁ డతని యెడ నిజరూపమునఁ బ్రసన్నుఁడు గాక మాయాకిరాత వేషము ధరించి పార్వతి నొక చెంచు చెలువ జేసి జటాజూటమునకు మాఱుగా నెమిలిపింఛముల నౌదలఁ బెట్టికొని కాపాలమాలికలకు బదులుగాఁ గురువింద పేరులు దాల్చి లలాట నేత్రస్థానమున సింధూరతిలక మమర్చి పూపచందురుఁడుండు చోట మొగలిఱేకు గీలించి క్రీడి

తరుముకొనిపోవుచున్న యేదుపంది ని దానుకూడ దరుముకొనిపోయెను. ఆవరాహముపై నిరువురు చెఱి యొకయమ్ము వేసిరి. ఇరువురయలుఁగులు నొక్క సారిగ నక్కిటికం దగుల నది నేలంగూలె. నాబాణప్రహారమ్మున నీకిరి పడిన దని హరుండును నాశరఘాతంబున నిష్పంది వడియెనని నరుండును వాదులాడు కొనిరి. ఆకలహము వాగ్వాదములతోఁ ౘుదముట్టక ద్వంద్వయుద్ధముగాఁ బరిణమించెను. అప్రతిహతములగు గాండీవ నిర్ముక్త బాణములు మహేశ్వరునియెడ నిరర్థకములయ్యెను. అపుడు పార్థుఁడు కాలకంఠునిపై గలసి కలియంబడి మల్ల యుద్ధము గావించెను. అపుడు ధనంజయుని బాహుబలసార మెఱిఁగి చంద్ర శేఖరుఁడు కృపారసపూరిత మనస్కుఁడై ఫాల నేత్రముతోడను, ఫణిభూషణము లతోడను కాలకూటాంచిత గళముతోడను పులికళాసముతోడ నుపూప చంద్రునితోడను మందాకినీశోభితమౌళితోడను శూల హస్తముతోడను శుండాల చర్మము తోడనునంబి కాశోభితార్థ దేహంబుతోడను సాక్షాత్కరించి ప్రసన్నుఁడై యతని యస్త్రమువిద్యాకౌశలంబు పలుతెఱంగుల మెచ్చి కొనియాడి పాశుపతం బనుమహాస్త్రముప్రసాదించెను. అపుడు పార్థుఁడు చంద్రశేఖరున నేక విధంబులఁగొనియాడి వెండియు ఖండితానేక దుర్జయుఁడగునయ్యర్జునుఁడు దేవ రాజప్రార్థితుఁడై వేల్పులకు నిరంతర శత్రువు లగుని వాతక వచులనెడి దానవులను గాల కేయులనెడి దైత్యులను సంహరించి యమరవంద్యుఁడై యింద్రుని యాహ్వానమున నాకలోకమున కరిగి యింద్రునిభద్ర చింతామణీ పీఠంబునఁ గూరుచుండెను. పాండునందునులయశంబుమజ్జగంబుల వ్యాపించెను. అట్టులు మిక్కిలి సుకుమారులగుపాండునందనులను నాదిగ ర్భేశ్వరియగు యాజ్ఞసేనియు నారచీఱలుగట్టి దుంపలుఁగాయలుతిని యాకుటిండ్లఁ గాపురముండీ నదీతో యంబులం ద్రావుచు మృగములు కొండలు దమకు సహాయంబుగా నట్టడవుల నిట్టి వనరానికట్టి డుములు పడుచుండ దుష్ప్రారంభనిరతుఁడైన దుర్యోధనుఁడు వనవాసఖిన్నులైన పాండవులకుఁ దన మహైశ్వర్యంబుఁ జూపి

పరిహసించి పరిభవింపవలయు నని సంకల్పించి వనములనున్న పశువులకు బెబ్బులి మొదలగు మొకంబులవలన బీడ గల్గుచున్నదను వంకఁబట్టి దుశ్శాసనాది సోదరశతంబును రాధేయాదిమిత్రవర్గంబును సింధుగాంధార రాజప్రముఖ బంధుగణమునను భానుమతీప్రభృతి శుద్ధాంత కాంతాజనమునను నటవిటగాయక వైణిక విదూష కాదులునను చతురంగబలంబులును గొలువ ఘోషయాత్రకుఁ బయనమ్మై యడవులు కొండలు గడచి పాండవులు వాసముచేయుద్వైతవనమునకు సమీపమున తానును విడిసెను. సుయోధనునిసోదరు లచ్చట సరిగనుండక గంధర్వులసరోవరంబు గలఁచి వారలతోఁ గయ్యమునకుఁగాలు ద్రువ్వివారలచేఁ బోరున నోడింపఁబడి బంధింపఁబడిరి. దుర్యోధనుఁడు నమ్మిన చెలికాఁడును వీరుఁడును నగు కర్ణుఁడు కదనంబు విడిచి పలాయితుఁ డయ్యెను. రాజరా జగుదుర్యోధనుండును గంధర్వులచేఁ జిక్కె. అపుడు సేయునది లేక కౌరవులపరిచారకులు మహోదారచిత్తుఁడగు యుధిష్ఠిరుఁడె శరణం బని యాతని పాలికం జని కౌరవనాథునకు జరిగిన పరాభవంబు దెలిపి రక్షింపుఁడని ప్రార్థించిరి. అపకారికి నుపకారము సేయుటయే పరమధర్మ మని దన యాచరణముచేత లోకము నకు నీతి నేర్పునట్టి యామహాత్ముఁడు యుధిష్ఠిరుఁడు ప్రాంతపగ నెమ్మనమునఁ దలఁపక సుయోధనుండును సోదరుండె యని భావించి నిజ సోదరులఁ బార్థవృకోదరులఁబిలిచి గంధర్వులం గెలిచి కౌరవులకు బంధ మోక్షణము సేయునది యనియానతిచ్చెను. "కాఁగల కార్యము గంధర్వులు తీర్చిరి. దుర్యోధనుఁ డింతతో నాశము నొందు. సమర సన్నాహంబు లేకయే క్షతబలక్షయంబుగాకయె బంధునాశనంబు లేకయె యత్నమంబున మహీ రాజ్యంబు మనకుఁ జేకూరు. మనమిప్పుడూరకుండినం జాలుఁగావున క్షమియించి మమ్మీపనియందు నియోగింపకు" మని భీమార్జును లిరువురు వేఁడుకొన్నను వారి వేఁడికోలు త్రోసిపుచ్చి ధర్మనిష్ఠిత మనస్కుఁడగు యుధిష్ఠిరుఁడు వారి కిట్లనియె. తమ్ములారా! దుర్యోధనుండు

దురాచరణుఁడైనను నాకఁ దమ్ముఁడే. కావున నవశ్యము రక్షణీయుఁడు. అది యటుండనిండు. కౌరవులకు మనకు వైరములు కలిగినప్పుడు మన మైదుగుర మన్నదమ్ములము. మన మేవురము వేఱు. వారు నూర్గు రన్నదమ్ములు; వారు నూఱుగురు వేఱు, తప్పనప్పుడు మనలో మనము పోరాటము సల్పుకొనవచ్చును. కాని పరుఁడెత్తి వచ్చినప్పుడు మనము నూటయేవుర మన్నదమ్ములము. అందు నేను జ్యేష్ఠుఁడనుగావునఁ గనిష్ఠులందఱు నాకుఁ గాపఁదగినవారు. కావున మీ రవశ్యము పోయి వారిం జెఱ నుండి విడిపింపుఁడు. మీ రియ్యకొన రేని యిది నేనే పోవుదు నని రోసంబుగదుర బల్కుటయు భీమార్జునులు గదా గాండీవ పాణులై గంధర్వుల మీఁదికింజని వారితో ఘోర సంగ్రామంబుగావించి సుయోధనాదులను విడిపించిరి. ఆహా! యుధిష్ఠిరుని వంటి మహో దారశీలుఁడు ధర్మపరాయణుఁడు శరణాగతవత్సలుఁడు మఱియొకండు గలఁడె. అన్యోన్యసంహారంబు జేసికొనునంతటి తీవ్రక్రోధంబులు మనంబుల లో నున్న సమయంబున సైతము నెపములు సెప్పక నేరము లెన్నక ప్రాఁతతప్పులెంచి దెప్పక యాజన్మ శత్రుఁడయిన దురాచారునకు మహోపకారంబు చేసిన మహామహుఁడు ధర్మరాజుదక్క మఱియొక్క డుండుట యరిది. ఈవిధంబునఁ బలువెతలం గుడిచి పాండవేయులు వనవాసం బెట్టెటో గడపి సమయప్రకార మజ్ఞాతవాసంబు జేయవలసి యే దేశంబున నే వేషంబుల నేవృత్తుల నవలంబించి యాశ్రయించి యుండఁదగునని పెద్ద యుంత్రొద్దు విచారించి యెట్టకేలకు మత్స్యవిషయంబున విరాటుని గొలిచి యజ్ఞాతవాసదీక్ష గడుపవలయు నని నిశ్చయించిరి. ధర్మనందనుఁ డెల్ల విభవములబాసి సన్యాసివేషము ధరియించి కంకభట్టను పేరు పెట్టుకొని విరటునకు వినోదము లగుకథలు సెప్పుచు ధర్మము లుపదేశించుచుఁ గొలిచియుండుటకొడంబడియె. భీమసేనుఁడు పాకశాస్త్రకుశలుఁడగుటం జేసి వలలుఁ డనునామధేయము ధరించి విరటునియింట వంటలవాఁడయి యుండఁదలఁచెను.

పాండవమధ్యముఁడు పేడిరూపు గైకొని బృహన్నలాఖ్యను విరటుని యంతిపురమునం గాంతాజనములకు నృత్యవిద్య నేర్పుటకు నిశ్చయించెను. నకులుఁడు దామగ్రంథి యనునాహ్వయముఁ దాల్చి విరటునియింట నశ్వశిక్షకుఁడై యయ్యేడు గడుపఁదలంచెను. సహదేవుఁడు తంత్రీపాలుఁడనం సవరాఖ్యఁబూని వంత్సనాయకుని గోవులపరిపాలకుఁడయి యుండ సంకల్పించెను. ద్రుపద రాజపుత్రిక విరటుని దేవియగు సుధేష్ణను సైరంధ్రీరూపమునఁ గొలిచి యామెకుఁ బూలదండలు గ్రుచ్చి యిచ్చియు మంచి గంధంబు తీసి పూసియు మేనఁ దొడవులు దొడిగియు జడ లల్లియు వలువ లందిచ్చియు నుపచారములుచేసి మాలిని యను పేరు పెట్టికొని జాగరూకతతోఁ బ్రొద్దులుబుచ్చ నెంచెను. అవి యెల్ల వారివారి కుచితము లగువృత్తు లగుటం జేసి యుధిష్ఠిరుఁడు సమ్మతించి తాను సన్యాసిరూపము దాల్చి తక్కినవారిని వారివారికిం బోలిన వేషములఁ దాల్పుఁడనియానతిచ్చెను. వారట్లు చేసినపిదప గదాగాండీ వాదులగు మహాయుధములను శవాకారముగఁ గట్టి జమ్మిచెట్టు పయింబెట్టి యొకరుపోయినదారి నొకరుబోక వేఱు వేఱు త్రోవల విరాట నగరంబునకరిగి యాతేనికొలువున వారెల్లఁ గుదిరిరి. కటకటా! యీసంకటముల కన్నిఁటికి జూదము కారణముగదా? ద్యూతక్రీడా పరాయణుఁడగుటం జేసి కాదే విశ్వవిశ్వంభరా సంరక్షకుండగు మహీపతి మహాయతి యగుటయు, మహాబల దర్పితుఁడగు భీమసేనుని వంటి వాఁడు వంట వాఁడగుటయు, ధనుర్ధరులలో నగ్రగణ్యుఁ డగు క్రీడి పేడి యగుట యు, విశ్వరక్షకఁడగు నకులు డశ్వ శిక్షకుఁ డగుటయుఁ, బూజనీయుఁ డగు సహ దేవుని వంటి భూపాల కుఁడు గోపాలకుఁ డగుటయు, నారీశిరోరత్న మగు ద్రౌపది వంటి పురంధ్రి సైరంధ్రి యగుటయు, సంప్రాప్తించె. మందభాగ్యులు నట్ట డవుల నున్నను నగరంబులనున్నను నిడుమలు తప్పవు. అపంద్రెండు నెల లెట్లో కన్నులుమూసుకొని వారు పరులకుం దెలియకుండ గడుప

దలంచుకొనియుండ వారికిఁ గొన్ని యిక్కటు లక్కడ గూడ గలిగెను. విరటు నిమంతిఁదియగు కీచకుఁడు మహాసత్త్వసంపన్నుఁడై సింహబలుఁడను బిరుదమును దాల్చి తన బావం గొలిచియుండెను. అంతఁడొకనాఁడు తోఁబుట్టు వగు సుధేష్ణం గనఁబోయి యామెమందిరమునఁ బూవులుగ్రుచ్చుచున్న ద్రౌపదినిఁజూచి యామెపై వలపునిలిపి యా మెందన యంతిపురమునకు రమ్మని కోరెను. ఆవార్త యా మెరహ స్యముగ భీమ సేనున కెఱిగింప నతఁడు కీచకుని వానికి బాసటయ్యై వచ్చినవానినూర్వురు తమ్ములను జంపి ద్రౌపది యార్తింబాపెను. దుష్టవర్త నంబుగలవారి కెన్నటికయిన దుర్మరణము గలుగకపోదు. అట దుర్యోధనుఁడు పాండవులు వనవాసముచేయు పండ్రెండు వత్సరములు తానే భూమండలమంతయు నేక ఛ్చత్రముగ నేలి పదుమూడవయేట గొంతేయు లేదేశమున నజ్ఞాతవాసము చేయుచున్న వారో దెలిసి కొని మొదట జేసి కొన్న సమయమునుఁ బట్టి మరల ద్వాదశాబ్దములు కాంతార వాసమును నేకాబ్ద మజ్ఞాత వాసమును వారిచే జేయింపవలెనని తలపెట్టి వా రెందున్న వారో కనుఁగొని రమ్మని వేగులవాండ్ర బెక్కండ్రఁ నానా దేశముల కంపె. వారు పాండవులజాడలు తెలియజాలక మరలివచ్చిరి. దుర్యోధన ప్రేరితుఁడయి జగజెట్టి యగు మల్లుఁడొకఁడు నానారాజసభల కరిగి వారివారి సభలలో నున్న మల్లుర నెల్లర గెల్చి విరటుని కొల్వుకూటమున కరిగి యతని యాస్థానముననున్న మల్లురఁదనతోఁ గయ్యమునకు రమ్మని బిలిచిన విరటుఁడు వలలునింబంప నతనిచేత నిర్జితుఁడయ్యెను. ఆమల్లుని జయించినవాడు భీమసేనుఁ డయియుండునాయని యనుమానించి సుయోధనుడు వాని యుదంతము సొంతముగ నెఱిఁగి, రమ్మని యొక్క వేగులవానిం బనిచి యతఁ డెప్పుడువచ్చునా యని వాని రాకకయి ప్రతీక్షించుచుండెను.

# ద్వితీయప్రకరణము

అంత నొక్కనాఁడు దుర్యోధనుఁడు భీష్మ బాహ్లిక సోమదత్త భూరిశ్రవః ప్రముఖ కురువృద్ధులును గృప ద్రోణాశ్వత్థామ ప్రముఖ గురుజనంబులును దుశ్శాసనదుర్షణాది సోదరవర్గంబును శకునిజయద్రథ ప్రముఖ బంధుగణంబును రాధేయాదిమిత్రవర్గంబును గొలువ "హే కురుకుల కమలాకర ప్రభాకరా! దిగ్గంతిదంత విశ్రాంత యశోవిశాల! జయ జయ!" యని వందిమాగధులు కైవారములు సేయ నిండోలగంబుండె. అప్పుడు దౌవారికుఁ డరు దెంచి వినయంబు మెఱయఁ జేతులు మొగిడ్చి సుయోధనునికట్టెదుట నిలిచి "దేవా! బదరి కాశ్రమ మఁట. ముని యట. పేరు చారాయణుఁడట. దేవర సందర్శనార్థము వచ్చియున్న వాఁడఁట. ముదలయయ్యేనేని యాజడదారింగొని తెత్తు" నని విన్న వించెను. విన్న వించుటయు రాజరాజు తక్షణంబే వానిం బ్రవేశ పెట్టు మని యానతిచ్చుటయు దౌవారికుఁడు సత్వరంబ ద్వారంబుకడ కరిగి యాతాపసిని వెంటఁ బెట్టుకొని తేనికడకరిగి "యదె దుర్యోధనమహారా" జని యాపలకుం బోయెను. రారాజు వానింగని గద్దియ మీఁదనుండియె కేలు మొగిడ్చి యుచితాసనంబు నెట్టించి యందుఁ గూర్చుండఁ బనిచి మెల్లననిట్లనియె. "దేవా! మీరెందుండి యిందులకు విజయము చేసితిరి. మీచరణారవిందరజంబున మాసభాభవనమును బావనముఁ జేయుటకుఁ గారణ మేమి? నాతో మీ కుంగలకార్యమెద్ది" యనియడగెను. అడుగుటయు లేఁతనవ్వు చేత మొగ మించుక వికసింప నతఁడిట్లనియె. "సుయోధనా! మహీమండలం బేకచ్ఛత్రంబుగా ఏలుచున్న రాజరాజు దర్శనముఁ జేయుటకై వచ్చి తిని. భీష్ముని భుజాబలంబును విదురుని బుద్ధిబలంబును గౌరవసామ్రాజ్య లక్ష్మికిఁ బెట్టనికోట లై శత్రు దుర్గమము లై యుండ నీవు భూమండలాఖండలుండవై యఖిల సౌఖ్యంబు లవ్వారిగ

ననుభవించుచుంటివి. నీ కేకొఱంతయు లేదు. ఐనను నిర్హేతుక జాయమాన కృపావి శేషంబునఁగొన్ని లోకోత్తరధర్మంబులు నీకుపదేశింప మేమిట వచ్చితిమి. అవి యాలకించుటకు నీకును నీప్రాణమిత్రులగు రాధేయాదులు కునిచ్చగల దేని మీకు రహస్యంబున నవి యుప దేశింపఁగలవాఁడ. మాయుపదేశంబులు మీకుఁ బరమ శ్రేయోదాయకంబులు. అడవులలో ముక్కు మూసికొని పరమతపోనిరూఢులై యుండవలసినముని జనంబులకు పుడమి ఱేఁడులగొడవ లెందుల కని మీరందు రేమో! మాకీగొడవల వలనం బ్రయోజనంబులు లేవు. మేము గజంబులఁ గోరము. హయవ్రజంబులఁ గోరము. హారంబు లపేక్షింపము. అగ్రహారం బుల పేక్షింపము. ధనంబు లక్కర లేదు. సాధనంబులక్కఱ లేదు. నీవార ముష్టింపచులమ్మై కుక్షింభరణము జేసికొని కాలము గడుపఁగలము. ఐననుమేఘంబు లయాచితంబులై వసుంధరందడుపును. ఎవ్వరు వేఁడకున్నను మ్రాకులు పండ్లనొసంగును. అట్లె మముబోటిమౌనులు సయిత మెవరును ప్రార్థింపక యుపదేశంబున కర్హులగు వారికి ధర్మోపదేశంబులు స్వయముగఁ జేయుచుందురు. అదికారణంబుగ మేమిటవచ్చితిమి. ఈ రేయినీ యంతపురికి వచ్చి నీవును నీప్రాణమిత్రుఁ డగుమిత్రపుత్త్రుఁడును నీగారాబు సైదోడగు దుస్స సేనుడును నీ మేనమామయగు సౌబలుఁడును నీసమక్షంబున నుండ నేజేయవలసినయుప దేశంబులు చేసెద" ననియూ రకుండుటయు ధార్త రాష్ట్రుఁడు వాని వంక తెప్పవాల్పక యించుక చూచి "యట్లె యగుఁగాక. ఈ రేయి పెందలకడ మీరు నానగరునకు దయసేయుఁ" డని సేవకు నొక్కని బిలిచి "యోరీ! ఈ మహాత్మునిఁ దోడ్కొనిపోయి బ్రహ్మమఠంబున విడియించి వాని కభీష్టములుగ సమస్త పదార్థంబులు సమకూర్పు" మని యానతిచ్చెను. మౌనియుఁ గొలువువిడిచి యాసేవకుని వెంట జనియెను. బదరికావనవాసి యగు మహాముని యేమినిమిత్తమునని త్తఱి నిక్కురు రాజసభ నలంకరించి యుండునని సభాసదు లెవరికి దోచిన పోలిక వారు

కారణంబుల నరసిరి, కాని యిదమిత్థమని నిర్ణయింపఁ జాల రైరి. దుష్ట చతుష్టయంబని పేరువడిన దుర్యోధన దుశ్శాసన కర్ణ సౌబలులను దలవాచునట్లు చీవాట్లు పెట్టుట కైయమ్మౌని యరుదెంచె నని కొందఱు బదరి కాశ్రమతాపసు లంద అప్పనికై వీనిబంపి యుందు రని కొందఱు గుసగుసలువోవఁజొచ్చిరి. అప్పుడు సాయంకాలము కావచ్చెను. సంధ్యా సమయసముచిత కృత్యములఁ దీర్చుట కై గాంగేయప్రముఖకురువృద్ధులును భారద్వాజ శారద్వతప్రముఖు లగు వైదికులును గొలువు విడిచిచనిరి.

అంతట భాస్కరుఁడ స్తమించెను. అంధకారంబు నలుదెసల నావరించెను. ధార్తరాష్ట్రులు బంధుమిత్రసహితులై కడుసుఖంబునవిందు లారగించిరి. సుయోధనుఁడు రాధేయ సౌబలదుశ్శాసనులం గూడి చారాయణునిరాక కెదురుచూచుచు నొక్క గదిలోఁ గూరుచుండెను, అప్పుడంతఃపురపరిచారకుఁ డొక్కఁడరుదెంచి ''దేవా! మనకురంగకుఁడు వచ్చియున్నవాఁడు. ఇప్పుడే దేవరవారిదర్శనము సేయఁ గోరుచున్నవాఁ'' డని విన్నవించెను. ''ఏమీ! కురంగకుఁడా నేను వాని నంపి యొక్క మాసమైన గాలేదు. వీనిపాదము లయోమయములు గాఁబోలు ఇంతసత్వరంబ వచ్చున నినే నెన్నఁడుఁ దలంపలేదు. రానిమ్ము.'' అని సుయోధనుఁ డానతిచ్చెను. అంతఁ బరిచారకుఁడు ద్వారముకడకరిగి కురంగకుఁదన వెంటఁ బెట్టుకొని మహారాజు నెదుటికిఁ గొనిపోయి వాని నక్కడనిలిపి తాను మరల ద్వారపాలనంబున కరిగెను. కురంగకుఁడు నేల జాఁగిలంబడి మునుముగా రాజరాజునకు సాష్టాంగ దండప్రణామము మాచరించి యనంతరమున కర్ణసౌబలయువరాజులకు వేఱువేఱుగా జోహారు లొనర్చి ముకుళితహస్తుఁడై యెట్టయెదుట నిలువంబడియెను. అప్పుడు రాజరాజు వాని మొగముంజూచి ''కురంగకా! నేను నిన్ననిపి నెలయైనను గాలేదు. నీ కాళ్ళు కట్టెవో యినపవో యై యుండవలయును. గాని యెల్లర పాదములవలె

నస్థిమాంసరక్త మేదో మయములు గావని తోచుచున్నది. అట్లి కాకున్న నెక్కడి మత్స్యదేశ మెక్కడిహస్తిపురము ఏతెఱంగున నింతయల్ప కాలంబున నప్పటికరిగి మరల రాగలిగితివి? మత్స్యవిషయంబున కరుగక యొచ్చటనో నిన్నాళ్ళు దాగియుండి మేవో కల్లబొల్లిపలుకులు నాతో జెప్పునట్టివాఁడవు నీవు కావని నీపూర్వ చరిత్రము చెప్పుచున్నది. నీవింత వేగంబున నెట్లు రాఁగలిగితివో ముందుగా వినఁగుతూహల మగుచున్నది. అది ముందు విన్నవించి పాండురాజుకు మారులవృత్తాంత మవ్వల విన్నవింపవచ్చు. కాని యీ రేయి నీవృత్తాంతము వినుటకు మా కవకాశము లేదు. బదరికాశ్రమ వాసి యగు మహర్షి యెక్కరుండు నాదర్శనంబున కిప్పుడే వచ్చు. అతనితో మేము రహస్యము గఁగొండొకని విచారింపవలయు. కావున నీ వీరేయి నిలయంబున కరగి నిరంతరప్రయాణంబుల నలసిన నీయంగకంబులకు విశ్రమ మొసంగుము. "శరీరమాద్యం ఖలుధర్మసాధన" మ్మనుమాట వినియుందువుగద! అదియునుఁగాక నీవియోగంబున దుఃఖితు లైన యాలుబిడ్డలను గన్ను లారఁ గని వారుచేయు నుపచారంబుల శ్రమ వాపికొని యెల్లి నన్ను జూడరవమ్ము పొ" మ్మని యానతిచ్చి నను గురంగకుఁడు రాజసమక్షము వాసి పోవక మేదియో విన్నవింప నుంకించి సందేహాయత్తచిత్తుఁడై యున్న వాఁడపోలె నిల్చియుండెను. అదిగనిగాంధా రేయాగ్రజుఁడిట్లనియె. కురంగకా! నిన్ను జూడ నీ పెద్ది యోవిశేషవిషయము మాతో విన్నవింపవలయు నని తలంచుచున్నట్లు కానబడుచున్నది. నీతలపు నీముఖ దర్శనంబుననించుక గానంబడి యెడు పాండు రాజకుమారులవృ త్తాంత మటుండనిచ్చి మాకువిన్న వింపవలసిన విశేషవిషయములుండిన పక్షమున వానిని సంగ్రహముగ నెఱింఁగింపుము. కాలయాపనము సేయకుము. తాపసుఁడుపచ్చుసమయమ్మైనది. అనవుడుగురంగకుఁడు కురు రాజు పాదములపయింబడి "దేవా"! నన్ను రక్షింపవలయు నేను గొప్ప తప్పు గావించితిని. ఆ తప్పు సైరించి యేలినవారు నన్నేలుకొనవలయు నని గడుంగడు వేడుకొనుచున్నాఁడను. నారాయణుఁడు దేవర వారి సన్నిధికి

రాఁడు, స్వామి కార్యపరాయణు డైనమీబంటే చారాయణుండు. మారు వేషములు దాల్చి చిరపరిచతులనేని భ్రమపెట్టగల నా యద్వితీయ ప్రతిభావిశేషంబు దేవరవారికిఁ బ్రత్యక్షముగఁ జూపు వేడుకచే నేనుమున్ను పాండురాజకుమార సన్నిధానంబున కరుగునప్పుడు తాల్చి నయాతాపసరూపమే మీయెదుటఁ బ్రదర్శించినాఁడ. చిన్న నాఁటఁ బగటివేసములు గట్టి మాతండ్రితోఁ గూడ దేశంబులుతిరిగి సంపాదించిన యనుభవము నాకీసమయమునన క్కఱకు వచ్చుచున్నది. మానవుఁడు జీవయాత్ర జరుపుటకై యుంచ్ఛవృత్తిచేయనీ నీచవృత్తి చేయనీ యేవృత్తితానవలంబించునో యావృత్తియం దగ్రగణ్యుఁడు కావలయును. ఇదియే నాసంకల్పము. దేవర వారికి పందలకొలఁది చారులు గలరు. కాని యావేగులవాండ్రలోఁ గురంగకుఁడే ప్రథమగణ్యుఁడని పేరెన్ని కఁగాంచుటకై కడుయత్నము చేసితిని. నా యత్నమునేఁడు సఫలమైనది. నావిద్య నేఁడు సార్థకమైనది. వేయేల! నాజన్మము చరితార్థమైనది. ఏలయన నా వేష భాషల చేత నూతన పురుషులను వంచించుట యొక ప్రజ్ఞగాదు. చిరకాలమునుండి నన్నును నాకంఠమును నామాటనుజక్కఁగాగు ర్తెరింగిన దేవర వారిని సౌబలరాధేయ దుశ్శాసనులను గూడ నేను భ్రమపెట్టఁగలుగుటచే నాప్రజ్ఞ యనన్య సాధ్యంబని నేనిప్పుడు గరువతన మును బూనఁదగినంత మేటినైతి నని నాకెంతో సంతోషము గలుగుచున్నది. కావున దేవరవారు పుత్ర వాత్సల్యము నా పైనిలిపి నన్ను మన్నింపవలయునని మఱియొక సారి వేఁడుకొనుచున్న" వాఁడ అని పాదము లువిడిచి లేచినిలువంబడెను. అప్ప త్తాంతమువిని దుర్యోధనుడు మిక్కిలివిస్మితుఁడై "యేమీ! నీవేచారాయణుండవా. ఎన్ని యేండ్లనుండి యో నిన్నెఱిఁగియునిన్నా నవాలు పట్టజాలక పోతినే. మిత్రుఁడా! కర్ణుఁడా! ఏమి యీకురంగకుని ప్రజ్ఞావి శేషము. మనలో నొక్కఁడైన వీనింబోల్ప లేక పోయెనే. చారాయణుఁడు నిజముగా మహర్షి యనుకొంటిమే" యనిపలుక రాధేయుఁడు "మిత్రమా! పట్టపగలు రచ్చలోనె మనముగుర్తింపఁజాలమైతిమి. నడికి రేయి దీపాల

వెలుగునవీని నానవాలు పట్టగలుగుదుమా ఇట్టి యద్భుతప్రజ్ఞా విశేషము గలకురంగకునకు నీవుచారశిఖామణియనిబిరుదునీయఁదగు'' నని నుడివెను. ఎట్టిబిరుదులకైన వీఁడుతగిన వాఁడెయనిదుశ్శాసనుఁడు పచియించెను. ఇట్టి వేగులు మఱిపదుగురు మనపనిలో నుందు రేని దిగంతవృత్తాంతములనేని మనము కరతలామలకముగ నెఱుంగవచ్చునని శకుని వక్కాణించెను. "ఓరీ! నేడునీకు నేనుచారశిఖామణియని బిరుదు నొసంగినాఁడ. ఆ పేరనీవు బర గుదువు గాక'' యని రాజరాజు వానికి ముక్తహార మొకటి పారితోషిక మిచ్చి వానినింగౌరవించెను. మొదటినుండియు దేవర వారి కరుణచేతనె బెరిగి నాఁడను. ఈశరీరమె దేవరవారిది. అనిభయభక్తిసంభ్రమంబులు గదురఁగురంగకుఁడు పలికెను. అప్పుడు కౌరవేంద్రుఁడు వానితో నిట్లనియె. కురంగకా! అట్లయిన నీవు హస్తిపురంబువిడుచుటయాదిగా నేఁడు నన్ను సందర్శించు వఱకు నేమిజఱిగినదో నదియెల్ల నాకు సవిస్తరముగవిన్న వింపుము. నీ వార్తలు వినుటకై మాచిత్తములు మిక్కిలి తత్తఱపడుచున్నవి.''

అనుటయుఁజారాయణుడిట్లు విన్న వించెను. ''దేవా! అవధరింపుము. నేను దేవరవారికొలువులో నుండఁగా నన్ను భీమార్జుననకులసహదేవులు పలుమారు చూచియుండుటం జేసి నానిజరూపంబుతో నేనువిరాటునిపురి కఱిగిన యెడల వారక్కడనుండిన పక్షమున నన్నుగుర్తింతు రేమోయనుభయమున నా నామధేయ రూపధేయాదు లెవ్వరి కిందెలియకుండ[వ్రేలుజడలు బిరుసుగడ్డములు మఱ్ఱిపాలతోఁ బగటి వేస గాండ్రవంత గిలించుకొన్న తెఱఁగున నేనుందగిలించుకొని మేన నెడమించుక యు లేనట్లు బూదిపూ సికొని నార వలువ గట్టుకొని జపమాల గేలఁ గీలించి నారాయణస్మరణము జేసికొనుచు విరటునికొలువుకూటమున కరిగితిని. నన్ను దవ్వుదవ్వులఁజూచి విరటుఁడు తద్దయు బత్తిగదురగద్దియ నుండి లేచెను. అతనితో దనసభాస్థారు లందఱులేచి నిలువంబడిరి. తాఁడు నాకెదురుగ వచ్చె. రేనితోడ

మంత్రిపురోహిత ప్రముఖులును నాకు బ్రత్యుత్థానముసలిపిరి. రేనియాసతినతనిపురోహితుఁడునాకర్ఘ్య పాద్యాదులొసఁగి గౌరవించెను. ద్వైపాయనప్రముఖమహర్షులు మీసమక్షమునుకు వచ్చునప్పుడు దేవరవారు వారికెంత బత్తిసేయుదురోయెంతగౌరవంబుసల్పుదురో యెంతవిన యంబుజూపుదురో విరాటుఁ నాకును నంతబత్తియు నంతగౌరవంబు నంతవినయంబుజూపె. పొట్టపొడిచి ననచ్చరంబు లేనివాఁనయ్యు వమన్ను మీసన్నిధానంబున మహర్షులుచే సెడిమహోపన్యాసము లప్పుడప్పుడు విని నాలు గెంగిలి ముక్కలు నేర్చిన వాఁడగుటఁదత్కాలోచితసంభాషణంబులు సముచితముగ జరిపి యితఁడు పండితశిరోమణి యని వాఱంద అనుకొనునట్లు నటియించితిని. నన్నుచితాసనాసీనుం జేసినపిదప విరాటుఁడు నన్నుంజూచి చేతులు మోడ్చి ''మహానుభావా! మీనామధేయాదు లెరుంగజాలనందుకు మమ్ముక్షమింపదగును. దేవరవా రెందుండివచ్చిరో యేమికారణంబున మమ్ముధన్యులం జేయ నెంచిరో మాకెఱిగింపవలెనను వేఁడుచున్నాను. ''ఊరక రారు మహాత్ము లన్న'' మాట నిక్కము. కావున మిమ్మిక్కడకి దోడి తెచ్చిన కార్య మెఱుంగఁగాగోరుచున్నాఁడను. అని వేఁడుటయు నేనువప్పుడుమధుర భాషణంబుల నిట్లంటి. ''రాజా! మేము త్రిలోకసంచారులము. తపోధనుల మనుమాటమాజడలు మాగడ్డములు మాబిరుసు మేనులు మాస్ఫటికాక్షసూత్రములు నోరు లేకయె మీకు జెప్పుచున్నవి. నాకు నీవలననే ప్రయోజనంబును లేదు. కమండలమే గాని భూమండలము మాకక్కఱ లేదు. దండములెగాని వేదండములతోఁ బనిలేదు. ధనంబులు జీవన సాధనంబులు మాకవశ్యములు గావు. వనంబుల యందెగాని యుపవనంబుల యందు మేము విహరింపము. వైరాగ్యముచేతనే మేమేమియుంగోరము. అది యటుండ జలాశనులమై పర్ణభక్షులమై కందమూలాహారులమై యూర్ధ్వబాహులమై జితేంద్రియులమై పంచాగ్ని మధ్యమునను మహావర్షంబులను నట్ట నడిశీతకాలంబునను వేఁడికి

వానకుఁజలికి జంకక యత్యుగ్రతపంబులు నేసి యింద్రాది దేవతలను గడగడ వడంకించి ముజ్జగంబుల నుబ్బూతలూచిన మేము నిరంతరముఁ బర రాష్ట్రాక్రమణశీలురై యన్యోన్యనిర్మూలనాసక్తులై భోగైకపరాయణులై పాపభీతియేకోశంబున లేక రాజనీతినెపంబున నీదోస మాదోసమనకు యెల్ల కలుషంబులఁ జేతులారఁ జేయుచు నిరుపేదతనంబున సంసారసాగరము నీఁడ లేక మిమ్మాశ్రయింపవచ్చిన యనుజీవులకు ధనంబులిచ్చి చేయించుచు రూపంబులు గైకొన్న పాపంబులో యనునట్లు చరియించు రాజుల యొద్దకు మేము ప్రయోజనంబులు గలిగి వత్తుమా మీవలన భూములు, ధనములు గైకొందుమా మాకున్న భూములు మాకుఁజాలును. జీవించునంత కాల మరణ్యభూములు. చచ్చినపిదప శ్మశానభూములు. ఇవియెమా భూములు. సింగంపుంగద్దియుల బసిండిమిద్దియుల మేడవాడలఁగాపుర ముండునంతనె మీరు మహామహులుగారు. అక్రమంబున విక్రమంబులు నెరపి యన్య రాజన్యుల జన్యరంగముల నొడిచి వారి యూళులు బొక్కసంబులు గొల్లఁగొని కాంచనకిరీటంబులు తారహారములు చీని చీనాంబరములు తాల్చినంతన మీరు లోకవంద్యులు కారు. ఎప్పటికిని రాజులు రాజులె; మునులు మునులె. మేము భూలోకంబునంగల రాజలందఱనుజూచి యేరాజుల దేశంబులు సుభిక్షంబులై యున్నవో యే తేనిం జూచుకొని ప్రకృతిజనములు తలిదండ్రులమఱచి బంధుమిత్రుల మఱచి సుఖించుచున్నారో యెవ్వరిపాలనంబు పండు వెన్నెలఁబోలెకువలయానందంబు గల్గించి చల్లఁదనంబు నిచ్చుచున్నదో యేమహీపాలుఁడు శిష్టరక్షణదుష్టశిక్షణచరుఁడై జగద్వినుతుఁడగుచున్నవాఁడో వెయ్యేల! యెవఁడు రాజశబ్దమున కర్హుఁడై యున్న వాఁడో తెలిసి కొనఁగోరి యెల్ల దేశంబులఁదిరిగితి. కురు దేశంబునకరిగినాఁడ. సుయోధనుపరిపాలనంబుఁ జూచినాఁడ. అతనిపాలనంబు నాకంత నచ్చలేదు. తొల్లి యుధిష్ఠిరునిపరిపాలనంబు సర్వవిధంబులఁ బ్రశంసనీయం బని వినుచున్నాఁడగాని యది యిప్పుడు

కథావశేషమై యున్నది గాన నప్రస్తుతము. మంఱియు మగధమద్రమాళవదేశంబులను సింధుచేది దేశం బులను గనినాఁడ. కురు దేశపరిపాలనమె నాకంత నచ్చ నప్పుడు తక్కిన రాజులపాలనంబులు రుచించునా? మీవీటఁ గొన్ని దినము లుండి పోయెద'' నని నేనుపలుకుటయు మత్స్యనాయకుఁడు మీచిత్తమువచ్చి నంత కాలముండుఁడని సవినయంబుగఁ బలికె. నే నాతనియింటఁ బదిదినములుంటి. మహానసములు కొలుపుకూటములు నర్తనశాలలు పాఠశాలలు లాయములు గోష్ఠములు మఠములు దేవాలయనములు ప్రమదావనములు మున్నగు తావులెల్లఁ జక్కఁగం బరిశీలించితి. పాండునందనులజాడ నాకెందుంగనరాదయ్యె. కాని యొక్క విశేషంబు పొడకట్టితి. అది విన్న వించెద. అందేదైన గ్రాహ్యమగు విషయమున్న దేవర వారు గ్రహింపఁదగు. విరటునింటి వంటలవాఁడు దీర్ఘకాయుఁడు, ఆజానుబాహుఁడు, మహాబలసంపన్నుఁడు, పాకశాస్త్రకుశలుఁడు వాఁడు భీమసేనుఁడని స్పష్టముగఁ జెప్పఁజాలఁగాని దేవరవారు పంపిన మల్లుఁడ వానిచే నిర్జింపఁబడుట ఏతను నన్యసాధ్యుఁడగు సింహబలుని సానుజముగ నెవ్వఁడో విరటునివీట జంపుట చేతను మల్లుం గెలిచిన వాఁడును గీచకుని గీటడంచినవాఁడు భీముఁడై యుండునా యనుమానము పొడముచున్నది, కంటికి గనబడుచున్న పొగనుట్టి కనబకడపోయిననులోన నిప్పున్నదని మనమూహించునట్లె యీకార్యంబులంబట్టి మహాబలుడెవ్వడో యవ్వీట నున్న వాడనియు నతడు భీముడేయై యుండవలయు ననియు మన మూహింపవచ్చును. అదియునుగాక యవ్విరటునికొలువ నొక్క సన్యాసి కలఁడు. అతని పేరు కంకుభట్టు. అబ్బబ్బ! అత నిప్రజ్ఞత నేమని వర్ణింతు. వేదముగాదు వేదాంతముగాదు శాస్త్రములుగావు పురాణములుగావు వానికి రానివిద్యలులేవు. వాని కడుపు విద్దెలగని. నామాటలంబట్టి నేనేమోవేద వేదాంగ వేదినని భ్రమపడి నన్ను బ్రహ్మవిషయమున నతఁడు కొన్ని ప్రశ్నలడిగెను. "మౌనమే భూషణము మూఢమానవున" కన్నట్లు

నేవోపంకలుగల్పించి వారితో వాదముతప్పించుకొని పరువునిలుపుకొంటి. అతఁడెవ్వఁడో తెలిసినది కాదు. అతనిపూర్వవృత్తాంత మెఱిగినవా రెవ్వరులేరు. అతడెవడో యరయవలయు అతడు ప్రచ్ఛన్న రూపముననున్న వాడుగాని నిజమైనసన్యాసి కాడు. మహీమండలమునంతయు పరిపాలింపఁదగిన శుభలక్షణము లాతనికడ గలవు. అతడేల సన్యసింపవలసెనో తెలియదు. అతఁడు విరటునకు ధర్మాధర్మములు కార్యాకార్యములు తెలియఁజెప్పుచుండు. అతఁడున్నంత సేపు సభకళకళలాడుచుండును. అతఁడు యుధిష్ఠిరుడై యుండునా యని నాకు గట్టియనుమానము కలదు. ఇవియే నా యెఱిగిన విషయములు. మీద దేవరచిత్తము.'' అని యూరకుండెను. అనవుడు దుర్యోధనుడు ''కురంగకా! నీబుద్ధిసూక్ష్మతకు మెచ్చితి. వంటవాడు భీముడైయుండవచ్చు. సన్యాసి యుధిష్ఠిరుఁ డగునో కాఁడో చెప్పఁజాల. ఐననరయ వలయు. పాండవులు విరటునియింట నున్న యెడల మనము విరాటుని పసులం బట్టుదు మేని వారానరనాయకునకు సహాయులై తప్పక వత్తురు. వచ్చినప్పుఁడు మనము తప్పక గుర్తించిమరల వారిని బంౘ్రెండుసంవత్సరములు వనవాసమునకు నొక యేఁడజ్ఞాతవాసమునకుఁ బంపఁగలము. పంపి మరల భూమండలమంతయు మేము యేకాత పత్రముగఁ బాలింపఁ గలము. దళంబులుగూర్చుకొనక వ్యూహంబులు పన్నక కదనంబు సేయక యశ్రమమున రాజ్యంబు మరల నాయధీనము జేసికొందు. మిత్రుఁడా! కర్ణుడ! మామా! శకుని! తమ్ముఁడా! దుశ్శాసన! మీ కందఱకిది సమ్మతంబె'' యని పలుకుటయు రాధేయుఁడు ''దేవా! నీవంటిబుద్ధిమంతు లీనాఁటిరాజులలో నెవ్వరుగలరు? నీచెప్పినచొప్పున మత్స్యభూపాలుని పసులంబట్టుట కర్తవ్యము. పుట్టలోని పాములనాగ స్వరంబుఁబట్టి వెలికి రావించినట్లు ప్రచ్ఛన్నులైయున్న పాండవులను గోగ్రహణముచేత మనము వెలిపుచ్చఁగలము. తెగువఁజేసి గోరక్షణార్థము విన్వచ్చుఁడు వచ్చునేని సమరముఖమున గాఢశిలీముఖములఁ బఱపి వాని

నింద్ర లోకంబున కంపెద. అతఁడు చచ్చినఁ దక్కినపాండవులు చత్తురు దానితో నెల్లపోరుడెగు'' నని బీరంబులు పలికెను. ధర్మరాజు జూదప్రియుఁడు. ఇప్పుడొకవేళ వారిని మనముగుర్తింప లేకపోయినను నజ్ఞాతవాసానంతరమున రాజ్యమిమ్మని వారు వచ్చి నప్పుడు మరల ధర్మరాజుచేత జూదమాడించి వాని నోడించి సర్వభ్రష్టునిఁ జేయఁగలను. భయపడకుఁడు'' అని శకునిపలికెను. ''గోగ్రహణమే యవశ్యా చరణీయ'' మని దుశ్శాసనుఁడు పలికెను. అంతయఁ గురంగకు నకుఁ దగినబసద నంబులిచ్చి దుర్యోధనుఁడు రాధేయాదులకు సెలవిచ్చి తానభ్యంతరమందిరమున కరిగెను.

***

# తృతీయ ప్రకరణము

కడచిన రాత్రి సుయోధనుఁడు సూతనందనప్రముఖులతో నట్లు మంతనముండి కార్యంబు తెఱఁగు నిశ్చయించియు గాంగేయాదికురు వృద్ధ జనంబులమతం బెఱుఁగఁగోరి మఱునాఁడు సభాభవనమునకు వచ్చి నిండోలగముండి పాండవుల జాడ నెఱుఁగుటకుఁ దగునుపాయంబుల నెఱిగించువారు కలరేయని సభాస్తారుల నడిగెను. ఆప్రశ్నములకు భీష్ముం డిట్లనియె. "పాండవు లెందున్న వారని యడుగ నక్కఱ లేదు. పాండురాజకుమారులు పాంచాల రాజతనయం గూడి యేనాట నుందు రానాట సస్యము లేపుగ పెరుగు. వసుంధరయన్న పేరు దనకు సార్థకంబుగ బంగారు తీఁగెలు మొదలగు నెల్ల ధాన్యములు పండు. మొదవులు పిదుకక యపాలిచ్చు. గోబ్రాహ్మణవృద్ధి విశేషముగనగు. పలుమాట లేల? జను లేకొఱఁత లేక పాడిపంటలు గలిగి సిరిసంపదలుగలిగి సుఖంబున మనుచుందురు. అట్టిదేశ మేదో మీర యఱసికొనుఁడు. చారులతోఁ బనియేమి. దేశసంచారులతోఁ బనియేమి?" అని యాతఁ డూరకుండ సుయోధనానుజుఁడగు దుర్మర్షణుఁ డిట్లు పల్కెను. "ఇంతకుమున్ను మన వేగుల వాండ్రు సకల దేశముల కరిగి పాండునందనులజాడ దెలియుటకై బహు ప్రయత్నములు సలిపిరి. వారిజాడ రవంతయుఁ దెలియలేదు. అడవులలో వారిడుమలు గుడువ లేక కృశించి చచ్చియుందురు. చచ్చిన వారి కొఱకై వెదకుట వెఱ్ఱిగాదె? పాండు నందనులు బ్రదికి యున్నవారు. మనమీఁది కెన్నడో యెత్తివచ్చి తమ రాజ్యంబు తమకిమ్మని యెన్నడో యడుగుదురని మనలో మనమే యూహించుకొని వితర్కములు చేసికొని కానిపోని సిద్ధాంతములు గావించుకొని నిష్కారణముగ మననీడలు చూచుకొని భయపడుచున్నాము. ఇంక మీమనంబులనుండి భీతిఁ బాఱఁదోలి శాంతి నెలకొల్పుఁడు" అనవుడు గృపాచార్యుఁ డిట్లని యె

"మహాత్ముఁడైన శాంతనవుఁడు పలికినపలుకులు నిక్కువంబులు పాండవేయులు వసియించు దేశంబు సకల సౌఖ్యభాజనంబై యుండు కావున నట్టి దేశ మరయుట కర్తవ్యం బగుఁగాని వారు గతించి రని యుదాసీనులమై యుండుట యుక్తంబు గాదు. అడవులలో నిడుమలు గుడువ లేక చచ్చుటకు వారంత దుర్బలులు గారు. కిరాతుల చేత సింహశార్దూలాది మృగములుచేతఁ జిక్కి మడయుటకుఁ దేజోవిహీనులుగారు. పదునాలుగవయేఁట మనతోఁ గయ్యంబు సంభవించు నని యెఱిఁగి మున్ను తనను వరుణుఁడు సకరుణుఁడై యొసఁగిన గాండీవంబు నక్షయతూణీరంబులు చాలక పార్థుఁడు భక్తవత్సలుఁడగు చంద్రమౌళింగూర్చి తపంబొనర్చి వాని యనుగ్రహంబునకుఁ బాత్రమై పాశుపతమహాస్త్రముం బడసెను. అట్లు రాజ్యసంపాదనార్థము నానావిధ ప్రయత్నములు సల్పుచున్న బాండవులను మనము చులకతనంబునఁ జూచుట రాచపాడి కాదు." అనుటయు రాధేయుఁడు సుయోధనుం జూచి "రాజ రాజ! గాంగేయుఁడు చెప్పిన యెల్లశుభలక్షణంబులు మత్స్యదేశంబునఁ బొడగట్టుచున్నవి. కావున మత్స్యదేశంబుపై విడిసి యాలేనిపసులం బట్టుట కర్తవ్యము. పాండవు లచ్చట నుండిరా వారిని గుర్తించి మనోరథ సిద్ధిం జేసికొనవచ్చు. లేకపోవుదురా విరటుని ధనంబులు గోధనంబులు చూరలాడి మనప్రాంతపగ దీర్చికొనవచ్చు." అని కొలువులో నున్న వారందఱుఁదమతమ దోచినంతెఱఁగున బల్కుటయు రారాజు వారి యభి ప్రాయము లెల్లవిని యిట్టు లనియె. "పాండవులు విరాటునిప్రోలనున్న వారనియె నేనును నమ్ముచున్న వాఁడ. సింహబలునకు వలపు గొల్పిన చక్కఁదనంపుటిక్క ద్రుపదపుత్త్రియై యండనోపుఁగాని మఱియొక్కర్తుగాదు. సింహబలునిఁ గడ తేర్చిన మేటి మగఁడు వడముడి గావలయుఁ గాని మఱియొకండు కాఁజాలఁడు. సింహబలుఁ డన్యుల చేతఁ జావఁడు. వాఁడు జరాసంధతుల విక్రముఁడు. ప్రధనంబున జరాసంధు నిధనంబు నొదించిన బకమర్దనుఁడె

కీచకుని పీచ మడఁచి యుండవలయుఁ గావున సర్వవిధముల వారు విరాటుపుటభేదనమున నున్న వారని తోఁచెడిని. కావున వానిపసులం బట్టుట కర్తవ్యము. ఇందులకు మీరందఱు నాకు బాసటయై నిలువవలయు. ఈవిషయమున మనకభిప్రాయభేద ముండఁదగదు. "అని నుడవ సభామధ్యంబున నున్న త్రిగర్త దేశాధీశ్వరుఁడగు సుశర్మ తన పీఠము నుండి లేచి రారాజున కిట్లనియె" కురునాథా! యీ తెఱంగున గార్యనిశ్చయము చేసినందులకు నేను మిక్కిలి సంతసించితిని. విరటుఁడు కౌరవులకు శత్రువు గాని మిత్రుఁడుగాఁడు. అతని మీఁదికి మనము దాడి వెడలుట యధర్మముగాదు. అది యటుండ నేనును విరాటుఁడను బ్రాఁత పగతురము. తొల్లి యొకానొక కారణమున నాచేని మఱఁదియగు సింహబలుఁడు నాతోఁగలహించి నన్ను రణమునఁ గెలిచి పరాజితుఁడ నగునన్నుఁ బరాభవించె. ఆకారణంబున విరటుఁడను నాకు దాయయై యున్న వాఁడు. అతని మీఁది కరుగుట పెండ్లికరుగుట. కావున నతనిమీఁదికి నన్ను నుపుము. అతని గరువము నడంచుట కిదియె యదను. నాకీయుపకారము చేసి మన్నింపుము." అనవుడు నీతండ యిప్పటికిఁ దగినవాఁడని రాధేయుండు పలికె. అప్పుడు ధార్తరాష్ట్రాగ్రజుఁడు దాని కియ్యకొని "సుశర్మ! నీవు నీబలవములఁ గూర్చు కొని చలమున విరాటపురంబునకరిగి దక్షిణంపు దెసనున్న యాల మందలఁ బొదివిబట్టుము. నేను భీష్మద్రోణకృపాదియోధవరులఁ గూర్చుకొని కురు సైన్యముల తోడ్కొని యుత్తర గోగ్రహణము చేసెద. ఇరువురమి రుప్రక్కలఁ దాకితిమేని విరటుఁడు ఱెక్కలు తెగిన పులుఁగుంబోలె నేలంగూలు. కావున నెల్లినీవు పైనమ్మైపొమ్ము. అమఱునాఁడు మేమరుదెంచెదము" అని కురువల్లభుఁ —నాటికిఁ గొలువుసాలించెను.

పూర్వదినమున నిశ్చితమ్మైన తెఱఁగున మరునాడు త్రిగర్త —యకుడగు సుశర్మ తనదళములు గూర్చుకొని మత్స్యరాజుమీది కరిగెను.

అరుగునప్పుడు తనజాడలు విరటునకు వానిపసులకాపరులకు దెలియు నసుభయమున రణనిస్సాణము మ్రోయింపక సైన్య కలకలధ్వని గానియ్యక పదాతులపాద ఘట్టనల యులివు బయలు పడకుండ హయర ఘట్టననాదము గాకుండ రేలు దివ్వెలు వెలిగింపక నిశ్శబ్దముగ బయనము చేసెను. అక్కతమున బగతురు పైబడు వఱకు మిక్కిలి నిపుణు లైన విరటుని వేగులవాండ్రకు గాని పసులకాపరులకు గాని మూడ దలచిన కీడు జాడయైనం దెలియదయ్యె. అట్లు వచ్చి విరటునిగోగణ మున్న తావు గుర్తించి యరాబలవయులు నలుదెసలు వముట్టడించెనం. గోపాలకులు భయవిస్మయములు మనముల మల్లడిగొన సుశర్మ సైనికులతోఁ దమసేర్చిన కొలంది పోరి కాలోచితమగు ప్రతిక్రియలు చేసిరి. కాని వారిప్రయత్నంబులు కారుచిచ్చుపైఁ బోసిన నల్పజలబిందువులట్లునిష్ఫలము లయ్యెను. అంతట వారు భయభ్రాంతులై పరుగెత్తి పురంబునకుం జని మత్స్యమానవేంద్రునితో దుష్టవర్తనుఁడగు త్రిగర్త సర్వేశ్వరుఁడు దండువెడలి దొంగపోటునఁ గదుపులఁ జుట్టుముట్టి పట్టెనని కుయి పెట్టిరి. వారికుయ్యాలించివిరాటుఁడు రోషారుణిత నేత్రుడై "ఏమేమి! త్రిగర్త నరనాయకుఁడు దొంగపోటునవచ్చి మనతొట్టులం బట్టెనా! ఈతనికింతవుగంటిమి యెన్నఁడు గలిగె! సింహబలుఁడు కాలధర్మ మొందెఁగదాయని శౌర్యంబుఁ జూప ధైర్యంబున వచ్చియుండెను గాఁబోలు. మున్నితఁ డొక్కసారి పొగరెక్కి తన లావు నొరులలావుఁ దెలియఁజాలక తనవంటి దండిమగఁడు జగంబున లేఁడని గర్వించి దండితారాతివుండలుఁ డగు మాకీచకుని మీఁదికి దాడి వెడలినప్పుడతంఁడు వీనిదళంబుల దూదిపింజల ట్లెగురఁగొట్ట వీని జెఱవెట్టి వాని చుట్టములు పలుమాఱు వేఁడుకొన కనికరంబుఁ జూపి వీనివిడిచిపుచ్చె. నాఁడు సింహబలశస్త్రహతుల వీనికాయంబున బడిన గాయంబులు పరీక్షించినచో నేఁడును గానఁబడవచ్చు. అదెబ్బతో వీఁడు మరల మా దేశంబువంక నైనఁజూడఁ జాలకపోయెను. పంచానన విక్రముఁడగు కీచకుఁడు పంచత్వము నొందుటం జేసి మత్స్యవిషయంబున మేటిమగలు

లేరని వచ్చెఁగాఁబోలు! తొల్లింటిపరాభవంబున వీనికి బుద్ధిరాలేదు గావున వీని నీసారి నిష్కారుణముగఁ దాఁకి కీచకుని సన్నిధానంబునకుఁ బంపెద'' నని సేనానాయుకులం బిలిచి చతురంగ బలంబుల సన్నాహంబు సేయుఁడని యానతిచ్చి తాను కవచంబు దొడిగికొని శిరంబున బొమిడికంబు పెట్టి వేగవంతము నుత్తమజాతులు నగు హయంబులం బూన్చినయరదం బెక్కి గదాధనుఃఖడ్గాది సాధనంబులును తూణీరంబులును రథముపైఁ బెట్టించి మహీసురులు మహదాశీర్వచనంబులు చేయ భేరీ భాంకరణంబులు మిన్ను పగులునట్లు మ్రోయ వందిమాగధుల కైవారంబులు నాలకించుచుఁ బౌరులు జయజయధ్వనులు సేయ యుద్ధ సన్నద్ధుఁడై బైలు దేరెను. బైలుదేరు సమయంబునఁ గంకభట్టు విరటునిసన్నిధి కరిగి యిట్లనియె. ''రాజా! నేను మీకువిన్న వింపవలసిన విషయమొక్కటి కలదు. సావధానంబుగ నాలకింపుఁడు. మీబానిసీఁడగు వలలుఁడు మహాభుజబల సంపన్నుఁడు. ఆలమున నీతని కెట్టి పగతురును నిలువఁ జాలరు. సురాసుర దుర్నిరీక్ష్య ప్రతాపుఁడు, వానిలావును వానిమగంటిమియు నాఁడు మల్లునితో నతఁడు పోరునప్పుడు మీ రెఱిగితిరిగదా! ఈతని ధైర్య సాహసముల నేనెఱుంగుదును. ఈతఁడు చిరకాలము పాండవ జ్యేష్ఠుఁడగు యుధిష్ఠిరునండ నుండి బ్రతికినవాఁడు. వానియనుగ్రహంబునకుం బాత్రుఁడైనవాఁడు. స్వామి కార్యైకపరాయణుఁడు. అతని మాట మటుండనిండు. దేవరవారి హయశిక్షకుఁడగు దామగ్రంథి పరిపంథి నృపాల హృదయగ్రంథియై యెంతటి జోదునైన సరకుకొననివాఁడు మీగోపాలకుఁడగు తంత్రీపాలుఁడు కత్తి చేతఁబట్టెనా పురాంతకము రాంతుకుల నైన నిర్జించు ననుట నతిశయోక్తి కాదు. నేను వీరిని మున్ను సైత మెఱుంగుదు. ఇఁకనాస్వవిషయమించుక విన్నవించెద. క్షమింపుఁడు. నేను కాలవశంబునఁ గారణాం తరమున సన్యసించితిని గాని మున్ను గృహస్థాశ్రమమున నున్న కాలమున దాయలతోడఁ బోరాటంబులు సలిపినవాఁడనె, పిన్న నాఁట గురుశుశ్రూషగావించి విలువిద్దియ గఱచిన

వాడనె. నేఁడు దండంబుపట్టినను మున్ను కోదండబుపట్టిన చేతు లేయివి. ఇవే జ్యాంకిణాంకవముల హస్తవములం జూడుము. ఇపుడు కాషాయాంబరంబులు గట్టిన యీ మేను మున్ను వజ్రకవచంబులఁ దాల్చెనుసుమీ. జపమాలలు ధరియించునీచేయి కరవాలములఁ బట్టినది సుమా. కావున నేనును నీకుఁ దోడై యుద్ధము సేయవలెనని తలంపు గలిగియున్నది. ఈ వలలుని నీ దామగ్రంధి నీ తంత్రీపాలుని నన్నుఁ బోరునకు రాననుజ్ఞయిమ్ము వల యుక్కైదువుల నిచ్చి యరదంబు లిచ్చి ముమ్మాటికిఁ బంపుము. మేమాలమున నెట్టివిక్రమంబు నెఱపుదుమో నీవు చూతువు. బీరంబులు పలుకుట సజ్జనలక్షణంబు గాదు. చేత గంటె బూని వంటచేసి వడ్డించు పాచకుఁడను, గుఱ్ఱములఁ గాయుదామ గ్రంధియు, నాలమందల మేపుతంత్రీపాలుఁడు, సర్వసంగపరిత్యాగి యైన సన్యాసియు నెదిరి మూకలతోఁ బోరాటంబులు సల్పఁదగుదురేయని నీవు సందియం బొందుదువేమో యట్టిసందియంబునకు మీమనంబున నెడమీయవలదు. ఆపద్ధర్మములుగా వారందఱు నీచవృత్తుల నాశ్రయించి జీవించుచున్నను భూవినుత ప్రతాపవంతులగుటచేతఁ గడిమి మెఱసి నీకు సాయంబు గావింపఁగలరు. నేను నట్టివాఁడనె. నీ సేవఁజేసి నీయన్న ముదిని బ్రతికి నీపై బగతురు దాడి పెట్టినప్పుడు మాయెడళ్ళు దాఁచి కొనుట రాజద్రోహము గావున మమ్మెుకరుడుగకుండఁగనే స్వయముగ వచ్చుచుంటిమి. వలలుఁడు దామగ్రంథియుఁ దంత్రీపాలుఁడును దమకుఁ గల రణకుతూహలంబు నీతో విన్న వింపుమని నన్ను బ్రార్థించుటం జేసి యింతవఱకు వారింగూర్చి చెప్పితి. మీద నీచిత్తము'' అని యూరకుండెను. అప్పలుకులు విని మేదినీశ్వరుఁడు ఏపుట్టలో నేపామున్నదో వీరకడ నెంతెంత మహిమలున్నవో యెవ్వరెఱుంగుదురు? అనాహూతులయ్యు రాజభక్తి ప్రేరితులై తమంతటదాము కయ్యమున కియ్యకొనుచున్న నెయ్యురను వలదని నిరాకరించుట శ్రేయంబుగాదుగదా'' యని తనలో విచారించిలెంకలం బిలిచి కంకభట్టునకు వలలునకు దామగ్రంథి

తంత్రీపాలురకు నరదంబులనాయత్తంబు చేసి వలయు నానా యుధంబులనిచ్చి సంగ్రామరంగంబునకుఁ బంపునది యని యానతిచ్చి "నా పోషణంబుననె యుండి నన్నె నమ్ముకొని యున్న నోరెఱుఁగని యాపశువుల నరపశువగు సుశర్మ యెట్టి పీడ పెట్టుచున్న వాఁడో గదా" యని చింతించి వానిసుశర్మబారినుండి విడిపించుట కై తత్తరపడుచు స్యందనం బతిరయంబున దోలుమనిసూతునితోఁజెప్పి త్వరితముగఁ దోలించెను. రథమల్పకాలమున బసులబీడులకడకుఁబోయెను. రాజచ్చటికిఁబోయిచూచునప్పటికి సుశర్మ సైనికులు పరాక్రమలవదుర్విదగ్ధులై యిల్లలుకఁగానె పండుగయ్యె నదని నమ్మిన వెడఁగులట్లె పసులంబట్టఁగానె తమకు విజయంబు సేకూరినదనినమ్మి సంతోష పరవశులై యొండొరులతోఁ బ్రియభాషణంబులా డుకొనుచు చప్పటలం జఱచుచు మహాకోలాహలంబుగా వించుచుండిరి. ఆత్మరక్షకుఁడైన నరనాథునిమూర్తి నేత్ర గోచరంబగుడు గణనాతీతములైన యాగోవులన్ని యునొక్క సారి దమ యులివు మిన్నుముట్ట నం బేయని యఱచి యాతేనివంక చూడ్కులు నిగుడించి తమ యాపదమాటలచేఁ దెలుపలేకయార్పుల విన్నవించెను. మునుముందు సామంబున గార్యంబుచక్కఁబడునేమో యని భ్రమపడి రాజనీతికోవిదుఁడగు విరటుఁడు నిష్కారణముగ సంగరంబుసలిపి నిరపరాధులైన యోధుల నిరుపంకలఁ జంపనేల; పశువుల విడిచి పొమ్మని సుశర్మకు రాయబార మంపెను. గాని యతఁడు సహజముగ దుర్మదాంధుఁడగుటను విశేషించిను యోధన ప్రేరితుఁ డగుటచేను వాని కాసామవాక్యములు రుచియింపకపోయె. అంత విరటుఁడు కలహారంభమునకుఁ దొడగి చేయివీ చుటయు నతనిబలంబులు సుశర్మబలంబుల పైఁబడియె. అప్పుఁడు సందడిక య్యంబుప్రవర్తిల్లెను. ఏనుఁగులేనుఁగులతోడను, ఆశ్వికులాశ్వికుల తోడను బదాతులుబదాతులతోడను రథికులు రథికులతోడను ధనువులు కుంతములు తోమరములు శూలములు కరవాలములు చక్రంబులు గైకొని

యన్యోన్యసంహారకృతనిశ్చయులై యిరుదెసల నున్న జోదులు ఘోరముగా బోరిరి. అరదంబులు విఱిగినప్పుడు నూతనస్యందనములఁ దెప్పించి యెక్కువారును, హయంబులు లయంబు నొందుతఱిఁగ్రొత్త మావులం దెచ్చి రథంబులకుఁ బూన్చు వారును, సారథినిహతుం డైనప్పుడుతాను రథంబుదోలుకొనుచు యుద్ధముసేయువారును, దాయలయలగులు దాఁకి క్షణకాలము మూర్ఛవోయియు వెండియు నప్పుడు తెలిసి పగతుని జేరం బిలిచి "ఓరీ! నేను నీయలుగుల పోటులఁ గీటడంగితి" నని తలంచి సంతసించుచున్న వాఁడవుగాబోలు! నిన్ను జంపక నే నుజావనుసుమీ యని వెండియు విజృంభించి పోరువారును సైయోధులునానాప్రకారముల సమరము చేసిరి. అయ్యుభయ సైన్యములయందును బిఱికి గండగలవాఁడును భీతమనస్కుఁడును వెనుకంజనిడ్డవాఁడును వెన్నిచ్చి పఱచినవాఁడును రారమ్మని యెదిరించిబిలువని వాఁడు ను గుండెచెదరిన వాఁడును పరువెత్తఁ దమకించువాఁడును నుసురు దాచుకొన్న వాఁడును నరుల యేటుల కుంబోటులకుం జంకినవాఁడును నొక్కఁడును లేఁడు. కత్తిపోటులచేత నొడళ్ళు జల్లెడవలెఁ జిల్లులువడినను జిమ్మిలిగొట్టముల నుండి వచ్చుమచ్చున గ్రొన్నెత్తురు లోడిక గట్టి పాఱుచుండినను మేననుసురులున్నంత దనుకఁ జేయుఁగదపుటకను వైనంతదనుక విల్లు కత్తియుఁబట్ట నోపిక యున్నంతదనుకఁ బోరిజోదులూరకుండరైరి. ఆపోలికలను మృత్యుదేవత విహరించుమందిరమట్లు నెత్తురువఱదలతో డను బీనుంగు పెంటలతో డను విఱిగినవిండ్లతోడను గాలుసేతులు లేని కాయములతోడను నతిభయంకరమ్మై యుండె. సుశర్మ సైన్యములు దైన్యమునొందె. అపుడు విరాటుఁడు తనసారథింబిలిచి "అల్లదె! సుశర్మ శతాంగము కానఁబడుచున్నది. అతని యరదము దెసకు నాయరదముఁ బోవనిమ్ము, నాపసులంబట్టి నాకలమటఁ గలిగించి నన్నుఁబరాభవింపఁ దలఁచియతఁడెంతో కష్టపడి యిచ్చటికి వచ్చె. అతనికి మనము రణభిక్షము పెట్టవలయును. కావున నతనికి నా చేతిలావు రుచిచూపి

యాజన్మాంతమునాపోటు జ్ఞాపకముండునట్లు చేసెద. తోలుతోలు" మని వానిం ద్వర పెట్టెను. అతఁడును నేలికకు త్సాహము గలుగు వాక్యములు పలికి త్రిగర్తనాయకుఁడున్న దెసకు రథముఁదో లెను. ఆతని వెనుకనిహత శాత్రవానీకుఁ డగుశ తానీకుఁడును దృణీకృతసహస్రాక్షుఁడగు మది రాక్షుఁడనును సుస్థిర చిత్తుండగు సూర్యదత్తుఁడునుమున్ను గాఁగల వానితమ్ములును సమరనిశ్శంకుఁడగు శంఖుఁడు మొదలుగా గల కొడుకులును కంకభట వలలప్రముఖులు నరిగిరి. విరటుని తేరు సుశర్మ రథమున కెదురుగానిలిచెను. ఆవీరులిద్దఱు ధనుష్టం కారములు చేసిరోష భీషణముఖులై మూర్తీభవించిన వీరరసములో యనునట్లు పుంఖానుపుంఖములుగ నన్యోన్య శరీరముల మీఁద నెడ తెఱపి లేక శరములు విడిచిరి.

ఉభయ సైన్యములు నోహరిసాహరిం బెనఁగి సందిడిక య్యముసలిపె. సుశర్మ తీవ్రనారాచములు నేసి విరటునిహయములఁ జంపెను. సూతుఁడు నూతనహయములఁ దెచ్చి యరదమునకుఁగట్టు లోపలఁ ద్రిగర్తనాథుఁడు వాని శిరఃకర్తన మలరించెను. సారథియు రథ్యములు లేనియాయరదమునం దుండజాలక విరటుండు కృపాణపాణి యైనేలకుఱికెను. రథరథ్యసారథి సమేతుఁడైన సుశర్మ విరథుఁడగు విరటుని మీఁదఁ గవిసి యాతనిం బట్టుకొని తనస్యందనము పైనిడికొ నితనకు లభించిన మహావిజయము ఘోషించుటకయి శంఖనాదముగా వించెను. ఆవిజయము నెఱిఁగిత్రిగర్త సైనికులు మహానందభరితులై మిన్ను పగులునట్లు భేరీభాంకరణములు శంఖనాదములుగావించిరి. విరాటునిసైన్యములు దైన్యమునొందిహాహాకారములు చేసెను. సుశర్మ దుర్మదమున తనచేతం జిక్కినవిరాటుని జూచి "యోహో! వైరివృనాకాంతారద వానలుడగు మత్స్యనాథుడా! దుస్సహ తేజో మార్తాండులరగు మీరు మాయరదంబు నెక్కనేల? మమ్ముఁ బట్టి గా రాగృహబద్ధులం జేయఁదలఁచి వచ్చితిరా? ఇంతమాత్రపుం బ్రతాపమునకా నీకింత పొగరు! హయంబులఁ గాచికొనఁ

జాలనివాఁడవు, సూతునిసంరక్షింప నేరనివాఁడవు, స్యందనంబు నడుపుకొన లేనివాఁడవు, సాంగ్రామిక శాస్త్రజ్ఞాన శూన్యుఁడవు నీవా జగత్త్రయవినుత శౌర్య సాగరుఁడగునా వంటి మహావీరునితోఁబోరాటంబు సేయుట. సంగరంబున నీయంతరవేమి, నాయంతర వేమి? స్వబలపరబలపరిజ్ఞానము లేక వచ్చినందులకు నీకిప్పుడైనబుద్ధివచ్చినదా? మున్ను మఱంది యగుకీచకునియండ నుండికోడిపుంజువ లెఁ గయ్యములకుఁ గాలుదువ్వినాయంతవాఁడు లేఁడని విఱ్ఱవీగితివి. ఇప్పుడాపొగరేమైనది? పాపము నీమఱఁదివియోగమునకు మిక్కిలివ గచుచుంటివి గాఁబోలు! అతని సన్నిధికే నిన్నిప్పుడని పెద నుండుము, అని మనము నొచ్చునట్లు మిక్కిలి నిష్ఠురము లగుపలుకులు పలికెను. అది విని విరటుఁడు విషణ్ణహృదయుఁడు గాక. "ఓరీ మూర్ఖ? జయాపజయములు దైవికములు ఈయల్పజయమున కింతవిఱ్ఱవీగఁ దగదు. రణమున మరణమునొందుట రాజకుమారుల కపేక్షణీయ మేగదా కావున మరణమునకు జడియువాఁడను గాను గావున నీయిచ్ఛ వచ్చి నట్లు చేయుము" అని యూరకుండెను. అత్తరి యుధిష్ఠిరుఁడు తనయేలిక యగువిరాటుఁడు విరోధిహస్తమునఁ జిక్కుటదూరమునుండి కనిపెట్టి విషాదపూరితమనస్కుఁడై భీమ సేనునికడకుఁ బోయి యాతనితో నిట్లనియె. "తమ్ముఁడా! చూచితావా యీమత్స్యమహారాజున కెంత దురవస్థసంభవించినదో. ఈతఁడు విరథుఁడై దురాత్ముఁడై నసుశర్మచే తంజిక్కెను. అన్నిచుఁడిన్నరపతి కేమియెగ్గు సేయునో యనినామనంబు మిక్కిలి శోకించుచున్నది. ఈత నియాశ్రయంబునంగాదె మనమే పురుమజ్ఞాత వాసప్రతిజ్ఞా సముద్రము భద్రముగ దాఁటంగలిగితిమి. ఈ తనియాదరంబునం జేసి కాదె కొఱంతగోరంతయు లేక యీ యేఁడుకడ జూచితిమి. ఈతేనిమన్న నలచేతఁ గాదె మనమందఱము వర్థిల్లి తిమి. ఇట్టి మహోప కారి యిట్టి మహాత్యాగి పగరచేతం జిక్కి స్రుక్కి వేఱుభంగి యగుచుండుట మనకు న్యాయమే కావున నేను నీవును మాద్రేయులును

మేనులు దాఁచికొనక కంఠములఁ బ్రాణములుండునంతవఱకుఁబోరి యీతేని బంధవిముక్తుం జేయవలయు. కాలయాపనమున కవకాశము లేదు. రండు మీరందఱు నావెంట" నని పలుకుటయు వాయునందనుండు యుధిష్ఠిరున కిట్లనియె. "అన్నయ్యా! కృతజ్ఞత సూపుటకిదె యవకాశంబని యెఱుంగుదు. మత్స్యనాథుని విడిపించుటకన్న మన కాచరణీయమ్మైన కార్యము లేదు. ఇదే నీవు చూచుచుండ నిప్పుడ యాసాల వృక్షంబు పెఱికి దానితో సుశర్మనుగొట్టి యాప్రాఁకున కెన్నియా కులు గలవో వానిమే నన్నితునియులు గావించెద. విరటుని విడిపించెదను. నీకానందము గలిగించెద. చూచుచుండు" మని యరదంబుడిగ్గి యాప్రానిదెసకుఁబోవ నుంకించుచుండ నజాతశత్రుఁడు వానిని వారించి "తమ్ముడా! యెంత తోఁచిన నంత సేయదగదు. కార్యంబులు విమర్శించి చేయఁదగినవి. నీవిప్పు డామహీరుహముం బెఱికి పగతుపై నుఱికి మగఁటిమి నెఱపుదువేని చూపరు ఈయాకారంబును నీవిక్రమ పరాక్రంబును గనుంగొని యీతఁడు పాండవుఁ డగుభీమ సేనుఁడని తప్పక నిరూపింపకపోరు. నిరూపింతురేని మనకు సమయభంగంబు గాకపోదు. సమయభంగ మగునేని మరలఁ బండ్రెండేఁడులు వనవాసంబును నొక్కయేఁ డజ్ఞాత వాసంబును జేయవలయు. మనయజ్ఞాత వాసదీక్ష యెల్లియె యమ్మఱునాఁడొ సమాప్తమగును, ఇంతలో మనము వేగిరపడి కార్యభంగము సేసికొనుట యీనఁగాచినచేను నునక్కల పాలు సేసికొనుట గాదె. కావున నీసంరంభవముపసంహరించిలోక సామాన్యములగు ధనుర్గదా ఖడ్గసాధనముల గ్రహియించి నకుల సహదేవులు నీకుఁ జక్రరక్షకులుగా సుశర్మపై బోయి విక్రమింపుము" అనవుడు వల్లెయని యమ్మహావీరుఁడు కవలు దనకుంజక్రరక్షకులుగా సుశర్మపైఁ జనెను. యుధిష్ఠిరుం డొకప్రక్కనుండియు వాయునందను డొకప్రక్కనుండియుఁ ద్రిగర్తనాథునిం దాఁకిరి. అజాతశత్రుఁడు వేలకొలఁదియరదముల నుగ్గుసేసి పేరువడిన మహారథికుల నెందఱినో కూల్చి త్రిగర్త సైన్యముల నొక్క కడకుం దెచ్చె.

భీమసేనుఁడు గదా పాణియయి మృత్యుదేవత విహరించిన చందమున సైనికుల నెల్లఁజంపి భయంకరవిహారుఁ డయ్యెను. హత శేషులైన త్రిగర్త సైనికులు పలాయనపరాయణు లైరి. అపుడు భీమ సేనుఁడు త్రిగర్తనాథుని చెంతకుఁ దనయరదము వోవనిచ్చి తనయరదము మీఁదినుండి గుభాలునవాని స్యందనముమీఁది కుఱికెను. అయ్యద నెఱిఁగి విరాటుఁడు పగతుని శతాంగమునుండి యొకగదఁ దీసికొని నేల కుఱికి సుశర్మ రథ్యములఁ జావమోదెను. అంతలో భీమసేనుఁడు సుశర్మచేతినుండి విల్లులాగికొని విఱిచి యవలఁబాఱ వైచి వానిచేతులు రెండును వెనుకకు విఱిచికట్టి వానినివిరాటున కర్పించెను. విరటుఁ డుల్ల సోక్తులతో వానిమనము నొప్పింపక చేతుల కట్లు విప్పుఁడని యానతిచ్చి యరదము మీఁదనె వానింగూర్చుండఁబెట్టి శిబిరమునకు దోడ్కొనిరమ్మని శాసించెను. అట్ల యగుఁగాక యని భీమసేనుఁడు వానిచేతులకట్లు విప్పి యరద ముమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని పోయెను. అపుడు సాయంకాలమయ్యె. చిగిర్చిన మావిమోకవలె భానుఁడు చరమాద్రిని శోభిల్లెను. క్రమక్రమముగ భానుఁడస్త మింప నలుదెసలఁ జీఁకటు లావరించెను. కయ్యము తుదముట్టెను. రెండు గడియలకుఁ జంద్రోదయమమ్యెను. చండతర సూర్యతాపమునను మహాశస్త్రాగ్ని తాపమునను బగలెల్ల వేఁగి వాడిన జోదుల యంగకములకు వేదన యుపశమిల్లునట్లు దన కిరణములనియెడు గొట్టములద్వారమునఁ జల్లదనం బనుదివ్యౌషధము వోయుచున్నాఁడో యనునట్లు జాబిల్లి యెల్లయెడల శైత్యంబు వెదఁజల్లుచుండె. అప్పుడు యుధిష్ఠిరుఁడు మత్స్యనాయకుని చేరంజని "రాజా! దైవానుగ్రహమున విజయము నొందితివి. దురాత్ముఁడైన సుశర్మచేత నీవు చిక్కినపుడు వాఁడేమి సేయునోయని నేను తద్దయు వగచితి. తొలుదొల్త విజయలక్ష్మి వానిచేఁ జిక్కినదయ్యు నన్నీచు ప్రోల నుండ నొల్లక గుణరత్నాకరుఁడవగు నీకడనెయుండఁ దలంచి వచ్చినిది. ఇంతకు మాభాగ ధేయములు బాగున్నవి. నీవంటిసజ్జనునకు దైవమపకారము సేయునె" యని కొండొక

ప్రశంసించుటయు నమ్మహీవల్లభుడు మెల్లన నతని కిట్లనియె. "కంకభట్టా! ఈవిజయము నీవలనఁ జేకూరినది. ఈకయ్యమున నేను దాయచేఁ పరాజితుఁడనై వానిచేఁ బట్టుపడి మగఁటిమి యెల్లఁ గోల్పోయి సిగ్గుపడి వానియరదమున నుంటి. అత్తఱి నీవాపలలుని దామగ్రంధిని దంత్రిపాలుని నాసహాయమునకనిపి నీవును సుశర్మం దాఁకితివి. ఆవలలుని సాహస మునం జేసి కాదెనేను నేలకు ఱుకంఁగలిగితిని. ఆవంటలవాడ కాదె య లోకసామాన్య శౌర్యము నెఱపి సుశర్మ స్యందనము మీఁదికుఱికి నన్నువిడిపించి వానిం బట్టుకొని తెక్కలు విఱిచికట్టి నాయెట్టయెదుటం బెట్టె. అట్టి దండిమగని నేనెందుంగని యెఱుంగ. వారందఱు నీయాన మెలంగువారు. ఈవిజయము నీకతన లభ్యమైనది. కావున నీమత్స్య రాజ్యము నాకక్కఱలేదు. నిన్ను దీని కభిషిక్తుంజేసెద. వలలుఁడు మున్ను గాఁ గలవా రందఱు సేనాపతులై యుండ నిమ్మహీతలము నీవేలికొనుము. ఆపద్బాంధవుఁడవుప్రాణరక్షకుఁడవునగు నిన్నుం గొలిచి నాతమ్ములు నాసచివులు నేనును మనియెదము. దీనికియ్య కొనవే" యని చేతులు మోడ్చి వేఁడికొనియె. అజాతశత్రుఁ డా కేలుదోయిఁబట్టుకొని కటకటంబడి "రాజా! యెంతమాట. నేను ను దక్కిన వారును నీయాశ్రయమునం జేరి బ్రతికినవారము. విపత్సమయమున నిన్నుఁ గాచుట మాకువిధి. మే మతిశయముగాఁ జేసినదిందేమియు లేదు. నీ రాజ్యము మాకక్కఱలేదు. నీయనుగ్రహం బె మాకుఁ గావలయు నే నిప్పు డొక్కకోరికె గోరెద నది చేసినంజాలు. పరాజితుఁడైన సుశర్మను సపరివారముగా విడిచి పుచ్చుము. అది నాకు సామ్రాజ్యప్రదానము." అని కోరుటయు నారాజువాని యౌదార్యమునకు విస్మితుఁడై యట్ల కాక యని సుశర్మ విడిచి పుచ్చెను. దక్షిణగోగ్రహణము సేసిన సుశర్మ పరాజయమును బరాభవమును బొంది సైన్యముఁగోల్పోయి దీనముఖుఁడై శిబిరమునకుంబోయె. గోపాలురు విరటుని పనులను మరలించుకొని గోష్ఠములకుంబోయిరి. అప్పుడు ధర్మరాజా విరటునింజూచి "రాజా! మన మీరేయి పురమున కఱుగక

శిబిరమునఁ గడపుదము. రేపు పురము ప్రవేశింపవచ్చు. ఇంతలో మన విజయమంగళవార్తలు నగరమున జాటుటకై వేగవంతులగు బంట్లం పంపుము. పట్టణమెల్ల నలంకరింపుమనుము. దుమ్మడఁగునట్లు వీధుల మంచిగంధంపు నీళ్ళు చల్లు మనుము ప్రతిగృహమున జయపతాకము నిలుపుమనుము. ద్వారములు గట్టు మనుము. ఇది పండువుగా నెన్ను కొమ్మని చెప్పి పంపుము." అని యుపదేశింప విరాటుఁడు వేగవంతులగు లెంకలం బిలిచి వారితో యుధిష్ఠిరుడు చెప్పినట్లు చెప్పి యారాత్రి యుధిష్ఠిర భీమనకులసహ దేవులతో యానాటి కయ్యపు టూసులు చెప్పికొనుచు గడిపె.

***

# చతుర్థప్రకరణము

అట్లు దక్షిణగోగ్రహణము సేయుమని సుశర్మ బనిచి మఱునాడు దుర్యోధనుడు తనచతురంగబలముల గూర్చికొని నూఱుగురు తమ్ములును భీష్మద్రోణకర్ణకృపాశ్వత్థామసౌబలసైంధవప్రముఖు లగుమహా యోధులు వెంటరా నిరంతరప్రయాణములుచేసి మత్స్యనగరపరిసరములు చేరి పితృ వనసమీపమున నుత్తరపుదెస నున్న గోగణముల బట్టికొనియెను. దక్షిణపుదెస యాలమందలబట్టు కొనిన సుశర్మ మీదికి నగరమునగల జనమూబాలగోపాలము౦ బోవుటజేసి వీట వీరుడుగాని సారథిగాని యాసమయమున లేక పోయెను. ఉత్తరదిక్కున గలగోవులను గురు సైన్యములుపట్టుకొని నతోడనే గోపాలకులు దమ వెఱపునకును లావునకును దగిన తెఱగున గొంత పోరాటము సలిపిరి గాని శకునిజయద్రథముఖ్యులగు యోధవరుల తాఁకునకు వారునిలువ లేక పాఱినగరంబునకుంజని రాచనగరుసొచ్చి తత్తరంబున నుత్తరకుమారుం గనుంగొని చేతులు జోడించి వినయంబును భయంబును గదుర నిట్లు విన్నవించిరి. "దేవా! కౌరవ సైన్యములు నేఁడు తెల్లవాఱునప్పటికి నిశ్శబ్దముగ వచ్చి యుత్తరపుదెసనున్న కదుపులంబట్టికొనియెను. సామీ! వారెంత దొంగపోటున వచ్చిరో మేమెఱుఁగజాలము. నిస్సాణములు మ్రోయలేదు. కలకల ధ్వనులు వినఁబడలేదు. ఆలమందలం బట్టుకొనుటయె వారిరాకం గూర్చిన మొదటి వార్తయయ్యె. కౌరవులకు మనకుం బగ లేదు. వారి పై మనమెన్నఁడు దండెత్తి పోలేదు. వారి కేయెగ్గు సలుపలేదు. ఊరక మనపై వారెత్తివచ్చిరి. ఇప్పుడేమి సేయవలెనో యెఱుఁగము. మీజనకుఁడూరలేఁడు. మనబలములు మీతండ్రిగారితో దక్షిణంపు దెసకుఁ బోయియున్నవి. కావున మీరే మమ్మును మన యాలయందల ను రక్షింపవలయును. మీవెనువెంట మేమునువచ్చెగము.

ఆలస్యము చేసిన యెడల మనకదుపుమందలను వారెతోలుకొని పోవుదురు. కావున రాజకుమారా! లెమ్ము! లెమ్ము" ఆవిన్న పమాలించి యుత్తర కుమారుఁడు పసులకాపరుల కిట్లనియె. "గోపాలకులారా! ఏమేమీ! కురు సైన్యములు నిష్కారణముగవచ్చి మన మొదవులం బట్టికొనియెనే! ఇట్టి నిర్హేతుకవైరమునకుఁ గారణమేమో తెలియఁజాలము. ఔ గాక! ఇప్పు డేమి సేయుటకును నాకుఁదోఁచకున్నది. కౌరవ సైన్యముల క్షణమాత్రమున నాబాణాగ్నికి దూదిపింజలుగాఁ జేసెద. విరటుండు లేకపోయినను నగరంబున నుత్తరకుమారుఁ డున్న వాఁడని వారెఱుంగరు కాఁబోలు నాచేతిపోటు వారెన్నఁడు రుచి యెఱుంగరు. వారితో జూదరియైన శకుని పందయైన సైంధవుఁడు శతవృద్ధులయిన భీష్మద్రోణులు కులహీనుఁడైన కర్ణుంఁడుఁ గలరని రాజరాజు తెగనీల్గుచున్న వాడుఁ గాఁబోలు. అభిమానోత్తరుఁడైన యుత్తరునిముందఱ వీరు నిలుచువారా! కాని యొకగొప్పకొఱత సంప్రాప్తమైనది. నావంటి మహారథికునకుఁ దగిన సారథి లేఁడు. రథికులుసారథులు యెోధులు తక్కినదండివంగలు మాయయ్యతోఁబోయి యుండిరి. అయ్యయో! నేనిప్పు డేమి సేయుదును. నాకు రథచోదకుఁడు లేమిఁగౌరవు లెంతయు నదృష్టవంతులు. అయ్యో సారథి లేక యూరింత గొడ్డువోవునే! నా కిప్పుడు సారథ్యము చేయువా రెవ్వరు? గోపాలకులారా! మీ కాపని చేతఁ గాదుగదా! నేన యరదంబు నడపుకొని నేన రథికుఁడనై కౌరవులతోడం బెసంగుట సాధ్యమగునా? నగరలక్ష్మినిఱుప్రక్కలంబొడిచిన తెఱంగున రెండు దెసల నొక్క సారియే కయ్యంబు సమకూడినకతమున నిట్టి సూతదారిద్ర్యంబు సంప్రాప్తమయ్యె. అయ్యో నాధనుర్విద్యానైపుణ్యముఁ బ్రకటింప నవకాశమేలేకపోయెఁగదా కౌరవ హతకులకు నాచేతిలావుఁ జూపనదను దొరకదయ్యెగదా" యని పలు తెఱంగుల తనమగంటిమి నుగ్గడించుకొనుచు సూతుఁడు లేమికి వగచుచున్న యాయుత్తరునిప్రలాపంబులు ద్రుపదరాజపుత్త్రిక ప్రక్కగది లోనుండి విని విసవిసనర్తనశాలకరిఁగి బృహన్నలాభిధానుండై యచ్చటనున్న

పార్థుంగనుగొని రహస్యముగ నాతనితో నిట్లు చెప్పెనం. "కురుబలములువచ్చి యుత్తరంపుదెసనున్న విరటుని గోవులం బట్టిరట! ఆవార్త గోపాలకులు త్వరున కెఱింగించిరి. ఉత్తరకుమారుఁడు కౌరవుల మీఁది కరుగను ద్యమించి యున్నాఁడు. కాని వానికిం దగిన సారథి లేఁడట. తనపంగంటిమిఁ జూపుటకవకాశము లేకపోయెంగదా యనియుఁ గౌరవపశువులు పశువులం దోలుకొని పోవుదురనియు నాతఁ డెంతో విచారించుచున్న వాఁడు. నీ వాతనికి సారథ్యము సల్పుదువా? నీకిది సమ్మతంబగునేని యుత్తరన కిమ్మాట చెప్పిపుచ్చెద" నని యాజ్ఞసేని చెప్పందలంచిన మాటలు కడముట్టఁజెప్పకమున్నె కిరీటి మేర మీఱిన సంతసమునొంది పాంచాల రాజనందనతో నిట్లనియెం. "దేవీ! నీకుశుభమవుఁగాక! నాకు శుభవార్తం దెచ్చితివి. కౌరవులతోడికయ్య మన నాకుం బెనుపండువు గాదె. రథికత్వమ్మైనను సారథ్యమ్మైనను నాకు సమానమె. వారిమీదికిం బోవుట నాకుఁ బెండ్లికిం బోవుట. నన్నొక వేళ గౌరవులు గుర్తించినను భయము లేదు. అజ్ఞాత వాసదీక్ష నేఁటితో బరి సమాప్తముగును. కావున నీవిప్పుడచ్చటికిఁజని మన బృహన్నలకు సారథ్యమున మిక్కిలి నిపుణతగలదని నొక్కి వక్కాణింపుము. తొల్లి ఖాండవవన దహనకాలమునఁ బాండవమధ్యమున కితఁడె సారథికృత్యము నెఱపెననుము. ఈబృహన్నలకతమునన నాఁడర్జునునకు విజయము సంప్రాప్తించె ననుము. అతనిందీసికొనిపోయిన యెడల నీకును విజయము సేకూరుననుము. సమ యోచిత సంభాషణం బుల నేర్పరివగు నీకిన్ని మాటలు నేను జెప్పవలయునే. ఏమాటలు చెప్పవలయునొ యామాటలు సెప్పి యేయుపాయములు పన్న వలయునో యాయుపాయములుపన్ని యాతడుతనంతదాను నన్నుంబిలిపించి సారథ్యముసలుపుమని కోరునట్టి తెఱంగు సేయవలయు. ఎన్నఁడు లేళ్ళగమిపై నుఱుకు బుబ్బలి తెఱంగునఁ గురుకువరారశతముపై నుఱుకుదు? ఎన్నడు సూతనందన జయద్రథప్రముఖులకు నావాఁడితూపులపోటు రుచి చూపుదునని నామన

మువ్విళులూరుచున్నది. వేగము పోయి కార్యము చక్కఁజేసికొని రమ్ము రమ్ము అని పార్థుఁడు సారథ్యము నకు సమ్మతించుటయు ద్రుపదనందన సత్వరంబ యుత్తరుని చెల్లెలగు నుత్తరకడకుంబోయి యబ్బాలికంబిలిచి "కువారీ! మీయన్న మనపసులం బట్టికొనిన కౌరవుల మీఁది కరుగందలంచుచున్నాఁడు. సారథి లేడని సంతాపించుచున్నాడు. నీగురువగు బృహన్నల రథచోదకత్వమున నెంతయునేర్పరి. అర్జునుఁడు ఖాండవవనముఁ గాల్చినప్పుడమ్మహావీరున కితడు సారథియై జయము గలిగించెనని పెద్దలవలన వింటిని. కావున నతనిం దోడ్కొనిపొమ్మని చెప్పుము" అని పలికెను. పలుకుటయు నుత్తర "ఆలాగా! మన బృహన్నలుకు సారథ్యమున నిపుణతకలదా? అట్లయిన మాయన్న కడ కిప్పుడ పోయిచెప్పి వాని నొడంబఱచెద" నని మందమందగమనములతో నుత్తరకుమారుఁడున్న యెడకుం బోయి యతనితో నిట్లనియెను. "అన్నయ్యా! మన పసులంబట్టుకొనిన కౌరవుల మీఁది కఱుగుటకు సారథి లేఁడని నీవు విచారించుచున్న వాఁడవఁట. మన బృహన్నల సూతకృత్యము నెఱపుటలో నిరుపమానుఁడని ప్రఖ్యాతి సంపాదించిన వాఁడఁట. ఖాండవ వనదహన కాలమున నర్జునున కితఁడు సారథ్యము సలిపెనఁట. అంత వాఁడు నీకు సారథియైయుండ నీకింక సందియ మేల. ఈక్షణము కౌరవులమీఁదికిం బొమ్ము. నీకు విజయము తప్పక సేకూరు" నని వెండియు నేమో చెప్పఁబోవుచుండ నుత్తరుఁడామాట కడ్డముబోయి యిట్లనియె. "అమ్మాయీ! నీయీడు బాలికలతో నాటలాడుకొనునప్పుడు పలికినట్లె పల్కుచుంటివి గాని యౌచిత్యము పాటించి పలుకుట లేదు. ఏమేమీ! మనబృహన్నల నాకు సారథ్యముచేయునా? ఉత్తమక్షత్రియకుమారుఁడను. వేదాధ్యయనసంపన్నుఁడను. ధనుర్వేదకోవిదుఁడ ను నే నాపేడిమొగముఁ జూడవచ్చునా! అతని మొగము నేను జూడ నొల్ల. అతని సారథ్య మెట్లంగీకరింపఁగలను? నాప్రజ్ఞలు నానియమములు మొదటినుండియు నెఱిఁగినదానవుగదా! నీకింత మాత్ర మేలతోఁచకపోవలె. అది

యటులుండనిమ్ము. నర్తనశాలలో నాఁడుపిల్లలకు నృత్యము నేర్పు నట్టి పేడికి సారథ్యమున నైపుణ్య మెట్లు కల్గును? ఎవరో సెప్పుకొన్న మాట నీవెట్లునమ్మితివి? చాలుఁజాలు. నాకతని సారథ్యమువద్దు పో" యని యామెయుపదేశము నిరాకరింప నుత్తరవెనుదీయక "అన్నయ్యా! ఉన్నంతలో సరిపెట్టుకొని కార్యము జక్కఁజేసికొనవలయునుగాని జరుగ రానికోరికలు కోరుట మంచిదికాదు. జనకుఁడూరలేఁడు. కౌరవులు పసుల దోలికొని పోవుచున్నారు నిపుణుఁడగు సూతుఁడు లేడనునెపమున నీవు పగతుఱమీఁదికిఁ జనక యంతిపురమున నుందువేని రేపు మనయయ్యవచ్చి యే మనును? ఉత్తరుఁడు పందయ్యె యేదోపంకఁబెట్టి ప్రాణభయమునం బగతుఱపై నరుగలేదని పురజనములు చెప్పికొనరె? ఇట్టి యపనింద పాలు నీవగుట నాకిష్టములేదు. అదియునుఁగాక బృహన్నలకడ సారథ్యమునకు నిపుణత లేదని నీవనఁగూడదు. మహాత్ములు నివురుగప్పిన నిప్పులట్లు కారణాంతరములఁ బ్రచ్ఛన్నులయియుందురు. ఎవ్వరికడ నెంతెంత ప్రజ్ఞ లుండునో సమయమువచ్చుదాఁక మన మెఱుఁగఁగలమా? కావున నీవు బృహన్నలను జులుకనసేయక యతనిసారథ్యమున కంగీకరింపుము."

అని రోషంబుగలుగునట్లు పలుకుటయునుత్తరుఁడు తగినయుత్త రంబుసెప్పనోపక "యట్లయిన నతనిం బిలిచికొనివచ్చి నాకుం జూపుము" అని పలికెను. పలుకుటయునుత్తరబృహన్నలకడ కరిగి వినయంబున నమస్కరించి మెల్లన నిట్లనియె. "దుర్యోధనుఁడు చతురంగబలంబులం గూర్చికొని మన పసులం బట్టుకొనియెం. మాయన్న వారిపై కరుగఁదలంచుచున్నాఁడు. నీవాయనకు సారథ్యంబుఁ జేసి యీకార్యంబు కొనసాగఁ జేయవలయు నని కోరుచున్న దాన." అనవుడు బృహన్నల నవ్వుచు "అమ్మాయీ! నీకిదియేమివెఱ్ఱి. నీవంటి యాఁడుబిడ్డలకు నృ త్యంబు నేర్పుకొనునట్టి నే నేడ? సారథ్య మేడ? నన్నా నీవిట్టి పనికం బనుచుట? చాలుఁజాలు!" నని తన కప్పుని సమ్మతంబు గాన ట్లతండు

నటింప వెండియు నుత్తర "నీప్రజ్ఞ నేను సైరంధ్రివలన వింటి. నీకిది తప్పదు. నావెంట వచ్చి మాయన్నందర్శింపుము" అని వాక్రుచ్చెను. బృహన్నల తన కిష్టము లేనట్లె యభినయించుచు నామె వెంట నుత్తరునికడ కరిగెను. ఉత్తరుఁడు పార్థుం గనుఁగొని యిట్లనియె. "బృహన్నలా! నీవు నూతకృత్యంబు నేర్తు వని నేను వింటి. కౌరవ సైన్యవిజయంబునకై యరుగఁదలంచుచున్న నాకు నీవు సారథ్యంబు సేయుము. నావంటి మేటివిలుకాఁడు నీవంటి పేడిని నృత్తవిద్య నేర్పు వానిని సారథిగాఁ గొనిపోవుట హాస్యాస్పద మని నేనెఱుఁగుదును. కాని తొల్లి యర్జునునకు నీవు సారథ్యము చేసితి వని విని రథచోదకత్వమునకు నీవు కొంత పరిచితుఁడ వనినమ్మి నేను దీని కొడంబడితిని. అరదంబు నడుపునెడ నిన్నుఁజూచి కౌరవులు పకపక నవ్వుదురు. నిన్నుంబట్టి నామగంటిమికిఁగూడఁ గొంతకొఱఁత వాటిల్లవచ్చు. ఎట్లయిననుసరె కార్యప్రాధాన్యమునుబట్టి నేను దీని కియ్యకొనవలసి వచ్చె. కాని నీకొక్కమాట చెప్పెద వినుము. నీవు నృత్తవిద్య నేర్పుచు నాఁడు వాండ్ర మధ్య మొదటినుండి బ్రతికితివి. సైన్యముల మొగ మెఱుంగవు; కయ్యములచొప్పులు తెలియవు;రణభేరీభాంకరణములు వినఁగానె గుండె లదురును. జాగరూకుఁడవై యుండుము. కౌరవసేనలో మహాయోధులు గలరు. వానసోనల తెఱఁగున బాణములు నిరంతరాయముగ మీఁదఁ బడును. అట్టియెడ జంకి రథమును గుఱ్ఱములను నన్ను విడిచి పారిపోయెదవుసుమీ! అట్లు పారుదువేని నిన్నుఁబట్టి ధ్వజ స్తంభమునకుఁ గట్టెద. పిరికికండ లేక నీవు మిక్కిలి నిపుణతతో నరదము నడుపుదు వేని నాట్యరంగమున నీవు కన్యకామణుల నాడించిన తెఱఁగున యుద్ధరంగమున భీష్మద్రోణదుర్యోధనాదియోధులను నే నాడించెద. నీవు పిరికితనము చూపుదు వేని నాప్రతాప మంతయు గంగలోఁగలిసి పోవును." ఆ బీరములు విని యర్జునుఁడు మందహాసము సేసి "నృపకుమారా! సారథ్యము కొంచెము నేర్తును. నానేర్చినకొలఁది వెఱపులేక పనిచేసెద. నాపనిఁజూచి

నీవు మెచ్చు వలయుఁ గాని యిట్లు సేయుదు నట్లు సేయుదు నని యిప్పుడు చెప్పినఁ బ్రయోజనమేమి?" యని యూరకుండెను. అపుడుత్తరుఁ డాతని కొక్క కవచము నిచ్చి తొడిగికొమ్మనియె. అది తొడిగికొనుట తనకుఁ జేతఁ గానట్లు నటించి పార్థుఁ డావర్మము మేనఁ గప్పుకొనియె. "కవచమే తొడుగుకొనఁ జాలనివాఁడవు నా కేమిసారథ్యముచేయఁగల" వని నవ్వుచు నుత్తరుఁడు తన పీఠమునుండి లేచి యతని కవచముఁ దొడిగి రథ మాయత్తము సేయుము. సిడ మెత్తుము. నానావిధా యుధముల రథముపైఁ బెట్టుము. మేలిగుఱ్ఱములం బూన్పుము." అని చెప్పి వానిం బంచెను. అర్జునుండును లాయమున కరిగి కల్యాణ లక్షణములు గలిగి వేగవంతములైన హయములందెచ్చి యరదమునకుఁ గట్టి సిడ మెత్తి యాయుధములు పెట్టి తేరాయత్తము చేసితి నని యుత్తరున కెఱింగించెను. ఉత్తరుండును రత్నఖచితములైన కాంచన భూషణములు దాల్చి శిరస్త్రాణము దొడిగి సుగంధ పుష్పదామకములు మెడ వైచికొని తల్లికిని నంతిపురమునంగల వృద్ధజనమునకును మ్రొక్కి వారిదీవనలు వడసి బ్రాహ్మణులదీవన లందుకొని కంచుకులును సేవకులును జయజయధ్వనులు చేయ స్యందనం బెక్కి రాజమార్గమున నరుగఁదొడఁగె. పౌరపురంధ్రులు మంగళాక్షతలు పుష్పములు లాజలు చల్లి యాతనిం దీవించి బృహన్నల నుద్దేశించి "ఖాండవవనము దహింప నరిగినప్పుడు విజయున కెట్టివిజయంబు సేకూ రెనట్టివిజయంబె మాభూమింజయునకుఁ గలుగునట్లు నీవు సారథ్యంబు నేసి క్రమ్మఱ విజయ మంగళధ్వనులతో నరదంబు దోలుకొని పురము ప్రవేశింతువుగాక" యని మంగళప్రదములగు వాక్యములం బలికిరి. వందిమాగధులభినందించిరి. సారథ్యము నలుపుచున్న బృహన్నలం జూచి పౌరాంగనలు కొందరు, "అమ్మక్కా! ఇది యేమియక్క జమమ్మా! కుమారునివంటి యుత్తరకుమారుఁడు కురుసైన్య మర్దనమున కఱుగుచుండ నీపేడి యరదము నడుపు టేమమ్మా! గజ్జెలు గట్టుకొని యెట్టయెదుట నిలచిన యోషిజ్జనమునకు నృత్తవిద్య నేర్పుట

యనుకొని యీతఁడు సారథ్యమున కంగీకరించెనా? తాళము వాయించుట యనుకొని సమ్మతించెనా? ఈపేడి పాడి యెఱుఁగక తానిప్పని కొప్పు కొనెననుకొనుము. లోకోత్తరుఁడగు నుత్తరుఁడెట్లు దీని కొడఁబడెనమ్మా? కాదుకాదు. ఒక్క సారథి నైన నూర నుండ నీక యెల్లవారల దక్షిణంపు దెసకుఁ గొట్టుకొనిపోయిన యావిరాటు ననవలెఁ గాని వీని నన్నఁ గార్యమేమి? ఔఁగాక! తొడలు లేని యనూరుని సారథిం జేసికొని జగత్త్రయశోభాకరుఁడగు ప్రభాకరుఁడు నిశాసమయము నాక్రమించిన యంధకారమును నిర్మూలనము చేసి దేదీప్యమానప్రభలతో వెలుఁగునట్లే యీరాజ కుమారుఁడును మగంటిమి లేని యీ పేడిని బేరునకుమాత్రము సూతుఁడుగ నుంచు కొని తన ప్రభావముననె యరులం గెలిచి వచ్చుఁగాత యని తమ కుందోఁచినపోలిక నొండొరులతోఁ జెప్పికొనఁ జొచ్చిరి. స్తోత్రప్రియుఁడైన యుత్తరుఁడు వారిమాటల నాలించి సంతోషముచేత నుప్పొంగుహృదయముతో రథారూఢుఁడై పోవఁజొచ్చెను. అముగ్ధాంగనల సంభాషణములు ధనంజయునకు మందహాస కారణములయ్యెను. క్రమక్రమమున నరదము పురము దాఁటి నగరము నంటియున్న పేటలు దాఁటి యుత్తరంపుదెసకరుగ నుత్తరుఁడు రథమువెంట నంటి పఱుగులెత్తుకొనివచ్చు గోపాలకులం బిలిచి యాలమంద లెచ్చట నున్న వని యడిగి యవి యున్నతావు వారివల్ల నెఱింగి యరద మా చక్కికిందోలు మని బృహన్నలతోఁ జెప్పెను. బృహన్నల యట్లె చేయ రథము క్షణమాత్రములోఁ గౌరవబలము దృష్టిగోచర మగు నంత సామీప్యమున కరిగెను. అప్పుడు కౌరవసైన్యమందలి రథనేమి ఘట్టనధ్వనులును బృహద్గజ బృంహితములును నుత్తమతురంగ హేషారవములును ధనుష్టంకారములును సైనికుల పరస్పర సంభాషణధ్వానములును. భేరీభాంకరణములును నుత్తరునకు శ్రవణగోచరమయ్యెను తేరు వెండియుఁ గొంతదూర మరుగునప్పటికి రత్న ఖచితములై కన్నులు మిఱుమిట్లు గొలుపు ధ్వజములును నానావర్ణములు గల పడగలును గవచశిర

స్త్రాణకాంతంలును నేత్ర గోచరవము లయ్యెను. అగుటయునుత్తరునిమనమునఁ దొల్లి నెలకొనియున్న యుత్సాహము సర్వమును డిందుపడియెను. దాని స్థానమున భయము నెలకొనియెను. స్నానముచేసిన తెఱఁగున నెమ్మేన ముచ్చెమటలు పోసెను. అంగకములు వడఁకెను. చూపురిచ్చవడియెను. మొగము వెలవెలఁబాఱెను. ఎలుంగు సన్నగిలెను. నోట మాటపెడలుటే కష్టమయ్యెను. అట్టి యవస్థలో నుండి యుత్తరుఁడు మెల్ల మెల్ల బృహన్నలంబిలిచి తొట్రుపడునుడులతో నిట్లనియెం. ``బృహన్నలా! కౌరవసేన కంటఁబడిన తోడనే జయముగాంచుతలపు పోయినది. భయము పిశాచమట్లు నన్నావరించినది. చండ తేజోనిధులయిన భీష్మద్రోణ కృపాశ్వత్థామ ముఖ్యులగు శూరశిఖామణులను నేను గెలువఁగలనా? నాయంతర మేమివారియంతర మేమి? ఒకఁడు పరశురాముని కెలిచినజోదు; ఒకఁడు సకలరాజకుమారగురువు. ఒకఁడు రుద్రతేజుఁడు. ఒకఁడు భానుప్రతాపుఁడు. నేను పరమమూఢుడనై స్వబలపరబల తారతమ్యములు దెలియక యంతఃపురాంగనల సన్నిధిని నోటికివచ్చినట్లు బీరములు పలికి క్రొవ్వి కుడిచి కూర్చుండలేక తలకుఁ దగనిపని బూని వచ్చితి. రథము పోవనీకుము. కళ్ళెములు బిగఁబట్టి నిలుపుము. రథవేగమునఁ గౌరవసేన డగ్గఱిన కొలఁది నేను మృత్యుదేవత సమీపమున కరుగున్నాఁడ నని తోఁచుచున్నది. అయ్యో నే నీకయ్యమున వేఱుభంగి నైతినేని మాయమ్మ నాకొఱకెంతవగచునో నా చెలిమికాం డ్రెంతచింతింతురో బృహన్నలా బృహన్నలా తోలవల దని వేడుకొన్నను రథ మింకనుతోలెద వేమి నామాటలు నీకు వినఁబడుట లేదా? అయ్యయ్యో నాతో వేళాకో ళమా నీకు? నే నెవడ వనుకొంటివో నీయేలికయయిన విరటుని పుత్రుఁడను. నీ మొండితనము మానాయనతోఁజెప్పి తలఁదీయించెద. జాగ్రత్త, ఆఁపు రథ మాపు`` అని నానాప్రకారములు పలవించుచున్న రాజనందనుం జూచి బృహన్నల లేనవ్వువెన్నెల మొగమున నిండ నిట్లు కఠినముగఁ బలికెను. ``నృపకుమారా! అంతఃపురంబునఁ

గాంతాజనమధ్యంబునఁ గూర్చుండి కోసిన కోతలేమి? యాచేత లేమి? భీష్ముఁడెంత ద్రోణుఁడెంత కర్ణుఁడెంత యని బీరంబులు పలికితివి. ఇప్పుడు కౌరవ సేనం జూచి, సింగముంజూచి పరుగెత్తు లేడి తెఱఁగున బాఱఁజూచుచుంటివి. పుట్టినది రాచపుట్టువుగాదా? ఏవంశము నయయాతి దుష్యంత భరత ప్రముఖు లగుమహీపాలురు జనియించిరో యావంగడంబున జనియించినాఁడవు. అమ్మహాశూరుల శోణితమె నీరక్తనాళముల బ్రవహించుట లేదా? నీదేశమును నీ పసులను బరరాజులువచ్చి యాక్రమించినప్పుడు బహు కారణముల చేత వినశ్వర మైన యీ దేహమును దాఁచుకొని, దేశమును పరుల కొప్పగించుటకు నీకు సిగ్గులేదా? నీహృదయమున స్వదేశాభిమానము చచ్చినదా? దేశ మన్యాక్రాంతముఁ జేసి తుచ్ఛ ప్రాణములు రక్షించుకొనుట కంటె నరి కేదురుగాఁ బోయి కత్తిపోటు దిని మేను దొఱఁగరాదా? దేశ త్యాగము కంటె దేహ త్యాగము మే లని యెఱుఁగవా? శూరుఁడొక్క సారియె చచ్చును. పంద పదిసారులు చచ్చును. అనగా భయము కలిగినప్పుడల్ల వాఁడు చచ్చినట్లె తలంచును. నీ వున్నంత మాత్రమున నీవసుంధరకు గొప్పతనము రాదు. నీవు చచ్చినంతమాత్రమున వెలితిరాదు. కోటానకోటు లయిన శూరుల రక్తధారలచే నీపుడమి తడిసి గట్టిపడినది. జ్వరములు వచ్చి, శ్వాసకాసలు వచ్చి విశూచి మశూచి ప్రముఖము లగు దారుణరోగములు వచ్చి యెందరో క్షణక్షణముఁ జచ్చుచున్నారు. నీవునునేదో రోగమువచ్చి ఎప్పుడో చావక పోవు. ఏదో రోగము పాలయి కుక్కవలెఁ బిల్లివలె బశువువలె భీరువువలెఁ జచ్చుటకంటె నాయుధ పాణియై రణరంగము సొచ్చి పవిత్ర మైన శస్త్రమరణము నొందుము. రోగపీడితుఁడవై చచ్చి నరకంబున కరుగుట కంటె శస్త్రమరణము నొంది వీరస్వర్గము జూఱలాడుము. క్షత్రియాంగనలు వీరమాతలు గావలయు నని వీర పత్నులు గావలయు నని నీతల్లి నిన్నుఁ గని వీరమాత యనిపించుకొనఁ దలఁచినది గాని భీరుమాత యనిపించుకొనఁ దలఁచుకొనలేదు. ఇప్పుడు భీరుమాత యగుచున్నది.

నీకతన నామెకు వీర మాతశబ్దము సార్థకమగుటకు మాఱు నిరర్థక మగుచున్నది. వీరుంగన్న దల్లియే తల్లిగాని భీరుంగన్న తల్లి ప్రజాపతియయ్యు గొడ్రా లనుటకు సందియము లేదు. పిఱికిబిడ్డలు చిరకాలము జీవించి తల్లిదండ్రులకు రాచవంగడంబునకు నప్రతిష్ఠ తెచ్చుటకంటెఁ బురిటి లోన నుసురులు వాసిపోయినఁ గడుంగడు మేలగు. కురుబలమెట్టిదో మున్నె ఱుఁగవా? చండార్చిష్మంతులవంటి భీష్మద్రోణాది మహాప్రతాప సముద్రులు నిర్నిద్రతేజు లా బలగంబున నున్నవారని తెలియదో నీకు? చెలిమి కాండ్రం గూడికొని సొగట యాడుట యను కొంటివా? పువ్వుఁదోటలఁ దిరుగుట యనుకొంటివా? యథేచ్ఛముగ సరస సల్లాపము లాడుకొనుట యనుకొంటివా? ఇది కయ్యము గాని వియ్యము గాదు. చాలు చాలు నీ పిఱికితనము కట్టిపెట్టు. నీవు మడమ దిరుగక, వెనుకంజ యిడక కయ్యంబున నుఱికి దండిమగలం బొడిచి గెలిచి వచ్చినను వారిచేఁ జచ్చినను నీతల్లి సంతసించునుగాని నీవు రణంబు విడిచి వెనుకఁ దిరిగిచూడక నాఁడు దాని తెఱంగునఁ గుయ్యిడుచు నిల్లు దూరిన నీతల్లి సంతసింపదు. అటఁజావక యిట కేలవచ్చితి వని యడుగును. కావున నీవిప్పుడు తల్లి మాటయు దండ్రిమాటయుఁ జుట్టములు మాటయు దలంపక సుస్థిరుఁడవయి యరదంబునఁ గూరుచుండుము. నీకు విజయము తప్పక చేకూరు. పశువుల విడిపింపక నీవు నగరమున కరిగితివేని మన నిద్దఱను బౌరులు నరపశువులందురు. ఆపసులతోఁ బాటు మననిద్దఱిని గౌరవులు చెఱబట్టుటొండె మన మప్పశువుల విడిపించుటొండె సేయవలయు గావున నేనరదంబు నడిపెద. నీవు విల్లందుకొని కయ్యమునకు సిద్ధముగ నుండుము." అని యుల్ల ముచ్చిపోనాడిన యా బృహన్నలపలుకులు భయగ్రహావిష్టుఁడయిన యాతని చెవిం జొరలేదు. అక్కతమున నాన్న పకువరాలుడు శవముున కయిన రోసము గలిగించునట్టి యాతనిపలుకులవలన నించు కేనియు లాభము నొందక తనమాట తనదిగా వెండియు బృహన్నలం గనుకొని రథ మాపు మనియడిగి విసిగి యాతఁడు

తనమాట సరకుగొనక స్యందనము దోలుచుండుటం జేసి చేయునది లేక కన్నీరు పరదలై కార నేడ్చుచు నరదంబు మీఁద నుండి గుభాలునక్రింది కుతికి వెనుకకుఁ జూడక పరువెత్తసాగెను. అర్జునుఁ డదిచూచి పగ్గములు బిగించి హయంబుల నిలిపి రథమాపి తానును నేల కుతికి వాని వెంటఁబరుగెత్త సాగెను. రథమాపి సవ్యసాచి యుత్తరునిఁ గలిసి కొనునప్పటి కాన్నపకుమారుఁడు నూఱు బారలదూరము పరుగెత్తెను కోపించిన మదపుటేనుంగు తెఱంగున ఫల్గుణుండు మిక్కిలి వేగమున వాని వెంటం జని వానిఁ బట్టుకొని "నృపకుమారా! రారమ్ము యెందరి గెదవు? కయ్యమునకు వచ్చుటకుఁబోవుటకు నీయిష్ట మేనా" యని యాతని బట్టుకొని యరదము దెసకీడ్చి తెచ్చుచుండెను. అప్పుడుత్తరకుమారుడు విహ్వలచిత్తుఁడై "అయ్యో! బృహన్నలా! బృహన్నలా! నీయుద్ధము పేరు దేవుఁ డెఱుఁగు నన్ను విడిచి పెట్టు. నీపసులు దొంగలదోల నన్ను విడిచిపుచ్చుము. నాతల్లికి నే నొక్కఁడ నే కొడుకును. నన్ను విడిచి యామె నొక్క నిమిషమైన నిలువజాలదు. నా కున్న బంగారపు నగలన్నియు నీకిచ్చెద. నాపసిడి దువ్వలువలు నీవె పుచ్చుకొనుము నీకు కావలసినన్ని యేనుగు లిచ్చెద. గుఱ్ఱము లిచ్చెద. అందలము లిచ్చెద. అవి చాల వేని మాయయ్యతోఁ జెప్పి నీకేవి యభిమతంబులవి యిప్పించెద. నాప్రాణము రక్షించి యీపుణ్యము గట్టుకొనుము. నీ పాదములపైఁబడి ప్రార్థించెద. నీవే తండ్రివి నీవేతల్లివి. నీవే నాపాలి దైవఁబవు. భయజ్వరకంపితుఁడ నైన నా మీద నించుకదయారసము వర్షించి నామనస్సు చల్లబడఁ జేయుము. మాయింట నింతకాలముండి మాయన్నము తిన్నందులకు నా కీపాటి మేలు సేయుము. కంఠమునం బ్రాణములుండగా నీవు చేసిన మేలు మరువను. బృహన్నలా! బృహన్నలా! బుద్ధిలేక యుద్ధమునకు వచ్చితిని. ఆలకాపరులు వచ్చి పసుల విడిపింపు మని నన్నుఁ గోర నేను మహాశూరుడ ననుకొని బాలిశుడ నయి యీపనికి దొరకొంటి. ఈతప్పు క్షమియింపుము. నేను వీరుఁడనుగాను. నాతల్లి వీరమాతగాదు. నాతల్లిని నాకుఁజూపుము.

నాయంతిపురమునకుంబోనిమ్ము" అని యెన్నో విధముల వేడికొనెను. మహాశూరునకు భీరుని యాలాపములు కరుణపుట్టించునా? అతని దీనాలాపముల కించు కేనియుఁ జెవినిడక కప్పడి పడిపడి వానిఁబట్టి తెచ్చి యరదముపైఁ గూలనేసివాఁడు పెండియుఁ గ్రిందిగురుకి పారిపోకుండ ధ్వజస్తంభమునకుఁగట్టి "కుమారా! నిన్ను నేను విడువను. రథికుడ వగుటకు నీకు భయమయ్యెనేని నీవు నాకు సారథివి కమ్ము. నేను రథికుడనయి కౌరవులతో బోరి పసులం దెచ్చెద" అనవుడు రాజకుమారుఁడు సంతసించి సారథ్యంబున కొడంబడియెను. అప్పుడర్జునుఁడు వానికట్లువిప్పి నొగలపై గూర్చుండబెట్టి హయముల నడపించు తెఱంగులు నిలుపు తెఱంగులు కొన్ని చెప్పి తాను రథికు డయ్యె. తాను రథికుడయి యచ్చటిక నతి దూరముననున్న శమీవృక్షము దాపునకు నరదమును దోలుమని యుత్త రునికి జెప్ప నాతం డట్ల కాక యని రథ మాదెసకు నడుపఁజొచ్చె. ఇంతకుమున్ను విరాటనందనుఁడు తేరుడిగి పాఱుటయు సారథివానివెంట నేలకుఱికి రాజనందనుని వెంట బరుగెత్తి వానిందోడ్తెచ్చుటయు దూరమువననుండి కౌరవవీరులలో సామాన్యులగు వారురథికుని పిరికితనమునకును సారథి పేడి రూపమునకును గడుంగడు నవ్వి "ఆహా! పిరికి మగనికి బేడి సూతుఁడు సరిపోయినాడు. ఇట్లుండవలయు గదా. రథిక సారథులప్రజ్ఞావిశేషంబులు. ఆకృతిచేతనే మగతనము లేని వాఁడొకఁడు; మనంబున మగంటిమి లేనివాఁడు మఱియొకఁడు. ఏటికి వీరిచ్చటికి వచ్చిరో. భళిరా! వీరిచేష్టలు దర్శనీయములుగ నున్నవి." అని యెగతాళి చేసిరి. ప్రాజ్ఞులగు వారు బృహన్నలయాకారవిశేషంబులు గమన వైఖరులు పోల్చిచూచి "ఔరా! బాహులదీర్ఘతం బట్టియు గమన వైఖరింబట్టియు నీతం డర్జునుఁడని తోఁచుచున్నది. పేడిరూపు దాల్చి యీతఁడు విరటునియింట నజ్ఞాత వాసదీక్ష సంపూర్తిచేసి యుండఁబోలు! సుశర్మ దక్షిణ గోగ్రహణంబు సేయ విరాటుఁడు బలంబుల నెల్లఁగూర్చుకొని యాదెసకుఁ బోయి యుండనోపు. కౌరవ సేన యెట్టిదో యెఱుంగక తాని

కౌరవులు పట్టిన పసులను విడిపింతునని సాహసంబున నిటువచ్చి యీకుమారుఁడు మనలంజూచి వెఱచి పాఱ నుంకించి యుండు. దుర్జయప్రతాపనిధి యగు నర్జునుఁడు వానిం బట్టి యదరంబునం బెట్టనోవునని వినిశ్చిత హృదయులై యాయిరువుర మీఁదని చూడ్కి నిలిపి వారి చేష్టలం గని పెట్టుచుండిరి. అప్పు డర్జునుఁడు శమీవృక్ష సమీపంబునకుంజనియెను. అంత నిర్భయముగా యుద్ధసన్నద్ధుఁ డగుచున్న యయ్యర్జునుం గనుంగొని కౌరవసైనికులు భయము నాశ్చర్యము నొందఁ జొచ్చిరి. కౌరవ సైన్యమున దుర్నిమిత్తములు పెక్కులు దోఁచెను. శిష్యవత్సలుఁడగు ద్రోణాచార్యుఁడు పేడిరూపున శమీవృక్షమున కరిగిన యాబృహన్నల రూప రేఖావిలాసములు, గమన వైఖరులు బాహువిస్ఫురణములు తెప్ప వాల్పక చూచి యాతఁడు అర్జునుఁడు కావలయునని మనమున నిశ్చయించి "యజ్ఞాతవాసము పరిపూర్తిగాకుండ నీతఁ డుపచ్చి కౌరవులకుఁ గానఁబడియె నేని తొల్లి సేసినసమయమునుంబట్టి పెండియుఁ బాండవులను దుర్యోధనుఁడు ద్వాదశాబ్దము అరణ్య వాసమును నొక్కయేఁ డజ్ఞాత వాసమును జేయఁబనుచుంగాఁ బోలు! అయ్యో! దుర్యోధనునితలఁపు తుదముట్టె" నని మనమువిషాదమునొంది తనమాట లన్యులకుఁ దెలియకుండ భావగర్భితముగా మందాకినీనందనునితో నిట్లనియె. "వీనియాకారము చూడ దేవేంద్రునియట్లున్నాఁడు. అహంకరణమె గాని యెుండేమియు నెఱుంగఁడు. ఈతఁడింత తెలివితక్కువవాఁడేమి. మనమీఁది కీతెఱంగున రాఁదగునా? తనసేమ మించుక యుఁ దలంపకున్నాఁడే. ఈతఁడు మూర్ఖుఁడనుకొనవచ్చునా; కోవిదుఁ డనుకోవచ్చునా?" ఆపలుకులు గాంగేయుఁడు విని వానిభావము దెలిసి తానును గూఢముగానే యిట్లుత్తరము చెప్పెను. "మనమిప్పుడు శత్రువుల కొలఁది యెఱిఁగి మనకొ లఁది యెఱిఁగి వచ్చితిమి." మన కే భయమును లేదు. సంచలింప వలదు." అనవుడు ద్రోణాచార్యుఁడు పార్థుని కజ్ఞాతదీక్ష వలనిభయము లేదని భీష్ముని వాక్యముల వలనఁ దెలిసి

సంతసించియాతండర్జునుఁడని యెల్లవారికిం దెలియునట్లు జెప్పఁ దలంచి యిట్లనియె. "చిరకాలము గుహాంతరమునందు వసియించి పేరాఁకలిచే నకనకం బడుచు మత్తమాతంగయూథము కంటఁ బడినతోడనె యొక్కయే టున నాయూథము పై కుఱుకుమృగేంద్రము చందమున నీయర్జునుఁడు చిరకాంతారవాసఖిన్న మతియై మనసేన పైకివచ్చుచున్నాఁడు. మన సేనలో దేవాసురులం గెలువఁ జాలినసకలశస్త్రాస్త్రకోవిదులు మహావీరుల నేకులు కలరు గాని మబ్బువిడిచిన యెండ తెఱంగునఁ దీవ్రక్రోధానల ప్రేరితుఁడై వచ్చు నీతని నిప్పుడు మార్కొనుట యరిది యని నాకుఁ దోఁచుచున్నది. ఇట్లనుటచేత మే మొడళ్ళుదాఁచు కొని రాజునిమిత్తమయి పోరు సలుపకుందుమని తలంపవలదు. చిర ప్రవర్ధమానక్రుధానలభీషణుఁ డగు పార్థుని సాహసము దలంచియు నిప్పుడు పొడముచున్న దుర్నిమిత్తములు సూచియు నిట్లనవలసె. అదె!చూడుఁడు మార్తాండుఁడు మాసెను. గోమాయువులుగూసెను. దిక్కులనుండి ధూమములు బయలు వెడలుచున్నవి. ఏనుఁగులు మ్రొగ్గుచున్నవి. ఉత్తమతురంగములు నిష్కారణముగఁ గన్నీ రువిడు చుచున్నవి. ఆయుధములు తమయంత మండుచున్నవి. చెట్లమీఁద గాక ఘూకఘూత్కారములు చెలఁగుచున్నవి. వీనిచేత జయము సందియమని నేఁదలంచెద. ఐనను రాహుతులు తమతమగుఱ్ఱము లపై నేనుఁగల పై నెక్కి యాయుధపాణులై యుండుఁడు" అని యాచార్యుఁడు తనయభిప్రాయము చెప్పుచుండ రాధేయుఁ డధి క్షేపజ్జిర్వకముగా నాతని కిట్లనియె. "ఆచార్యా! ఇవి యేటిపలుకులు? క్రోధాంధీభూత చేతస్కుఁడైన యర్జునున కెదురై పోరువారు మనిమొనలేరా? కౌరవ సేన యంతగొడ్డువోయెనా? నీకుఁ బ్రియశిష్యుండగుటచేతనా బట్టువోలె నర్జునుని దోఃప్రతాపములు వేనోళ్ళఁ బొగడుచుంటివి. ఇది శత్రుదోస్సారము ప్రశంసింపఁ దగినసమయమా? చేవ లేక పోయినను మనబలములలావును, సామర్థ్యమును నెన్న వలసిన మీరు మన సైనికులకు త్సాహము గలిగింపవలసిన మీరు పగవానిఁ బలు

తెఱఁగులఁ బొగడుట పాడియగునా? పాండవపక్షపాతమున్న పక్షమున దండయాత్రకు రాక యింటికడ నుండదగును. వచ్చి నవెనుక సైన్యములకు దైన్యములు గలగకుండఁ బలుకవలయు. మీరు బ్రాహ్మణులరు. విశేషించి కురుకుమారాచార్యులు నగుట చేత మి మ్మేమియు ననలేక ఈసు యోధనుఁ డూరకున్న వాఁడు." అంతలో రాధేయుని మాటలకు సుయోధనుఁడడ్డువోయి "మిత్ర మా! ఆచార్యునితో మనకు వాదమేల? ఈతఁ డర్జునుఁడైన మనకు భయము లేదు. అజ్ఞాతవాస మింకను సంపూర్తి కాలేదు. కావున నీతఁ డర్జునుఁడైన పక్షమునఁ బాండునందనులు వెండియు బం(డ్రెండేడ్లు వనవాసమున కరుగవలయును. పార్థుఁడు గాని పక్షమున దక్కిన వారితో బనిలేక నే నొక్కఁడనె మదీయచాపనిర్ముక్త క్రూరనారాచములు వానిం బిలుకుమార్చెద." నని వ్యూహము పన్ను మని గాంగేయు నితోఁ జెప్పెను. అతఁడట్లు సేయఁ దొడఁగెను. అంతలో నుత్తరుఁడు రథము శమీమహీరుహ సమీపమునకుం దోలుకొని పోయెనం. అపుడర్జునుఁడుత్తురం బిలిచి "రాజకుమారా! పాండునందను లజ్ఞాతవా సమున కరుగునప్పుడు దమయాయుధముల నెల్లఁ గట్టఁగట్టి యీజమ్మి మ్రానిపై నిడిరి. అందు ధనంజయుఁడు పట్టు గాండీవమహాచాపమున్నది. మనము సామాన్యముగ వాడుకొను చాపంబులు బలహీనములు నిష్ప్రయోజనములు. గాండీవము నాచేతనున్న యెడలఁగౌరవ సేనా కాంతారమును నవలీల, గాల్చి వైచెద. కావున నీవీమహీరుహ మెక్కి యాకట్ట విప్పి యందున్న గాండీవంబు సంగ్రహించి నాకందిచ్చి తక్కినయాయుధములు నెప్పటియట్లకట్టుకట్టుము." అని చెప్పెను. అతఁడు చెప్పినచొప్పునఁ జేయక తప్పదని యుత్తరుఁడు భూరుహంబు నెక్కి శవాకారమున నున్న యాయుధముల కట్టజూచి యది శవంబకా దలఁచి "అయ్యో! బృహన్నలా! యిదియేమి ఉత్తమక్షత్రియకుమారుఁడను. పవిత్రుడను. అట్టి నన్ను నిట్టిపీనుఁగు నంటఁ బనుచుట నీకు న్యాయమా? నీకు సారథ్యమున కియ్యకొంటి నని సమస్త నీచకార్యములకు నన్నుం బనపఁ దలఁచుకొంటివా

యని పలుక ధనంజ యుఁడు వానిసందియమును వాపఁ దలఁచి "భూమింజయా! అది పీనుఁగు గాదు. ఆయుధముల నొరులు చూచి హరింపకుండఁ బాండు నందనులు శవాకారముగఁ గట్టిరిగాని నిజముగ శవమైనపక్షమున దానిని స్పృశియింప నీవంటి నృపకుమారతిలకము నంపుదునె? నే నంతయౌచిత్యముఁ బాటింపనివాఁడనె? అది పీనుఁగుగాదు. నీవు నిస్సంశయముగ నాకట్ట విప్పుము." అని భయము వాపుటయు భూమింజయుఁడొక్క శాఖపై స్థిరముగఁ గూర్చుండి యాకట్ట విప్పెను. విప్పినతోడనే యింద్రధనుస్సును మించిన గాండీవాది సాధనములు వానికన్నులకు మిఱుమిట్లు గొల్పెను. అతఁడు మహాద్భుతము నొంది చాపరాజం బైనగాండీవంబు దీసి నర్జుననకందిచ్చి తక్కిన యాయుధములు పార్థునకుంజూపి యవి పాండవులలో నెవ్వరెవ్వరు ధరింతు రని యడిగి యర్జునుని వలన వానివృత్తాంతము సవిస్తరముగా నెఱిఁగి ఖండనంబుల భీమ సేనుఁడు ధరియించు కాలదండతుల్య గదా దండంబుచూచి యది వాయునందనునిదని తెలిసి యద్భుతహర్షంబులు పెనఁ గొన దానిని వెండియు నాకట్టయందుఁగ గట్టి పార్థునకిట్లనియె. "బృహన్నలా! పాండునందనులు తమ యాయుధముల నీశమీ వృక్షమున నిక్షిప్తము చేసి యెందరిగిరి? వారిప్పుడు జీవించి యున్న వారే? రాజసూయ మహాధ్వరంబు గావించి పుడమిఁగల రాజుల నందఱం గెలిచికప్పంబులు కానుకలు గ్రహించిన యాయుధిష్ఠిర సార్వభౌముఁడెం దరిగి యున్న వాఁడు? కౌరవకురంగ మృగేంద్రుఁడైన భీమ సేనుఁడు కుంభనిక్షిప్త భుజంగము చందమునఁ దన పెంపును లావును నడంచుకొని యెందుఁ గుందుచున్నాఁడు? ఎక్కటికయ్యమున ముక్కంటిని మెప్పించిన కవ్వడి యెవ్వితంబున వెతలు గుడుచుచు నెందున్న వాఁడో గదా! మన్మథాకరు లగుమాద్రీకుమారు లొకని యింట నుండి దాస్యంబు సేయఁ దగినవారె? పాండవపట్టమహిషి యైన పాంచాల రాజనందన యేరాజపత్ని నిప్పుడుకొలిచి నీచకర్మం బులు సేయుచున్న దోకదా! కటకటా! విధియెంతనిర్దయుఁడు!

మార్తాండ బింబంబును మబ్బు గప్పునట్లు దుర్నివార తేజోనిధు లగువారిని నజ్ఞాతవాసదీక్ష ప్రచ్ఛన్నులఁ జేసెఁగదా! ఆమహాత్ములకు నేను మేనల్లుఁడను. వారి సేమము నాకవశ్యము జ్ఞేయము. వారియునికి నీవె ఋఁగు దేని దయ చేసి నాకెఱింఁగింపవలయు" నని వేఁడుటయు నర్జునుఁడు రహస్యము మాటుచేయవలసిన కాల మతిక్రమించుటం జేసి తమ యుదంత మెఱింఁగింపఁ దలఁచి యిట్లనియె. "కుమారా! మర్మంబువిడిచి మాటలాడెద వినుము. పాండవులు సుఖులయి యున్నవారు. నీ నగరంబుననె యున్న వారు. జనక సమానుఁడగు నీజనకునిం గొలిచి యాతని యనుగ్రహం బను తెప్పచే నజ్ఞాత వాసదీక్షా సముద్రమును నిరంతరాయముగఁ దరించిరి. యుధిష్ఠిరుఁడు సన్యాసియయి కంకభట్టను పేర మీయాస్థానంబున నిలిచి యనేక పుణ్యక థాకథనంబున మీతండ్రి మనమునకు వినోదము గలిగించి మీయయ్య యనుగ్రహము నకుఁబాత్రమై యున్న వాఁడు. మీ బానసీఁ డై వలుండనను పేరఁ బరగుచు మీకుఁ బ్రత్యహము రుచ్యము లగువంటకములం జేసి పెట్టుచున్న వాఁడు మాభీమ సేనుఁడు. సుయోధన ప్రేషితుఁడైనమల్లుం గెల్చిన జగజెట్టి, యతఁడెసుమీ! మీయశ్వశిక్షకుఁడే మానకులుఁడు. దామగ్రంధి నామధేయుఁడై యున్న వాఁడు. తంత్రీపాలుఁడను మీపశుపాలకుఁడే మా సహదేవుఁడు. మాలిని యను పేర సైరంధ్రి వేషమున మీజననికిఁ సకలోపచారములు సేయుచున్న యాసుందరి పాంచాల రాజనందన. పలుమాట లేటికి? కౌరవుల మీఁదికి నీవరుగఁదలఁచునప్పుడు నీకు సారథ్య మొనరింప నంగీకరించి నిన్నిటకుం దోడ్కొచ్చి పిఱికితనమున నీవు పాఱఁదలంప నిన్నుఁ బోవనీక పట్టుకొని నిన్ను సారథింజేసికొని యిపుఁడు గాండీవము గ్రహించి కౌరవులతో బెనఁగఁదలఁచిన యీబృహన్నలయే యర్జునుఁడు. నేఁటితో నజ్ఞాతవాసము సంపూర్ణమయ్యె. ఈసంవత్సరమునుండి మాకేవెలితియుఁగలుగకుండఁ దలిదండ్రుల తెఱఁగున నెక్కుడు దయఁగలిగి మమ్ముఁబెంచిన మీతలిదండ్రుల కెక్కువ కృతజ్ఞులము. "అప్పలుకులు విని

భూమింజయుఁడు విస్మితహృదయుఁడై" ఏమి! నీవ యర్జునుఁడవా? అట్లయిన నీకిట్టి పాడురూపమేల వచ్చినది? నేనిది నమ్మఁజాల. ఆ పార్థునకుఁ బదిపేళ్ళుగలవు. ఆపేళ్ళు చెప్పి యవి యేకతమున వానికివచ్చిన వో యాకారణముల నెఱిఁగింతువేని నీమాటలు విశ్వసింతు" ననిపలికెను. పార్థుఁడు మందహాసవికసితముఖుఁడై యిట్లనియెను- "కుమారా! నేననృతము పలుకుదునె? సూనృతవ్ర తానుష్ఠానపరతంత్రుఁడగు యుధిష్ఠిరుని తమ్ముఁడంజా మీ! అర్జునునకుఁగల నామదశకముఁ జెప్పెద వినుము. అర్జునుఁడు, పార్థుఁడు, ఫల్గునుఁడు, కిరీటి, శ్వేతవాహనుఁడు, బీభత్సుఁడు, ధనంజయుఁడు, సవ్యసాచి, జిష్ణుఁడు, విజయుఁడు ననున వాపదిపేళ్లు. తెల్లఁగా నుండుటం జేసి యర్జునుఁ డని పేరుకల్గె. మాజననియైన కుంతీ దేవి పృథయనం పేరంబరఁగుచున్నది. పృథానందనుఁడ నగుటచే నాకా పార్థనామము గలిగె. ఉత్తర ఫల్గునీ నక్షత్రమున జనియించుటం జేసి ఫల్గునుండనైతి. లోకకంటకులగు నివాత కవచకాలకేయాదిదానవులను సంహరించి మహేంద్రుని మెప్పువడసి యాతనిచే నవరత్న ఖచితసువర్ణ కిరీటము పారితోషికముగాఁ బడసితిగావున నేనం గిరీటియనఁబరఁగుదుం. నాయరదమ్మున కెల్లప్పుడుం వెలిమావులఁగట్టించుటం జేసి శ్వేతవాహనసమాఖ్య సార్థకమయ్యె. కయ్యములయందు శత్రుసైన్యముల బీభత్సంబు గావించువాఁడ కావున నన్ను జనులు భీభత్సుండందురు. రాజసూయక్రతు ప్రారంభం బున నెల్ల నృపులఁ గెల్చి వారిధనంబులు సంగ్రహించి తెచ్చుటం జేసి నేను ధనంజయుఁడనైతిని. కుడిచేతఁ నెడమచేతఁ గూడ గాండీవంబు సారించి యలుఁగుల నేయునిపుణత గలిగినవాఁడనగుట, నందుముఖ్యముగ సవ్య హస్త ప్రయోగ కుశలుఁడ నగుటసవ్యసాచియనంబరఁగుదు. జయశీలుఁడ నగుటచే జిష్ణుఁడ నైతి. నే నేపోరితమున కరిగిన నాపోరితమున నాకు విజయమే సంప్రాప్తించుచుండుటం జేసి నన్ను విజయుఁ డందురు. ఈపది పేళ్ళుంగాక కృష్ణద్వితీయుండనై ఖాండవవనంబు గాల్చినప్పుడు

నావరాక్రమమునకుఁ బ్రీతులై ప్రజాపతియు రుద్రుఁడును నా యెడఁ బ్రసన్నులై కృష్ణుఁడను నేకాదశనామంబు నాకిచ్చిరి. ఇదిగాక నరుం డను పంద్రెండవ నామంబుగూడ నాకుఁ గలదు. బదరికావనమున నరనారాయణులను పురాణమునులు తపంబు సేయుచుందురు. అందు నరాంశంబున నేనును నారాయణాంశమున వాసు దేవుండునునవతరించినట్లు భగవానుఁడైన శ్రీ కృష్ణద్వైపాయనుఁడు తొల్లి చెప్ప వింటి. అకారణమున నన్ను నరుఁడందురు. ఇది నానామధేయవృ త్తాంతము. కుమారా! నీకిప్పుడైన విశ్వాసము గలిగినదా? "ఆవాక్యంబులు శ్రవణగోచరముల యినతోడనే తన యెట్టయెదుటఁ బేడిరూపున నిలిచిన యాతఁడె ధనంజయుఁ డగుటకుఁ బరమహర్షము నొంది భూమింజయుఁడాయుధములు కట్టగట్టి భద్రంబుగ మాని పై నెప్పటి యట్లయిడి గుభాలున చెట్టు మీదినుండి యుఱికి యర్జును నకుసాష్టాంగదండప్రణామము చేసి" మహాత్మా! నీదర్శనమున సకలకిల్బిషములు తొలంగెను. ధన్యుఁడైనతి. నీవు సామాన్యుఁడ వనుకొని నిన్నుఁ బలు తెఱంగులఁ దూలనాడితి. నాతప్పులు సైరించి నన్ను మన్నింప వలయును." అని కేలు మొగిచి వేఁడుకొనియెను. అర్జునుఁ డాతనిఁ బ్రియమాఱఁ గౌఁగిలించుకొని "కుమారా! నీవు గావించిన తప్పేమియు లేదు. జగత్త్రయవిజయ తేజులగు కౌరవవీరులతో నీవు పోరఁగల్గుదువా? నీపిఱికితనము క్షమింపఁదగినదె." యని మేనఁ జేయిపైచి తట్టి మన్నించెను. నీ పూర్వరూపంబు గ్రహింపుమని భూమింజయుఁడు వేఁడ నర్జునుఁ డట్ల సేయుదునని మహేంద్రదత్తంబును మణిగణవిరాజితంబును నిరుపమాన ప్రభాభాసమానంబును నైన కిరీటంబు శిరంబునఁ దాల్చి రత్న ఖచిత కనక కుండలములు కర్ణములఁ గీలించి హస్తంబుల సువర్ణవలయంబులు పెట్టి మయిమఱువు దొడిగి పేడిరూపంబు విడిచి యజ్ఞాతవాస దీక్షాసమయంబునుఁ దాము విడిచిన యమూల్య వస్త్రాలంకరణములు మరల ధరియించి యక్షయతూణీరము లరదమునం బెట్టి యుత్తరుని

సింహధ్వజము దీయించి వృక్షముపైఁ బెట్టించి తనకపిధ్వజము రథముపై నెలకొల్పెను. ఉత్తరుఁ డాధ్వజమును మిక్కిలి యక్కజంపడి చూచెను. అనంతర ముత్తరుఁడు నొగలపైఁ గూర్చుండ నర్జునుఁడు రథారూఢుఁడై దెసలు ప్రతిధ్వను లీన దేవదత్తము పూరించె. అమహానినదము విని యుత్తరుఁడు మూర్ఛవోయెను. హయములు భయభ్రాంతము లై చేష్టలు దక్కి పీనుఁగుల చాడ్పున నిలిచెను. అదిగని యర్జునుఁడు రాజకుమారుని పిఱికితనమునకు మిక్కిలియచ్చెరువడి మొగమున నీళ్ళు చల్లి వెండియుఁ దెలివి వచ్చునట్లు చేసి "ఉత్తర! ఏమిది మూర్ఛవోయితివి. రాచపట్టివి. కయ్యముల తెఱఁగు లెఱుంగుదువు. రణ నిస్సాణములమ్రోతలు, చిందవములయులివులు, యుద్ధరంగవముల వినబడుచుండవా? ఇంతమాత్రమున కింత చకితుఁడవు గానేల!" యని పలికెను. అదివిని యుత్తరుఁడు "మహాత్మా! రణభేరీ భాంకరణములు వినియుంటి. శంఖనినాదముల నాకర్ణించియుంటిఁ గాని జగద్భయంకరం బగు నిట్టి హృదయదారుణశబ్ద మెన్నఁడు విన లేదు. పిడుగు పడిన చందమున నున్నది. గాని చింద మొత్తిన చెలువము లేదు. చూడు! అయ్యులివు విని మింటఁబాతెడుపులుఁగులు చచ్చి నేల రాలినవి. గుఱ్ఱములు శవములట్లు కదలక మెదలక యున్నవి. నీధనుష్టంకారములు నీశంఖనినాదములు నలోకసామాన్యములు." అని పలికి సేదదేఱి మరలఁ బగ్గములఁజేతంబట్టు కొనియె. అర్జునుఁడు రథము డిగి గుఱ్ఱముల మీఁదఁ జేయిపైచి మేనులు నిమిరి వెఱ పుడుపి మరల రథారోహణము సేసె. పాండవమధ్యముని శంఖరావం బాలకించి కౌరవ బలములు కలగుండు పడియెను. ఉత్తరుఁ డరదముఁ దోల నారంభించెను. అర్జునుఁ డాకర్ణాంతముగ వింటినారి లాగి కురురాజ సైనికుల గుండె లవియునట్లు దెసలు మాఱు మ్రోయునట్లు మిక్కిలి భయంకరవముగా ధనుష్టంకారవము సేయఁజొచ్చెను. ఆచాపనిక్వణనము నాశంఖధ్వని విని యాచార్యుఁడు భీష్మాదులతో నిట్లనియె. జ్యాఘోషము శ్రవణపుటముల భేధించుచున్నది. శంఖనాదము

గుండె లవియఁ జేయుచున్నది. పడగ కన్నులకు మిఱుమిట్లు గొల్పుచున్నది. కిరీటకాంతి యింద్రధనుస్సు మెఱుంగువలె గగనభాగము గ్రమ్ముకొనుచున్నది. ఆధనువు గాండీవము. ఆశంఖము దేవదత్తము. ఆధ్వజము కపిధ్వజము. ఆమకుటము మహేంద్ర దత్తము. ఆవీరుఁ డర్జునుఁడు. ఇతఁ డిప్పుడు దుర్నిరీక్ష్య తేజుఁడై యెల్లవారఁ గ్రమింగునంతటి రోషమున వచ్చుచున్నాఁడు. నేనిప్పు డొక యుపాయము సెప్పెదవినుఁడు. అతఁడు పదుమూఁడేండ్లనుండి రాజుపై గట్టిపగఁబూని యున్నవాఁడు మీన్నపాలుం డాతని బాఱిం బడిన బులినోటికండ తెఱఁగున మన మీతని విడిపించుట దుష్కరము. కావున సైన్యమున నాలవపాలు పంచి రారాజున కిచ్చి యాతనిముందు నడువుమనవలయు. మఱియొక నాల్గవ పాలు సేన యొక యోధవరున కిచ్చి రాజువెనుక గోవులఁదోలుకొని పొమ్మనవలయు." తక్కిన యరపాలు సేన గూర్చికొని మన మర్జునుందలపడవలయు ననుచున్న యాచార్యునకు సుయోధనుఁడు బిట్టలిగియి త్తెఱఁగుననతని నధిక్షేపించెను. "ఏల యీ వృథా సంభాషణములు. నాఁడు జూదమునం దోడి పాండవులు వనవాసమున కరుగనప్పు డజ్ఞాత వాసకాలమున మనము వారిం గనుఁగొందు మేని మరలఁ బండ్రెడేండ్లు వనవాసమున కరుగవలయు నని సమయము సేయఁబడియెఁగదా. ఇప్పుడర్జునుఁ డజ్ఞాతవాసదీక్ష సంపూర్తి కాకమునుప మనకుఁ గానఁ బడియెనో, దీక్ష పూర్తి యైన పిదప మనకు గోచరుఁడయ్యెనో భీష్ములు నిర్ణయింప వలయు. అతఁడు లోభమున సమయభంగము గావించుకొని వచ్చెనేని వారు రెండియు ద్వాదశాబ్దములు గహనవాసము గావింపవలయు. కావున నిది యునుయున్న నిశ్చయింపవలయునది యటుండ నర్జునుఁడు వచ్చె నర్జునుఁడు వచ్చెనని యూరక భయంపడి వంది పొగడిన తెఱఁగున వాని నంత పొగడనేల? అర్జునుడు దుర్జయుఁడు గాఁడు. మదీయ చాప విముక్త క్రూరభల్లముల నాతనిమేను సించెద. ఈమందాకినీ నందనునికన్న నీరాధేయుని కన్న నాకవ్వడి పోటుమానిసి గాఁడు. ఔఁగాక! మన మిక్కడి కేలవచ్చితిమి?

పాండవులు మత్స్యనగరమున నున్నవారో లేరో కనుఁగొందమని వచ్చితిమి. ఉన్నవారని కనుగొంటిమి. వచ్చివానికి భయంపడి యిట్లు వదరుట యుచితమా? ఈపలుకుల వలన సైనికుల యుత్సాహము జాఱిపోవదా? ఇట్టి యాలాపము లుచితములా? ఇతఁడు బ్రాహ్మణుఁడు; వయోవృద్ధుఁడు; విశేషించి యాచార్యుఁడని యుపేక్షించిన కొలందినోటికివచ్చినట్లు వదరుచున్నావు. పరమవైదికు లైన మీరు యుద్ధమునకు రాక స్కంధావారంబున నుండి స్వస్తివాచకములు సేయుచు మా విజయంబు గోరుచుండవలసినవారు గాని కయ్యంబులకు రావలసినవారు గారు. మేము యజ్ఞములు సేయునప్పుడును మాయింటశుభ కార్యములు డరుగునప్పుడును మాకు విద్యలు గఱపునప్పుడును మిమ్ము మేముసకలవిధంబులఁ బూజింపఁదగును గాని సంగ్రామంబులకుఁ దోడ్కొనివచ్చుట మాదితప్పు.'' అని కౌరవేశ్వరుఁడు తనతండ్రి నధిక్షేపించుచుండ నప్పలుకులు కర్ణకఠోరములగుటయు నశ్వత్థామయాజ్యాహుతులచే మండెడు నగ్నిహోత్రుని చందమున మండిపడుచు నిజాసనంబునుండి లేచిరాజరాజున కభిముఖుఁడై వానికిట్లనియె, ''కౌరవేశ్వరా! నీసేమంబు విచారించి యాచార్యుండట్లు పలికెఁ గాని కీడు సేయుటకుఁ గాదు. నీమే లరయువారెవ్వరో కీడరయువారెవ్వరో నీవెఱుఁగవు. ఆచార్యునకు నీవెట్టిగారాబుశిష్యుఁడవో యర్జునుండు నట్టివాఁడె. అతఁడు పుత్త్రనిర్విశేషుఁడు. ప్రేముడి యుటుండ నిమ్ము. సురాసుర దుర్జయుఁడును మహేంద్ర దత్తమకుటుండును మహేశ్వరానుగ్రహపాత్రుఁడునునైన పార్థునిమగంటిమి యగ్గించుట మిక్కిలి దోసమా? మేలిగొనంబులు పగవానికడనున్నను నవిపొగడఁ దగిన వేయగును. దుర్గుణంబులాప్తులకడ న్నను నవిగర్హ్యంబులె. ఇంతకుఁ గయ్యమునకు మేము పనికి రామని నీవు చెప్పుచుంటిని. నీవు పాండవులసిరి పోరునం గెలిచిగ్రహింపలేదు. శకుని సాయమున జూదమునఁ గెలిచిపుచ్చి కొంటివి ఆశకునియె యిప్పుడర్జునుం

గెలుచుఁగాక! అర్జునుఁడు గాండీవమున నిప్పుడు పాచికలు వైవఁడు. ప్రావృషేణ్యపయోధరము కుంభవృష్టిగ వానగురిసినచందమున నంపములఁ జిమ్మును. నీవు చెప్పినట్ల జన్నములకు శుభాశుభ కార్యములకు మేము వత్తుము గాక'' అనుచుండ రాధేయుఁ డురోషభీషణలోచనుఁడై యాచార్యనందనునకిట్లనియె. '' ఓయి! రా రాజుమాటలలోఁ దప్పేమున్నది? పాండవు లెందున్న వారని వెదకి వెదకి యెట్ట కేలకువారింగనుంగని కయ్యంపుటవసరమున మీయయ్యపిఱికిమాటలు పలుకఁదగునా? దురభిమానంబునఁ దండ్రిని వెనుక వైచికొ నివచ్చెదవుగాని నీతండ్రి కురురాజు సొమ్ము దిని పాండవపక్షపాతియైజీతబత్తెములు లేని సేవకుడై వారింబొగడుచుండును. ఇందులకునీవుసిగ్గుపడవు. మీరుకయ్యమునకు వచ్చినను నింటికడ నున్నను నొక్కరూపె. ఆశీర్వాదములకై యక్కఱకువత్తురు గాని పోరాటములుకు మీరు పనికిరారు. రారాజునకు మీరెప్పుడు నమ్మిన బంటులుకారు. నేను విల్లుదాల్చి యుండమీపని యేల? భృగు రామకృ పాలబ్ధమైననాధనుః పాండిత్య మెల్లఁజూపి ఖేచరులు భూచరులున చ్చెరువడ నర్జునుం దలపడియెద. అర్జునునకు నేన ప్రతివీరుండనని నన్ను నమ్మిన రారాజుబుణముదీ ర్చుటకును గర్ణార్జునులలో నెవ్వరధిక సమర్థులని లోకులకుఁగల సందియంబు వాపుటకును జిరకాలమునుండి నిష్ప్రయోజనములుగా నుండిన నా దివ్యాస్త్రములకుఁదగినపని కల్పించుటకును నేఁడవకాశంబు గలిగె, ఈవల మనమింతమంది మహావీరులమున్నారము. మనలోనొక్కొకఁడ ముజ్జగంబుల నొకకడకుఁ దీగలఁడు అదియునుఁగాక మనకు జతురంగబలంబులు బాసటయ్యె యున్న యవి ఆవలవచ్చినవాఁడు పార్థుఁడొక్కఁడె ఒక్కని కింతమంది జడియుట యేటిప్రతిష్ఠ? అతనికి భయంపడితి రేని మీరందఱు నిలువుడు. చాపమాత్ర ద్వితీయుడనై నేనొక్కడ పోయి యక్కొంతేయుని నుక్కడంచి చెప్పెరవచ్చెద.'' అనుచుండ గృపాచార్యుడు వాని మాటకడ్డముపోయి యిట్లనియె. ''చాలుకర్ణ! చాలు

నీ రజ్జులు. పిన్న నాఁటనుండియు నీగొనంబులు గని పెట్టుచున్న వాఁడ. ఎప్పుడుగయ్యమునకు గాలుదువ్వుదువు గాని నెయ్యంబు బాటింపవు. యుద్ధమధమసాధన మని నీతికోవిదులు పల్కుదురు. నీవింత మాత్ర మెఱుంగవు. అర్జునుఁడొక్కఁడేగదావానికింత వెఱవనేల యని నీవు ద్రోణాశ్వత్థామల నధి క్షేపించుచుంటివి. పురుహూతుఁడు పుష్కలావర్త మేఘములతో నడ్డువచ్చినను వానినొకపూరికింగొనక ఖాండవవన మాయర్జునుఁడొక్కరుఁడ కాదె కాల్చె యాదవులందఱుఁద నమీఁది కెత్తి వచ్చినప్పుడు వారింటోర గెలిచి సుభద్ర నొక్కరుఁడకా దెతెచ్చె? కౌరవేశ్వరుని గంధర్వులు చెఱబట్టిననాడు గంధర్వులతో బెనఁగి వారిఁగెలిచి రాజరాజు నతఁడొక్కరుఁడ కాఁడె విడిపించె? ఫాల నేత్రునితోడ నెక్కటికయ్యము సలిపి యతఁ డొక్క రుఁ కాడె యతని మెప్పించె. అమరనిర్జేయు లగునివాతకవచకాల కేయాది దానవు లనునాత డొక్కఁడె కాదెగెలిచె! ద్రౌపదీకల్యాణ కాలమున నర్జునుఁడు మత్స్యయంత్రంబుఁదెగ నేయ నాత నిపై రాజకుమారులనేకులు బడుయుటయు. వారినందఱి నాతఁడొక్కరుఁడ మార్కొని బలాయితులం జేయుటయు నీకన్నులతోనీవుచూచినవృత్తాంత మేగదా! ఘోషయాత్రా సమయమునఁ గౌరవేశ్వరుఁడు గంధర్వులచేతంజిక్కినప్పుడు జేనికి బహిఃప్రాణంబవు నమ్మినబంటవు నచ్చినపోటు మానిసివి ప్రాణమిత్రుఁడవు నీవుసన్నిధి నుండియు నేమి సేయఁ గలిగితివి? అర్జునుఁడు వచ్చి కావకున్న రాజరాజుపని యేమైయుండును! ద్రోణాశ్వత్థామలు రాజభక్తి నినీకుం దీసిపోవువారు కారు. రాజానుగ్రహంబుసంపాదించుటకునీవు వారిందూఱుచుందువుగాని నీబిభీషికలకు బెదరువారు లేరు. నీబీరంబులు విశ్వసించువారులేరు. మాపరస్పరవిరోధంబులు గట్టి పెట్టిమన మందఱము రాజుపనువుసేయవలయు. కావునఁ గార్యాలోచనము సేయుట మంచిది.''

ఇట్లు పరస్పరాక్షేపంబులు సేయుచున్న యాయోధవ రులంజూచిగాం గేయుఁడు కార్యంబు చెడుచున్న దనిభయంపడినిజాసనంబుననుండి లేచి

యొక చేతితో నశ్వత్థామకరంబును నొకకేలఁగృపాచార్యుహస్తంబును బట్టుకొని "మీరు వేదంబును ధను ర్వేదంబును నొక్క మచ్చున నధిగమించిన మహానుభావులరు. కౌరవ సేన సేనాపతులు పరస్పర విరోధ కారణంబునఁ జెడియెనని లోకంబున నప్రతిష్ఠ కలుగు నేని ప్రసిద్ధులరు గావు నయ్యపకీర్తి మీతలన నిలుచు. రాజరాజు మీశిష్యుఁడు. రాధేయుఁడు నట్టివాఁడె. కౌరవేంద్రుఁడు సేయుమన్నన పెంపునఁ దనకు రాజు నెడఁ గల్గుభక్తి పెంపున నాతఁడట్లనియెంగాని క్రోధభావంబునంగాదు. ఆచార్యుండును మీరును ననినమాటలు సత్యంబులు. శిష్యవత్సలులగు మీరు వూతప్పులు సైరింపవలయు." అని బ్రతిమాలుటయుఁ గృపాశ్వత్థామలు "సైరించుటకు మేమెవ్వరము? సమరము నడుపుటకు మే మెవ్వరము? కార్యసాధనమునకుఁ గర్ణసాబలు లున్నవారు. ఇంతకు ద్రోణులచిత్తము శాంతము నొందవలయు. అతఁడవమానితుఁడైన మే మందఱ మవమానితులమె. అతఁడు ప్రసన్నుఁడైన మే మెల్లరముఁ బ్రసన్నులమె." యని పలికిరి. అపుడు గాంగేయుఁడు ద్రోణాచార్యునిం జూచి "మహాత్మా! సుయోధనునియెడ నుప్రసన్నుండవై సమరసన్నాహంబు సేయవే" యనవుడు నతఁడు ప్రసన్నవదనుఁడై యట్ల కాక యనియె. అపుడు దుర్యోధనుఁడు పితామహుం జూచి "అయ్యా! నే నడిగినప్రశ్నంబున కుత్తరంబీయవలయు. సవ్యసాచి సాహసంబున సమరమున సన్నద్ధుఁడయ్యె గదా! పదుమూఁడవయేఁడు దాఁటిన వెనుకం దన్నెఱింగించుకొని యెనా! దాఁటకమున్నె బయలుపడియెనా! ఈధర్మనిర్ణయము సేయవలయు" నని కోరుటయుశాంతనవుఁడు జూదంపునాఁటంగోలె లెక్కలు సూచి ధార్త రాష్ట్రున కిట్లనియె. "కౌంతేయులు కాంతారవాసంబున కరిగిన రెండవయేట నధికమాసము వచ్చె. ఇట్లు మూఁడేండ్ల కొకసారి వచ్చిన మిక్కిలి నెలలు లెక్క చూచికొందువేని బాండవులయజ్ఞాతవాసదీక్ష నిన్నటితో సమాప్తమయినది. అందు చేత మన మిప్పుడు కయ్యమే కార్యసాధనముగాఁ జేసికొనవలయు గాని సమయభంగవ్యాజమున వారిని పెండియు నడవుల

కంపఁజాలవు.'' ''అనవుడు దుర్యోధనుఁడు సరేయని యుద్ధమారంభింపుమనియె. అపుడు కుంభసంభవుఁడు చెప్పిన తెఱఁగున దళమున నాలవపాలు రాజునకుఁ బంచియిచ్చి యాతనివెనుక మఱియొకనాలవపాలు వేఱొక యోధునకుఁ బంచియిచ్చి యాల మందలం దోలుకొనిపొమ్మనియు గాంగేయుఁ డానతిచ్చెను. అది యట్ల జరిగె. తక్కిన సైన్యంబంతయు నొక్క వ్యూహముగాఁబన్ని దాని ముఖమున రాధేయుండును నడుమ నాచార్యుండును దాపల నశ్వత్థామయు వలపలఁ గృపాచార్యుండును వెనుక శకుని సైంధవ బాహ్లీక సోమదత్త భూరిశ్రవసులును దమ తమ బలగములతో నుండఁ బనిచి మందాకినీనందనుడు తన తాళ ధ్వజం బెత్తఁ బనిచి యందఱి వెనుకఁ దానుండి సమరసన్నద్ధుఁడయ్యె. అప్పు డర్జునుఁడు రథము దోలించుకొని యామొన దృష్టిగోచర మగునంతవఱ కరిగి యరద ముమీఁద నిలిచి యత్తెఱ్తి చూచి యుత్తరునితో ''సైన్యమునన ల్పభాగము ముందరుగుచున్నది. మఱికొంతభాగము పసులమందం దోలుకొని దాని వెనుక నరుగుచున్నది. తక్కినయరపాలు నిచ్చట నున్నది. దురాత్ముడైన దుర్యోధనుఁ డెందున్న వాఁడో కానఁబడుట లేదు. ఆతనింబొడగని తాఁకుట పసులవిడిపించుట యను రెండు కార్యములు మనపై నున్నవి. ఈ రెండును మనము సేయువలయు. కురురాజిప్పుడు కనఁబడుట లేదు. కావున ముందుగా గోవుల విడిపింతము. అప్పనికిఁ బోవుటకుమున్న ద్రోణకృపభీష్ములకు వినయపూర్వకముగ నాకుశలవార్త నెఱిఁగింపవలయు'' నని వారిచరణములకడ రెండేసి నమస్కార బాణము లేసి తనకుశలవార్త దెలియఁజేయుటకు వారిశ్రవణముల చెంతనుండి పోవునట్లు రెండేసియమ్ములం బ్రయోగించి క్రోశద్వయ మాత్రదూరమునుండి రథము మరలించి కౌరవసైన్యమునుకుఁ బశులకు నడుమఁజొచ్చి యాకదుపులం గొనిపోవుచున్న యల్ప కౌరవసైన్యమును నిశితశరజాలముల నొప్పించి వారిం బలాయుతులఁ జేసి గోగణముల నవలీల విడిపించి మున్ను ఖిన్నులై

కౌరవసేనతోఁ జనుచున్న గోపాలకులంబిలిచి బశువుల నెప్పటి యట్ల విరటునిబీడుల కుంగొనిపొండని యానతిచ్చి ప్రాంతపగతుఁడైన సుయోధను నెందుం గానక కౌరవ సేనానాయకుల నుత్తరునకు నిరూపించి యిట్లుచెప్పెను. "కుమారా! ఉత్తుంగ తాళ ధ్వజమువాఁడు భీష్ముఁడు. ఇతఁడు కౌరవులకును మాకును బితామహుఁడు. చిన్న నాఁడితఁడు మమ్ముంబెంచె. ఇతనికి మేమునుగౌరవులును నొక్క చందమువారమె. కాని ధార్తరాష్ట్రులకడ నునికిం జేసి కయ్యములయందుఁ దత్పక్షములఁ బూనుచుండును. ఇతఁడు పరశురామశిష్యుఁడు. శిష్యుఁడను పేరెగాని ధనుర్విద్యా కౌశలమున నస్త్రశస్త్రప్రయోగతంత్రముల భార్గవరాముని కించు కేనియుఁ దీసిపోవఁడు. ఒకనొకకారణమున భార్గవునితోఁ బోరి యీమహాత్ముఁ డాతనిఁ గయ్యమున నిర్జించె. మనరథము ముందుగా నమ్మహాత్ముని యెట్టయెదుటకుఁ గొనిపోవద్దు. పోవుదు మేని మనము దుర్యోధనుని చెంతఁ జేరకుండ నీయన పలుసిలుగులం బెట్టు. కాంచన మయవేదికాధ్వజమువాఁడు ద్రోణాచార్యుఁడు. ఈతఁడు సకలకురుకుమారశిక్షకుఁడు. కురుకుమారులకే గాదు. సకలనృపకుమారుల కీతఁ డాచార్యుఁడని చెప్పవచ్చును. ఈతఁడు వేదము ధను ర్వేదము సాంగముగ నధిగమించె. పరశురాముఁడు తనయస్త్రసర్వస్వము నీమహాత్మునికిచ్చెను. నాయందీమహాత్మునకుఁ బుత్త్రప్రేమ నింద్య మైనక్షత్రియజన్మ మెత్తుటంజేసి యీయాచార్యులతోడఁ బోరవలసివచ్చె. ఈతనితో ముందుగా మనమే కయ్యమునకుఁ గాలుదువ్వవద్దు. సింహలాంగూలముసిడ మువాఁడు ద్రోణనందను డగునశ్వత్థామ. ఈతఁడు సురాసురదుర్ని రీక్ష్య తేజుఁడు. శివుఁడు కుమారస్వామికి సకలవిద్యలు నేర్పిన తెఱఁగున ద్రోణుఁ డితనికి విలువిద్దెం గలసకలమర్మములు నేర్పెను. కౌరవసేనానాయకులలో నితడు మిక్కిలి పేరుపడినవాఁడు. తండ్రికున్నం తప్రేమ నాయం దితనికి లేదు. అవృషభధ్వజమువాఁడు కృపాచార్యుఁడు. ఈతఁడు మాతండ్రికి గారాబు

చెలికాఁడు. ధైర్యమున హిమవంతునివంటివాఁడు. అశ్వత్థామకు మేనమామ. ద్రోణులు మాకాచార్యులు గరాకమునపు కృపుఁడే మాకు శైశవమున ధనుర్విద్యాగురుండై యుండెను. ఈతఁడను సకలశస్త్రాస్త్రకోవిదుఁడు. మాకు వందనీయుఁడు. అల్ల శంఖధ్వజమువాఁడు సూతనందనుఁడగు కర్ణుఁడు ఇతఁడు యోధాగ్రేసరుఁడు. సమరోద్యోగానురక్తుఁడు. అసాధారణ బాహువిక్రముఁడు. పరశురామకృపాలబ్ధధనుర్విద్యాకుశలుఁడు. పాండవులన్న నీతనికి సహజ ద్వేషము. అందులో నాతో నితనికి నత్యంతమత్సరము. ఈతఁడు సమరమున నను గెలుచు నని నమ్మి కౌరవేశ్వరుఁడు వీనికంగ రాజ్య మిచ్చి యెంతయు మన్నన సేయు. రారాజున కితఁడు ప్రాణసఖుఁడు. కౌరవేశ్వరుని కార్యాలోచనమంతయు నీతనితలపై నున్నది. ఒక మాత్రపుజోదు నతఁడు చీరికింగొనఁడు. ఈతనితో గయ్యము నాకు బరమానందకరము. కుమారా! రాజరాజు మనకిప్పుడు కనబడుట లేదు. అవ్వల నేవ్యూలనో యడగియుండబోలును. అతఁడు నాగ కేతనుఁడు. కౌరవసామ్రాజ్య, దురంధరుఁడు గదాయుద్ధవిశారదుఁడు. కౌరవపాండవ వైరమునకు మూలకారణము. అతనితోఁ బెనఁగెడు దినము నాకుఁ బండుగుదినము. ఆదురాత్ముని పేరు నాతలపునఁ బారినమాత్రమున నామనము మంటలోఁబడినట్లు మండును. అతఁడు కనఁబడినంతమాత్రమున నరదము నాతనిమీఁదికె దోవనిమ్ము. కౌరవ సేనలో వీరు ముఖ్యయోధులు. వీరలు గాక నుయోధనుని మేనమామయగు శకునియు, రారాజు చెలియలిమగడును సింధురాజు నగు జయద్రథుఁడును, సుయోధనానుజుఁడగు దుశ్శాసనుడును మున్నగుజోదులుగలరు. శకుని ద్యూతకళావిశారదుఁడు. కల్ల జూదమాడి యొరులసిరుల నపహరింపుమన్న నతనిబుద్ధి పాదరసము వలెఁ బ్రవహించును. అమ్ముల నేయుటకన్న నడ్డసాళుల నేయుటలో నతఁడు మిక్కిలి నిపుణుఁడు. దుర్యోధన ప్రేరణమున గపటదురోదరమున నీశకునియె మాయైశ్వర్య మెల్ల నపహరించె.

జయద్రథుఁడునేతిబీర కాయచందమున సార్థకము కానిపేరు గలవాఁడు అగస్త్యభ్రాత తెఱఁగున వీఁడు సుయోధనుని వంఱఁది యని గౌరవింపఁబడుచున్నాడు. కాని తన ప్రయోజకత్వమున బేరు పెంపు సంపాదింప లేదు. దుశ్శాసనుఁడు కౌరవకులపాంసనుఁడు. పాపము ద్వాపరయుగమునం దీరూపమున మూర్తీభవించె నని చెప్పవచ్చును. వయసున దుర్యోధనునకన్న జిన్న యయ్యు దుర్గుణంబుల నాతనికన్న దద్దయుం బెద్ద. ఇతఁడే ద్రౌపదీ కేశాంబరాకర్షణ మహాపాతకుఁడు. దుర్యోధన దుశ్శాసన కర్ణ సౌబలులు దుష్టచతుష్టయం వంన లోకంబున వ్యవహరింపఁబడుచుందురు. ఈతని యనార్యకార్యములకు బిట్టలుకఁ బూని మా యన్న వృకోదరుఁడు వీనిని సంగ్రామమున లోకభీకరలీల వధియించి క్రొన్నెత్తురులు ద్రావుదు నని ప్రతిజ్ఞ చేసెను. కుమారా! అల్లది చూడు. పశులను విడిపించితి ననుకోపమున గౌరవ సైన్యము లొక్క పెట్టున మన మీఁద గవియుచున్నవి. పరమశ్రద్ధాళువులై రథంబున డుపుము. ఇదె నేనును సిద్ధమగుచున్న వాఁడను" అని దేవదత్తంబు వొత్తి గాండీవము సారించి దిక్కులు పూరట్టిల్ల టంకారము చేసెను అప్పుడు మహోన్నత రంగపంక్తులతో మేరమీఱి వచ్చు మహాన ముద్రమట్లు కౌరవసేన కౌంతేయునిపైఁబడియెను. రోషభీషణమూర్తియైన పాండవమధ్యముని విక్రమవిహారము వర్ణింపనెవరితరము?

ఉత్తరుఁ డాతనియరదము చిత్రగతుల నడిపెను. ఆమహావీరుని యెదుటఁ బడినవారందఱు దండధరు యెదుటి కరిగిన వారె. ఏనుఁగులు పీనుఁగు లయ్యె. హయములు క్షయమునందె. రథములు శిథిలము లయ్యె. పదాతులు భీతులై ప్రాణముల కానపడి పరువులెత్తిరి. కొందఱుజోదులను జందెము పెట్టుటగా నటికి కొందఱును రంపమునం గోసినట్లు కోసి కొందఱఁ జెఱకుగఱ్ఱలఁ జెండినట్లు చెండి పార్థుఁడాకయ్యమున యథేచ్ఛముగా విహరించెను. తలలు లేని

మొండెములు, మొండెములు లేని తలలు, కాలు సేతులు లేని పట్టి మేనులు, చెవులుముక్కులు లేని తలలు, చూపర కతిభయంకరములై యుండెను. తుండములు తెగిన యేనుఁగులు, తోఁకలు తెగిన గుఱ్ఱములు, రథాంగములు విఱిగిన శతాంగములు, నుసురులు బాసిన కాల్బురుఁ, గలిగి యారణరంగము హృదయదారుణముగ నుండెను. నెత్తురు వరదలై ప్రవహించెను. మత్తశుండాల ములయు నాజానేయ తురంగములయు దేహములనుండి శోణితము కొండలమీఁదనుండి పాఱు జేగురు సెలయేళ్ళ తెఱఁగునఁ బ్రవహింపఁ జొచ్చెను. చిమ్మిలిగొట్టములలో నుండి వచ్చి వసంతమట్లు జోదుల మేనులనుండి రుధిరము ధారలై ప్రవహించెను. ఆస్థల మంతయు వసంతోత్సవము క్రొత్తగాఁ బ్రవర్తిల్లిన మృత్యుదేవతా గృ హాంగణము చందమున నుండెను. ఆసందడికయ్యమున జోదులు క్రోధపరవశులై చచ్చినపదాతులను నింకం గొనయూపిరితోనున్న కాల్బురను చేతులు కాళ్ళు తెగిపడియున్న వీరులను ద్రొక్కినడువంజొచ్చిరి. వరదలై పాఱుశోణితము జలముగ రక్తసిక్తములైన యోధులముఖములు నెఱ్ఱదామరలుగ మహాయోధుల వెల్ల గొడుగులు తామరాకులుగ వారిశిరోజములు నాచుగ తెల్లని యుష్ణీషములు మరాళములుగ నాపోలికలను సరోవరము చందమున భాసిల్లెను. శోణితప్రవాహ మేటి నీరుగ స్యందనములు నావలుగ సారథులు చక్రరక్షకులు మాలిమికాండ్రుగ రథికుఁ డూర్ధ్వలోకప్రయాణము చేయు త్రైర్థికుఁడుగ నాయుద్ధరంగము మహానదివలె నలరారెను. పార్థుఁడు సూత్రధారుఁడుగ చతురంగబల ఘట్టనమున రేఁగిన పరాగము తెరగా వచ్చిన తోడనె చచ్చి తొలంగి క్రొత్త వారలకుఁ దావిచ్చుజోదులు పాత్రములుగ నాకసమున నున్న దివ్యులు ప్రేక్షకులుగ యోధులనోటినుండి వెడలు నాక్షేపవచనములు కథాకలాపముగ సంగ్రామరంగము నాటకరంగమువలె శోభిల్లెను. మదనాగములు మహీధరములుగ తురంగములు తరంగములుగ సైనికులు మీనములుగ రణరంగము రత్నాకరమట్లు రాజిల్లెను. లెక్కకు మీఱిన యాజోదుల

కందఱకు వేనవేలు పార్థులు వచ్చి యొక్కొక్క జోదుతో నొక్కొక్క పార్థుఁడు వచ్చి పోరినట్లు తోఁచెను. మాటలాడుచున్న వారు మాటముగింపకుండఁగనే నడచుచున్న వారు నడచుచుండఁగనే యెత్తి నబాహులెత్తి నట్లుండగనే పార్థ బాణ ప్రహారవములచే జోదులు తెగుచువచ్చిరి. ఈవిధవుగ నర్జునుఁడొక్కరుఁడు క్షీరసాగరమునఁ దిరిగిన మందరశైలము తెఱంగున కౌరవసేనాసముద్ర మధ్యమునం బడి నిరంకుశ వీరవిహారము సలుపుచుండ సామాన్యులగు సౌబలజయద్రథముఖ్యులు బెబ్బులియెదుట నిలువఁజాలక దర్శనమాత్రమునఁ బలాయనము సేయులేళ్ళవడువునఁ బాఱి పితామహుని శరణము సొచ్చిరి. అప్పుడు దళముల దురవస్థంజూచి యంగరాజు తనయరదము పార్థుని కభిముఖముగఁ దోలించిన గాండీవియు వానిక భిముఖముగఁ దనస్యందనము వోనిమ్మని యుత్తరుం బురికొల్పి రాథేయున కభిముఖుఁడై క్రోధఘూర్ణ మానవ యవ తారకుఁడై కనుబొమ్మలు ముడివడ నాతని కిట్లనియె. ''అంగరాజా! చిరకాలమైనది నిన్నుఁ జూచి. కౌరవసామ్రాజ్య మహామందిరము నేలఁగూలకుండ నిలుపుచున్నమూల స్తంభమవునీవు. దుర్యోధనుని బ్రతుకంతయు నీతోడనే యున్నది. పరశురామ శిష్యుఁడవు. భండనప్రవీణుఁడవు. సకలశస్త్రా స్త్ర వేదివి. సాంగ్రామికశాస్త్రకోవిదుఁడవు. నీవింత సేపు బలము లా తెఱంగున నలజడి పొందుచుండ వానిసంక్షోభము దీర్పక యొందుదాఁగితివి. కౌరవసభలో ద్రుపద రాజపుత్రిక నల్ల సోకస్తులాడుటగాదు. రాజరాజునకు దుర్బుద్ధులుపదేశించుట గాదు. ఇది సంగ్రామము. సుయోధనుఁడు నిన్ను నమ్మి భీష్మద్రోణాది మహాయోధులనైనఁదిరస్కరించుచున్న వాఁడు. అట్టిలోకైకవీరునితోఁ బెనంగవలయు నని నాకెంతయుఁ గుతూహలము గలదు. రారమ్మని మనసునొచ్చునట్లు కఠినోక్తులు పలుకుటయు రాథేయుఁడు మిక్కిలి కనలి ''యోపాండవ మధ్యమా! నీప్రతాపము నీబాహువిక్రమము నేనెఱుఁగనియవి కావు. నాఁడు కౌరవసభలో మీయేవుర ధర్మపత్నియైన ద్రుపదరాజ పుత్త్రికను రారాజు ముందలపట్టి యీడిపించి

కోక లొలిపించినప్పుడు నీవు, బాహుబలదర్పితుఁడని గర్వించు మీభీమ సేనుఁడను మాన ధనులైన మాద్రేయులును, రాజసూయకర్త యైనమీజ్యేష్ఠ సోదరుఁడునను, గదాగాండీవాది సాధనములు దగ్గఱఁబెట్టుకొని యేమియుఁజేయఁజాలక యూరకుంటిరి గదా! క్షత్రియజాతున కంతకంటె నవమా నకరమైన కార్యమున్న దా? నాఁడు పనికిరాని పౌరుషము నేఁడు పని కివచ్చునా? "అడవుల పంద్రెండేడులు తిరిగి వచ్చి తీఁగదా. నాకింక రాజ్యము రాకపోవునా" యని పుట్టెడాసతోడ వచ్చితివి కాబోలును. కయ్యముచేసి రాజ్యము గెల్చుకొమ్ము. ఇప్పుడె నీపితృపితామహులసన్నిధికి నిన్నంపెద చూడుమని దూషణభాషణ పూర్వకంబుగ భీషణా స్త్రంబులం బ్రయోగించె. అర్జునుఁడు గాండీవ మేఘమునుండి తెంపులేనిశరపరంపర విడిచెను. అప్పుడా మహాయోధుల కిరువురకు భయంకర సంగ్రామము ప్రవర్తిల్లెను. కర్ణసోదరుడగు సంగ్రామజిత్తు మున్నగువీరు లాతనికి బాసటమైరి. సంగ్రామజిత్తు విస్వచ్చునియమ్ముల చిచ్చునకు మిడుత యయ్యెను. అర్జునవిముక్తములగు కోలలు వేడిమికి దాళంజాలక రాథేయుడు సంగరము విడిచి పలాయితు డయ్యెను. అనంతర మాపార్థుడు తనపై వచ్చుచున్న కుంభసంభవుగని చేతులు జోడించి నమస్కరించి నమస్కార బాణములచే నాతని పాదముల నర్చించి యిట్లనియె. "ఆచార్యా! పదమూడేడులనుండి మిమ్ముంగానక నామనము చింతాక్రాంతమై యున్నది. కన్నులకరవుదీర నేడుమిమ్ముఁ గనుఁగొని ధన్యుఁడ నైతి. నిష్కరుణమైన రాచకొలమునఁ బుట్టినకతమున విద్యాబుద్ధులు నేర్పి ప్రోచినయాచార్యులతోడ సమరము సేయవలసెం. ఇందుకు క్షమియించి ముందుగా మీరు నాపై శరములం జిమ్ముఁడు. అవ్వల నే నస్త్రముల విడిచెద. "ఆచార్యుఁడు వానిదీవించి మందహాసము సేసి తాను ముందు కయ్యము మొదలు పెట్టెను." అప్పుడు గురుశిష్యులకు నిరుపమానమైన ద్వంద్వయుద్ధము జరిగెను. "పుత్రాదిచ్ఛేత్పరాజయ" మన్నట్లు కుంభసంభవుఁడు పుత్త్రసమానుఁడైన శిష్యునిచేతఁ బరాజయము

నొందుటయు గౌరవంబయని తనకు పరశురాముఁ డిచ్చినయు సదృశ శరవిసరములు శిష్యునిపైఁ బ్రయోగించి యాతనికగ్నియు వరుణుఁడు మహేంద్రుఁడు ప్రసాదించిన దివ్యాస్త్రములు తనపై నేయ శిష్యుఁడిట్టిశస్త్రములు సంపాదించినందులకు సంతసించుచుఁ బోరాటము సలిపెను. పక్షపాతముచేతనో బలహీనతచేతనో ధనురాచార్యుఁడు గాండీవ నిర్ముక్త శరవర్షమున మునుఁగ గౌరవ సైన్యమున హాహాకారము లెసఁగెను. అప్పుడు కృపాచార్యుఁడును ద్రోణాయినియు నయ్యాచార్యునకు బాసటవ్వైవచ్చి పార్థునితో గయ్యము సలిపిరి. గ్రీష్మకాలమున మధ్యాహ్నమునఁ దనకిరణసహస్రంబులచే మహీమండల మంతయుఁ గాల్చుచు దుర్ని రీక్ష్య ప్రభాభాసమానుఁడై వెలయు నంశుమంతుని చందమునఁ బాండవమధ్యముండు గగనభాగమునుండి సంగరంబు దిలకించు దేవతలకుఁ బాండునృపాలుఁడు మొదలగు పితృ దేవతలకునింతింతయన రాని యక్కజంబుఁ గలిగించుచు గురుని గురుపుత్త్రుని గురుమఱందిని నొక్క పెట్టున వేసెను. అప్పుడు ద్రోణునిసూతుఁ డా వృద్ధబ్రాహ్మణుని యరదంబు సంగరరంగముననుండి యావలకుఁ దోలుకొని పోయెను. కృపాశ్వత్థామలు వానిముందర నిలువలేక పలాయన మే కర్తవ్యమని దాని నాశ్రయించిరి. అప్పుడ మ్మేటి విలుకాఁడు గంగానందనుడున్న నెలవు గనుంగొని యరద మాతని దెసకుఁ బోనిమ్మని యుత్తరునితోం జెప్ప నాతఁడట్లు చేసె. చిరకాలలబ్ధ సందర్శనము చేత మనుమనింగని తాతయుఁ దాతం గని మనుమఁడును బరమహర్షమునొందరి. అర్జునుఁడు మరల రెండు నమస్కారబాణములు భీష్ముని పాదముల పై వైచి ద్రోణుఁడట్లు ముందుగా నాతఁడె కయ్యమునకు దొరకొనఁ బోరునకు దివియెను. అప్పుడా బృందారకేంద్రనందన మందాకినీ నందనుల సుందరవీరవిహారములు బృందారక బృందమునకును గౌరవచమూపతులకును వేడ్క గలిగించెను. వారిరువురిలో నెవ్వరధికులో రెప్పవాల్పక చూచు వేల్పులకే నిర్ణయింప శక్యముగాకపోయెను. గాండీవి

రథహయములం జంపి సారథిమేన శరములు నించి భీష్ముని గాఢ శస్త్రముల నొప్పించెను. అత్తతీః బాండవమధ్యముని యెట్ట యొదుట నిలువఁదగదని శంతనతనూభవుఁ డవ్వలికిఁ దొలిగెను. అంతటఁ గౌరవ సైన్యమునఁ దనుకుమాత్రె పోరువీరుఁడు లేక పోయినందున శ్వేతవాహనుఁడు రాజరా జెందున్న వాఁడో గనుఁగొనఁదలంచి యరదము పై నిలిచి యల్లత్తి చూచి దూరమున నాగ కేతనము పొడకట్టి నాచాయ స్యందనముఁ దోలించుకొనిపోయెను. పోయి మేఁకపై నుఱుకుక్రోల్పులి చందమునఁ గౌరవేశ్వరుని యరదమున కెదురుగా నిలిచి "యోరోరికౌరవకుల పాంసనా! ఓరోరి ద్రౌపదీ కేశాంబరాకర్షణ మహాపాతక! ఓరోరి చంద్రకులకలంక! నిలునిలు పాటిపోకు ఎవ్వఁడు నీకు బహిఃప్రాణమని మహావీరుడని నమ్మితివో యాయంగ రాజు పాతె. నాశస్త్రాగ్ని జ్వాలల వేఁడిమికోడి గురుకృ పాశ్వత్థామలు సమరపరాఙ్ముఖులైరి. దుష్యంతభరతప్రముఖులవంశమున జన్మించినాఁడవు. రాజరాజని బిరుద మొందినాఁడవు. భీష్మ ద్రోణకృ పాశ్వత్థామప్రముఖు లగు మహావీరులకు దొరవు. విశేషించి ద్రోణాచార్యశిష్యుఁడవు. ఏపంగుణవిశిష్టుఁడవు. పందపై యీ తెఱంగునఁ బాఱం బాడిగాదు. మదగ జేంద్రంబు పై నెక్కి హస్తినాపురవీధుల నూరేగుట గాదు. నవరత్న ఖచిత మకరకుండల కేయూరాదిభూషణంబులు దాల్చుట గాదు. అమూల్యాంబరములు గట్టి మంచిగంధము మేనఁ బూసి మెలఁతలతో సరససల్లాపము లాడుట గాదు. ఉద్యానవనముల విహరించుట గాదు. పాండవులను లక్కయిండఁ బెట్టి చిచ్చు పెట్టుటగాదు. నిదురించుతఱి పాములఁ గఱపించుటగాదు. నీటఁద్రోయించుట గాదు. విసపుఁగూడు పెట్టుటగాదు. శుద్ధాంతకాంతారత్నమును గొప్పువట్టి కొలువులోని కీడ్పించి కోకలు విప్పుట గాదు. ఇది సంగ్రామము. ఉత్తమక్షత్రియ జాతుఁడవేని నీకుఁ బౌరుషము గలదేని నీవు పట్టినది విల్లగునేని నాయెదుట నిల్చిపోరుము. అంతియ కాని యాఁడుదాని తెఱంగున నిట్లు పాఱఁజనదు. అనియధి క్షేపించుటయు గాంధా రేయుఁడు

రోషకలుషితమనస్కుఁడై యోరోరి పాండవమధ్యమ! నీవు నాచేత జూదమున నోడింపఁబడిన బానిసవు. మహావమానములు గలిగినప్పుడు పౌరుషముఁ జూపఁజాలక యుధిష్ఠిరాజ్ఞాపాశబద్ధులమై యూరకుంటిమి గాని లేకున్నచో మేము ముజ్జగముల ప్రింగమా యని కోఁతలు కోసి తప్పన్న పైఁ బెట్టి మీప్రజ్ఞలు మీరం చాటుకొనంచచందురం. మీప్రజ్ఞలు నే నెఱుంగనివాఁడనుగాను. రారమ్ము. ఇప్పుడు మీతండ్రియొద్దకు నిన్ను బంపెద నని నిశితభల్లముల నాతని యుల్లమున నాటె. చిరప్రవర్థమానమైన క్రోధముచే వారిరువురు నన్యోన్యసంహరణోద్యుక్తులై ఘోరముగాఁ బోరిరి. కాని గాండీవిముందర రాజరాజు నిలువలేక పోయెను. రారాజును విపచ్చుఁడు పట్టి చంపుచున్నాఁడని భయంపడి భీష్మద్రోణాదిమహా యోధులు కురునాథునకుఁ గవ్వడికి నడుమనడ్డుపడిరి. అప్పుడు కౌరవేశ్వరుఁడు ప్రాణము దక్కెనని పాఱిపోయెను. అప్పు డర్జునుఁడు తన చేఁజిక్కిన యామిషము నిష్కారణముగఁ బోయెఁగదా యని వగచి రోషభీషణుఁడై కురువీరు పై శరపరంపర లేసెను. అంతతోఁ దనివిసనక గాండీవి కురువీరుల నింకఁ బరాభవింపఁ దలఁచి వారిపైస మ్మోహనాస్త్రముఁ బ్రయోగించె. ఆయస్త్రము ప్రయుక్తమైన తోడనె పదాతులు నిద్రించినట్లు నేలనొరిగిరి. భీష్మాదియోధులు తమ తమ యరదములపై మూర్ఛిల్లిరి. ఘూర్ణమానమహార్ణవము తెఱంగుననున్న కౌరవ సైన్యము నిశ్శబ్దమై ప్రశాంతమై పడియుండె. ఏనుఁగులు గుఱ్ఱములు చచ్చినట్లెయుండెను. అపుడర్జునుఁడు సారథింజూచి "యుత్తరా! అభి మానోత్తర యైన మీయుత్తర కౌరవవీరులతలపాగలలో నిగుడ్డలు కోసి బొమ్మపొత్తికలుగఁ దెమ్మని మనము బయలు దేరునపుడు నిన్న డిగెఁగదా. ఆమెకోర్కి తీర్పకపోవుట పాడిగాదు. కావున ఖడ్గము గైకొని వారితలపాగలలోని గుడ్డలుకోసి తెమ్ము. తలపాగలుకోయు టయెగాని మఱియేదుష్కార్యము సేయబోకు సుమీ. నీవెల్ల వీరులకడకు బోవచ్చును. కాని పితామహునిచెంత కరుగకుము. ఆతఁడూరక పడియున్న వాఁడు. కాని యీసమ్మోహనాస్త్రమునకుఁ

ప్రతిక్రియ యెఱుంగును. అతనికడకుఁ బోయితివేని నీప్రాణములు దక్క" దని చెప్పి పంపుటయు నుత్తరుఁడు ధనంజయునిబలము చూచుకొని దుర్యోధన దుశ్శాసనరాధేయజయద్రథకృప ద్రోణాశ్వత్థామ ప్రముఖులయుష్ణీషములలోని ముక్కలు కోసి తెచ్చి యరదములపై నిడియెను. అంతట నర్జునుఁడు సమ్మోహనాస్త్రము నుపసంహరింపఁ గౌరవవీరులు వెండియుఁ జైతన్యము గలిగి లేచి యొండొరుల మొగములు చూచుకొనఁజొచ్చిరి. అప్పుడు పితామహుఁడు కౌరవేశ్వరుని జూచి "కుమారా! సురాసురదుర్జయు లగు నీయోధులందరు నేడర్జునునిచేత నిర్జితులైరి. అరణ్యవాసకాలమున నతడు వరుణ వామ దేవ వైశ్వానర ప్రభృతులగు దేవతల మెప్పించి దివ్యాస్త్రములు వడసె. అదికారణముగ మన మోడితిమి. ఇది వానింగెల్చుటకు సమయము గాదు. మనము హస్తిపురమున కరుగుదము రమ్ము. అని మందలించుటయు" నత డట్ల కాక యని సైన్యముల మరలించి రాజధానికిం బొమ్మని యానతిచ్చెను. హతశేషు లగు సైనికులు హస్తిపురమునకు బోవజొచ్చిరి. అర్జునుండును వెండియు బితామహభారద్వాజశారద్వతులకు నమస్కారబాణము లేసి వారి యొద్ద సెలవు గైకొని రాజరాజమకుట మాణిక్యములు నిశిత బాణముల నేలనూడనేసి యప్పటికి తానరు గుచున్నట్లు తెలిపి యుత్తరు జూచి "కుమారా! వచ్చిన పని య్యైనది. పసులబట్టితిమి. కౌరవ సేనంగడచి పరాభవించితిమి. నే నర్జునుండ నైనట్లు నే ముదల యిచ్చువఱకు నీతండ్రికి గాని యొరులకుగాని తెలుపవలదు. ఇది నీవిజయంబ యని పౌరులనుకొనునట్లు ప్రవర్తింపుము. ఇప్పుడు నేను వెండియు నాబృహన్నలరూపము ధరియించెద. గాండీవాది సాధనములు శమీవృక్షముపై నిక్షిప్తము చేసెద. స్యందనము శమీతరువుకడకు గొని పొమ్ము. మనము పురము సేరు లోపల నీవిజయమంగళవార్తలు పురంబున జాట గోపాలురం బంపుమని వాక్రుచ్చుటయు" నుత్తరుడు కొందఱు పసుకాపరుల బిలిచి విజయము చాటుమని పురమునకు బంపి తేరు

జమ్మికడకు తోలెను తోలుటయు ధనంజయుడు తన గాండీవమును దేవదత్తమును నక్షయ తూణీరమును మహేంద్రదత్త కిరీటమును జమ్మిపై నిక్షేపింపు మని యుత్తరుని కిచ్చెను. ఉత్తరుడట్లు చేసెను. బృహన్నల యెప్పటి యట్ల పేడిరూపు గైకొని యుత్తరుని రథికుని చేసి తానుసారథియై రథము నడుపుకొని పురమున కరుగజొచ్చెను. ఇంతకుమున్ను విరాటుండు దక్షిణగో గ్రహణాసక్తి వచ్చినసుశర్మ నోడించి నగరమునకు బోయి యమాత్య దండనాయక ప్రముఖులతో గొలువుండి తనవిజయమునక యుపొరులు బంధువులు వందిమాగధులు దన్ను గొనియాడు బొగడ్తల నాలకించి యుబ్బియుతర్తు డేడి యడిగెను. కౌరవులు మహాసేనాసమేతులై యుత్తర గోగ్రహణము చేసినకతంబున నుత్తరుఁడు బృహన్నలను సారథిం జేసికొని వారిపై కరిగెనని యంతఃపుర పరిచారకులు విన్నవించిరి. అప్పలుకులు విని విరాటుఁడు గుండె జల్లుమనఁ దెల్లబోయి యయ్యో! అకృతాస్త్రుఁడు సంగ్రామపరిచయ హీనుఁడు నాకొడు కేడ? దేవకల్పులగు కౌరవవీరు లేడ? అమ్మహావీరులతో నా కొడుకు పోరనేర్చునే. వాఁడింకఁ బ్రతికి యింటికివచ్చునే. అమాత్యు లారా! ఇప్పుడైనఁ దడవు సేయక వానికి సాయము సేయుటకై మన చతురంగబలంబుల నంపుఁడు. అని పగచుచుండ యుధిష్ఠిరుఁడు వాని కిట్లనియె. "రాజా! బృహన్నల సారథి యగుటం జేసి నీకుమారు నకు భయంబు లేదు. అతఁడు నేఁడు కౌరవ సేనను గెలిచి వచ్చును. వెఱవకుము" అని యాతఁడు ధైర్యము చెప్పుచున్నను విరటుఁడు పుత్త్రస్నేహమున నతని మాటలం ద్రోసిపుచ్చి నిజ సైన్యములఁ గుమారునికడకుఁ బనుప యత్నము సేయుచుండ నంతలో గోపాలకుఁలు త్తరుని విజయంబు నగరంబునఁ జాటి కొలువుకూటంబునకుఁ బోయి యాశుభవార్త విరటునితో విన్నవించిరి. విన్నవించుటయు విరటుఁడు మహానందభరిత మనస్కుఁడై తక్షణంబ గోపాలురకు వెలలేని పసదనంబు లిచ్చి యెట్టెట్టు? నాకుమారుఁడకృ తాస్త్రుఁడు బాలుఁడు కురువీరుల నెత్తెఱంగున గెలుచు నని నేను

వగచుచుండ విజయమంగళవార్తలు వినునంతటి యదృష్టవంతుఁడనైతి. నేఁటితో నాజన్మము సార్థక మైనది. నావంశము వన్నె కెక్కినది. నాకుమారుఁడు భీష్మమర్దనుఁడు ద్రోణమర్దనుఁడు రాజరాజ మర్దనుఁడని బిరుదులు వహింపవచ్చును.'' అని పరిపరి విధంబులఁ దనయానందమును దెలుపు చుండ యుధిష్ఠిరుండు తనలో ముసిముసినవ్వులు నవ్వుకొనుచుండెను. సభాసదులు విరటునకు శ్రవణానందముగా నుత్తరుని విక్రమంబులు వేయినోళ్ళం బొగడిరి. అంతలో నుత్తరుఁడు సారథీసమేతుఁడై పురంబుసొచ్చి రాజవార్గంబునం బోవుచుండ బ్రాహ్మణులు స్వస్తివాచకంబులతో నెదుర్కొనిరి. పుణ్యాంగనలు మంగళహారతు లిచ్చి లాజలు నక్షతలుఁ బుష్పంబులు నతనిపైఁ జల్లిరి. ''జయజయ! ఉత్తరకుమారా జయజయ!మత్స్యకులపయఃపారావార రాకాసుధాకర! జయజయ! కౌరవసేనాకాంతారదావానల!'' యని వందిమాగధులు. కైవారములు సేసిరి. ఆపొగడ్తలెల్లఁ దనవి గావనియు బృహన్నల వనియు మనంబులు నెంచుకొనుచును త్తరకుమారుఁడు క్రమక్రమంబున నగరు సేరె. ఈలోన విరాటుఁడు కొలువు సాలించి యంతఃపురంబు నకుం జని యానందపరవశుఁడై కంకభట్టుం బిలిపించి నెత్త మాడుదమని యాతని నొడంబఱిచి సారెలుం బలుకయు సైరంధ్రిచేఁ దెప్పించి యాడందొడంగి యెడనెడఁదన కుమారుఁడు కర్ణగాంగేయాది కౌరవవీరులఁ గెలిచెనని కొడుకును మాటికిఁ బ్రశంసించుచుండ యుధిష్ఠిరుఁడు ''రాజా! కౌరవులను నీకొడుకు గెలువలేదు. బృహన్నల గెలిచెను. బృహన్నల యసాధారణ బాహువిక్రముఁడు, వానిలావు నీవెఱుంగవు'' అని వానిమాట కెదురు చెప్పెను. అప్పలుకులు దుస్సహంబులగుటయు విరటుఁడు కంకుభట్టుంజూచి "కంకా! ఏమిది యిట్లు పలికెదవు? నాకుమారుని విజయము నీకంత యసూయాకారణ మెట్లయ్యె? ఇంతకాలము నాయింట నుండి యెట్ట కేల కింతకృతఘ్నుఁడ వైతివే'' యని వందలింప యుధిష్ఠిరుఁడు వెండియు ''రాజా! నీకొడు కుపైనా కసూయ లేదు.

అట్లుండుటకుఁ దగిన కారణంబులు లేవు కాని సత్యమే పలుక వలసివచ్చినప్పుడు బృహన్నల కౌరవసేన నిర్జించెనని చెప్పవలయుఁగాని నీకొడుకు గెలిచెనని చెప్పఁదగదు. నీ కాగ్రహమువచ్చినను సరె బృహన్నలయె వారిం గెలిచెను" అని నొక్కి వ్రాక్కుచ్చెను. అమ్మాటలకు విరటుఁడు మేరమీఱిన కోపము నొంది "కంకా! ఎన్ని తెఱఁగుల జెప్పినను నీయసూయ మానకున్నాడవు. నీవు పయోముఖవిషకుంభమవు. ఛీ! నీవంటి పాపి లేఁడు" అని యెక సారెఁ గొని యుధిష్ఠిరుశిరంబు నేసెను. తలపై గాయముపడి యందుండి బొటబొట నెత్తురు కారఁ దొడంగెను. దాపున నున్న సైరంధ్రి యదిచూచి తన చీర చెఱఁగుతో నెత్తురొత్తి శీతలజలములతో గాయంబుఁ గడిగెను. విరటుఁడు సైరంధ్రింజూచి "యేమి! నీచీర చెఱఁగుతో నెత్తురొత్తనేల" యని యడిగెను. అప్పుడాపురంధ్రి యిట్లనియె "రాజా! యితఁడు మహానుభావుడు విశేషించి ద్విజుడు ఈ మహానుభావుని నెత్తు రేనేలపైఁ బడునా నేల పంటలు దొఱగి క్షామ దేవతకు నిలయం బవు గావుననీ వేలునేల కట్టి యరిష్టము గలుగకుండ నిమ్మహామహుని మహత్త్వము నెఱిఁగిన దానం గావున నిట్లు చేసితి" అనవుడు విరటుడు సంతసించి తనకావించిన యకార్యమునకుఁ బశ్చాత్తాపము నొందెను. అంతలో నుత్తరకుమారుఁడు విజయంబుచేసె నని ప్రతీహారి విన్నవింప రాజు బృహన్నలను నుత్తరునిం బ్రవేశ పెట్టుమని యానతిచ్చెను. అర్జునుండు తనగాయము గనుఁగొనినయెడల మహాగ్రహము నొంది విరటుని కేమి యెగ్గు సేయునో యని భయపడి యుధిష్ఠిరుండు ప్రతీహారింబిలిచి "నీవు త్తరుని మాత్ర మొ ప్రవేశ పెట్టుము, ఉత్తరుఁడు వచ్చి వెళ్ళిన వెనుక బృహన్నలం బ్రవేశ పెట్టవచ్చు" నని చెప్పె. ఉత్తరుఁడె ముందుగా రాజసన్నిధిం బ్రవేశించెను. మత్స్యనాయకుఁడు మహానందపరవశుఁడై కుమారుని గౌంగలించుకొని ముద్దాడి తల నిమిరి "కుమారా! నీకతంబున మత్స్యవంశము మహీమండలంబున వన్నె కెక్కె. పరశురాముని గెలిచిన బాహుశాలిని, జామదగ్న్య శిష్యుడైన చండబలుని, సకలధనుర్ధర గురువును,

విశేషించి రాజ రాజును, జతురంగ బల సమేతముగనీ వొక్కడవె గెల్చుటకంటె మహాశ్చర్య మేమున్నది! నీవు నివురు గప్పిన నిప్పు చందంబున నున్న వాడవు గాని యసాధారణ తేజోబల దర్పితుఁడవు. నీవిక్రమంబుదలఁపదాఁ రకాసురుదర్పమడంచిన కుమారుండును మారీచసుబాహులం గడ తేర్చి విశ్వామిత్ర యాగసంరక్షణంబు గావించిన రఘుకు మారుండును జ్ఞప్తికి వచ్చుచున్నారు. నిన్న మొన్న కన్నులు తెఱచిన పిన్న వాడ వగుటచే విశేషించి నాబిడ్డడ వగుటచే నేను నిన్నింత కొనియాడరాదు. నీతల్లి యిప్పుడు వీరమాత యయినది" అని మితి మీఱి పొగడుచున్న జనకునిం జూచి యుత్తరు డిట్లనియె. "అయ్యా! నన్ను క్షమియింపుడు. ఈవిజయంబునకు నేను గారణంబు గానుఁ సంగ్రామస్థలంబున కరిగిన పిమ్మట దివ్యపురుషుం డొక్కడు నాకు దోడు సూపి నాకీజయంబు గల్గించె. అతడె భీష్మాది యోధులం గెలిచె. అతని మైఖరియు విక్రమంబుఁ జూచి యమర రాజతనయు డెమొ యనుకొంటి. అవ్విజయుడు ప్రయోగించిన సమ్మోహనా స్త్రంబుచే గాంగేయప్రభృతు లగుకురువీరు లెన్నడో చచ్చినయట్లు రథంబులపై బడిరి. ఆనరు డెంతపరాక్రమ వంతుడో గాని తానొక్కడే యయ్యు లక్షోపలక్షలగు సైనికుల జిక్కుపఱచెను. ఈ స్తవము లన్నియు నాతనికే గాని నాకు జెందవు. నేనెంతమగంటిమి గలవాడనో నాలా వెంతటిదో నాబ్రతు కెట్టిదో నీవెఱుగవా" యని సత్యంబు పలుకుచున్న నందను గనుఁగొని "కుమారా! ఆమహాపురుషుఁడెందున్న వాఁడు అతని నిట కేల దోడ్కొని వచ్చితివి కావు? నన్నాతనికడకుం గొనిపొ" మ్మని పలికెను. అనవుడుత్తరుఁడు "తండ్రీ! అమ్మహాపురుషుఁడు తనవృత్తాంతము సమయంబు వచ్చు వఱకు ననెవ్వరికి నెఱింఁగింప వలదని నన్ను గోరుటచే నే నాతనివంశంబును నామధేయంబును నెఱింగినవాఁడ నయ్యు నీకిప్పుడు తెలుప రాదని వక్కాణించెను. అంతలో బృహన్నల రాజుం గనుఁగొని నమస్కరించి చెంతనున్న యుధిష్ఠిరునకు నభివందనము సేయ నతఁడు గాయ మర్జునునకుఁ గనఁబడునను భయమునఁ దల వంచి తనచీర చెఱఁగు

మొగంబునకు మాటు చేసికొని యెప్పటి యట్ల యాదరింపక యాతని వీడ్కొనియెను. అతఁడును తేనికడ సెలవు గైకొని "యుధిష్ఠిరుఁడు నాపై నేటికో యలుకఁబూని యున్నవాఁడు. నే నేమితప్పు గావించితినో గదా" యని సవిషాదముగ నర్తనశాల కరిగెను. అపుడుత్తర సఖీజనపరివృత్తయై బృహన్నలం గనుఁగొని యాతఁడుదననిమిత్తము దెచ్చిన బొమ్మపొత్తికలకానుక నందికొని సంతసించెను. ఆ రేయి పాండునందను లేవురును ద్రుపద రాజపుత్రికయు రహస్యముగ నొక్కచోఁ గలిసి కొని యజ్ఞాతవాస కాలంబు గడచిపోవుటం జేసి నిజరూపంబులతో బయలుపడుటకు సమయమిద్ది యని వారాలోచించిరి. మఱునా డుదయమునఁ దమ్మెఱిగించుకొనుట మంచిదనివారు నిశ్చయించుకొనిరి. అపుడు ధనంజయుండు తక్కినవారిం గనుఁగొనియిట్లనియె. నేఁడు తేనికొలువున నన్న గారిని నేను గనుఁగొనినప్పుడు నన్నెప్పటి యట్ల నిమ్మహాత్ముఁడా దరింపక తలవంచుకొనియుండె. నే నెఱింగినంత వఱకు మనోవాక్కాయకర్మముల నిమ్మహాత్మునియెడ జేసినయపరాధము లేదు. ఈతఁడే దైవంబని నే దలంచుచుంటి. నాయెడ నిట్టి యలుకఁబూనుటకు గారణమేమో యెఱుఁగవలయు" ననవుడు యుధిష్ఠిరుఁడు ధనంజయుని హస్తము పట్టుకొని "వత్సా! నీవు నా యెడ జేసినయపరాధము లేదు. నాకు నీ యెడ నెట్టి యలుకయు లేదు. నే నట్లుండుటకు గారణ మెఱింగించెద వినుము. విరాటుఁడును నేనునుసు హృద్యూతమాడితిమి. ఎడనెడ నతఁడు దనకుమారుఁడు కౌరవసేనంగెలిచె నని ప్రశంసించె. ఉత్తరుఁడు కాదు బృహన్నలయొశత్రువుల నిర్జించె నని నేనంటి. ఆవాదమున నతనికి రోసము హెచ్చె. రోషపరవశుఁడై సారెగొని నన్నువైచె. ఆ దెబ్బకు నాతలపై గాయముపడి యె. నెత్తురు బొటబొటగారె. పాంచాలి చీర చెఱఁగున నెత్తురుదుడిచి జలము గాయముగడిగి సమయోచితోపచారంబులు జేసె. ఆగంటు నీకంటఁబడెనేని నీవు విరటునిపై నలిగి యేమియపకృతిగావింతువో యనుభయమునఁ దలవంచి ప్రసంగము సంక్షేపించి నిన్నంపితి" నని

యచ్చట జరిగినవృత్తాంతమంతయు దెలిపెను. అప్పలుకులు వినిన తోడనే దండతాడితమహోరగముచందమున భీమసేనుఁడు కోపా విష్టుఁడై "యెట్టెట్టు! విరాటుడింతపొగరుకొనియెనే? సకలలో కపూజనీ యుఁడ నగునిన్ను నీపాద సేవకయిన ననర్హుఁడగువిరాటుఁడు సారెగొని వైచెనే? ఇది చూడుడు. బంధుగణసమేతముగవానినిప్పుడ కృతాంత మందిరమున కంపెద." ననిలేచెను. "ఏమేమీ! మత్స్యభూపాలుడు తనయంతర మెఱుంగక భూలోక దేవేంద్రుఁడ వగు నీయంతవానిని నిర్భయముగ నిట్లు సారెతొ నడంచునే బాహుచతుష్టయమట్లు సోదర చతుష్టయ ముండఁగా నీమేని నెత్తురుచుక్కలు నేల రాలవలసి వచ్చెనే. ఇప్పుడు విరటునిం దుదముట్టించెద" నని యర్జునుఁడు క్రోధారుణముఖుఁడై పలికెను. అపుడు ధర్మనందనుఁడు వాయునందన సంక్రందన నందునులను చెటియెక కేలంబట్టుకొని "తమ్ములారా! మీకు నాయెడంగల గాఢానురాగమునకు సంతసించితి. కాని మన మిప్పుడు విరటున కెగ్గుసేయరాదు. ఆతని యనుగ్రహమునంగాదే యమదంష్ట్రలవంటి యీకష్టదినములు మనము నిర్బాధకముగ గడుపఁగలిగితిమి. అతఁడు మనకృతజ్ఞతకుం దగిన వాఁడు గాని యాగ్రహమునకు భాజనము కాడు. కావున మీరు శాంతించి యతని యెడఁ బ్రసన్నులరు కండు. అతఁడు తనకుమారుఁడె విజయము నొందె నని నమ్మి యెదు రాడినందులకు నాపై నలుక బూని పొరబాటుననట్లు చేసె. ఇది సైరింపఁదగినది" యని కోపోపశమనము గావించెను. ఆశాంతవచనములచే వారు కలక దేఱి ప్రసన్నులయిరి. మఱునాఁడు తెల్లవారుజామున నప్పాండునందను లేవురు మేలుకాంచి నిర్వర్తితకాల్యకృత్యులై కృతస్నాతులై నవ్యమాల్యాంబరాభరణ భూషితులయి ప్రాతః కాలమున విరటుని కొల్వుకూటమున కరిగిరి. యుధిష్ఠిరుఁడు మత్స్యనాయకుఁడెక్కు మణిమయ సింహాసనమధిష్ఠించెను. భీమార్జున నకుల సహదేవులు సింగపుఁగద్దియచెంతఁ దమకు చితములయిన యాసనములు గ్రహియించి కూరుచుండిరి. అంతలో విరాటుఁడు ప్రియపుత్రుఁడగు నుత్తరుఁడు

సచివులు సామంతులు గొలిచి రా నిండోలగముండ సభామందిరమున కరుదెంచెను. అరుగుదెంచిచూ చున్నప్పటి కాత నివిస్మయం మేమనివర్ణింపవచ్చును. తనయండనుండి పట్టెడన్నము తిని బ్రదుకుచున్న కంకుభట్టు తనగద్దియ నెక్కి కూరు చుండుటయు దనయింట వంటలవాడగు వలలుడును గన్ని యలకున్నృత్యము చెప్పు బృహన్నలయును గుఱ్ఱములుగాయుదామగ్రంథియు బశుల కాపరియగుతంత్రీపాలుడును రాజబంధువులు గూర్చుండురత్నపీఠము లధిష్ఠించుటయు నేత్ర గోచరమ్మైన తోడనే యాగ్రహాశ్చర్యము లతనిమనమున నొక్కసారి సముద్భవించెను. ఒక్కని మేషమతఁడు పలుకఁజాలక యూరకుండి బిట్టలుక బట్టఁజాలక యిట్టులనియె. "కంకా! శంక లేకనా లెంకలయిన యీవంటలవాని, నీనటుని, నీగుఱ్ఱముల కాపరి ని, నీపశుపాలకుని గూడఁగట్టుకొని నాగద్దియ నెక్క సాహసించితివే? సన్న్యాసివనుకొని నిన్నెల్ల విధములఁబూజించితిమి. కానియిట్టి కృతఘ్నుఁ డవని యెన్నడేఱుగ. నెత్తము మాడుతరి రోసమున సారెతో నిన్నడం చితినని యవ్వలదద్దయువగచితి. సారెతో నడచుటగాదు. నిన్నేమిచే సిననందోసవము లేదు. ఆహా! సన్న్యాసి రాజట. వంటలవాడునటుడు మంత్రులట. పశుహయపాలకులు పడవాళ్లట. ఇక రాజ్యమెట్లుండవలయునో యట్లుండును. ఔరా! కంకుభట్టు! పార బాటుచేత గద్దెనెక్కితి వనుకొనుము. నన్ను జూచియైనలేవక రాజావలెనట్టి కూర్చుండెదవేల? మొండివాఁడు రాజుకన్న బలవంతు డన్న సామెత నీయందు నిక్కమయినది." అనుచుండ నర్జునుండు నిజపీఠంబుననుండి లేచి విరటునివంక చూడ్కులు నిలిపి యిట్లనియె. "రాజా! ఆగ్రహంబునకు లోనుగాక నాపలుకుల నాలకింపుము. ఎవ్వాడు రాజసూయమహా ధ్వరసమయంబున చతురంభోనిధి మేఖలావలయితక్ష్మా మండలంబునం గలమహీపాలకుల నెల్ల నరిగాఁపులుగ జేసెనో యెవ్వనిచరణారవిందములకు మూర్ధాభిషిక్తులు నిజమకుట మాణిక్యదీధితులచేత నీరాజనము పెట్టిరో యెవ్వనియనుగ్రహంబునకుఁబాత్రంబులగుట కుదయాస్తా చలసేతు

సీతనగమధ్య మహీపతులు వెలలేని కానుకలనందుచు వచ్చిరో యెవ్వాని యశశ్చంద్రిక లష్టదిక్పాలకశుద్ధాంతకాంతాజనం బులకు దువ్వలువలై యలరారుచున్నచో యట్టి కౌరవవంశపయఃపారావారశరచ్చంద్రుఁడు సత్య భాషాహరిశ్చంద్రుఁడు దానతృణీకృతల్పకభూరుహుఁడు శాంతమూర్తి యుధిష్ఠిరసార్వభౌముఁడు నీచిఱుత గద్దియ నెక్కుట కర్హుఁడుగాడే? ఈ మహాత్ముఁడు శత్రుమిత్రసమానుఁడు నిష్పక్షపాత మనస్కుఁడు. మహోదార చేతస్కుఁడు. నిష్కళంక చరిత్రుఁడు. కౌంతేయాగ్రజుఁడు కురుకులపాంసనుఁ డగు దుర్యోధనునిచేత నాఁడు కపట దురోదరపరాజితుఁడై పండ్రెండేం డ్లరణ్యావాసము సేయుటకు నొక్కయే డజ్ఞాతవాసంబు నేయుటకు సమయంబుసేసి యరణ్యావాస మెట్లో పూర్తి చేసి యజ్ఞాత వాసదీక్ష నీయింటఁ గడపె. ఆ వ్రతము నిన్నటితో సమాప్తమైనందున నేఁడు తన్నెఱింగించుకొనియె." అప్పలుకులు వినివిరాటుఁడు విస్మయాధీన చేతస్కుఁడై యితఁడు పాండవ జ్యేష్ఠుఁడైనపక్షమున భీమార్జుననకులసహదేవు లేరి? ద్రౌపదియేది యని కఠినముగ నడిగెను. అడుగుటయు నర్జునుఁడిట్లనియె.

"రాజా! అవధరింపుము. బకమర్దనంబుగావించి యేక చక్ర పురవాసుల శోకమడంచిన లోకహితుండును హిడింబకిమ్మీరజటా సురప్రముఖ దుష్టదానవులఁ గడతేర్చి వనవీథుల నరాక్షసములుగా జేసి వనవాసులవంతఁ దీర్చిన తేజోవంతుఁడును జరాసంధ విజయము ల్లుండును, కీచకశతనిర్మూల నాభీలసంరంభుండును నాగాయుత బలోదగ్రుఁడు నగు భీమసేనుఁడితఁడె. దైవదుర్విపాకంబున నితఁడు వలలుడను పేర నీవంటలవాఁడై యుండవలసివచ్చె. మన్మథమన్మథుడును మహనీయచరిత్రుఁడను మాద్రీకుమార జ్యేష్ఠుండును నగు నకులుఁడితఁడె. మాద్రీకనిష్ఠపుత్రుండును గొంతికిగారాబు కొడుకును మాకు గడగొట్టుతమ్ముండును నధ్యాత్మవిద్యారహస్య వేదియు రాజనీతికోవిదుఁడు

నగుసహదేవుఁ డితఁడె. విధివశంబున నకులు డశ్వశిక్షకుఁడు గ నతఁడు గోపరిపాలకుఁడుగ నిన్నుఁ గొలిచి యుండవలసె.

అని చెప్పి తన్నుఁ దాఁ జెప్పికొనుట సముచితముగా దనియూరకుండ భీమసేనుఁడు విరటుం గనుంగొని "రాజా! విశృంఖలకల్పాంతపయోధరములతో పాక శాసను డడ్డువచ్చినను సరకు సేయక ఖాండవవనము గాల్చిన యఖండబాహుబలుండును నుత్తర కురుభూములం గెలిచి గణనాతీతము లయిన ధన రాసులం దెచ్చి యుధిష్ఠిరునిచే రాజసూయంబు చేయించిన భువనైకధన్వియు నెక్కటి కయ్యమున లలాటలోచనునితోఁ బోరి యాతని మెప్పువడసి పాశుపతాస్త్రమువడసిన పరాక్రమశాలియు నివాతకవచకాలకేయాది దుష్టదానవులం దునుమాడి యమరనాయకుని యర్ధాసనం బెక్కిన యద్వితీయపరాక్రముఁడు నుత్తరుం దోడ్కొనిపోయి యుత్తర గోగ్రహణంబు సేసిన కురువీరుల నుక్కడంచిన దండిమగం డునునగుద్రోణాచార్య ప్రియశిష్యుఁడు కౌరవకులాభరణమర్జునుఁ డితఁడే."

అనివృకోదరుఁడు పార్థునెఱీఁగింప ద్రుపద రాజపుత్రి యేది యని విరాటుఁడడిగెను. అప్పుడుధనంజయు డిట్లనియె. "మాలిని యను పేర సైరంధ్రీ వ్రతము గైకొని నీయంతఃపురపరిచారికయ్యై నీ రాణివాసమున కుపచారము చేయుచున్న యీ నెలంత పాంచాలరాజనందన. అమ్మహాపతివ్రతపై వలపునిలిపి కీచకుఁడా సాధ్విని బలిమింబట్టఁ దమ కించుట చేతఁగాదె గంధర్వులు కడ తేర్చిరను నెపమున సింహబలునిసానుజముగ నీభీమ సేనుఁడె చంపెను. రాజా! ఈవత్సరంబుమమ్ము నీవుత్త రాదికుమారులఁ బెంచిన తెఱంగునఁ గృపాయత్తచిత్తుఁడవై కాచి ప్రతి జ్ఞాభంగము లేకుండ మనిచితివి. కావుననీకుఁ గృతజ్ఞులము విధేయులము." అనిపలుకుటయు వెఱపువిస్మయము

మనంబున మల్లడిగొనమత్స్యమహీనాయకుఁడేమియుం బలుకఁజాలక యూరకుండ నుత్తరుఁడు "తండ్రీ! సమయమువచ్చి నదిగనుక నింక దాపఁజనదు. నిన్న కౌరవుల మీఁదికి నేనరిగినప్పుడు నాకొక్క మహాపురుషుఁడు సాయంబు సేసెన నివిన్నవించితిని. ఆమహాపురుషుఁడే యర్జునుఁడే. ఆక య్యంపుసొంపు చూచితీరవలయును గాని వర్ణింప వేయితలలు గల చిలువదొరకైన శక్యంబుగాదు. పాండవులు మనకడ కరుగు దెంచునపుడు తమయాయుధంబుల మనయూరిమసనంబుకడ నున్న జమ్మిమ్రానిపై దాచిరి. అర్జునుఁడు నిన్న శమీనిక్షిప్తములైన గాండీవాదిసాధనంబులు గైకొనిపశులమందలఁ బట్టవచ్చినవారిని బశులమందలఁ దోలిన తెఱంగు నఁదోలె. ఈతఁడర్జునుఁడు. వీరు పాండవులు." అని విన్నవింప విరాటుడునేలఁ జాగిలంబడి యుధిష్ఠిరుని చరణరాజీవంబులకు దండప్రణామము చేసి యిట్లనియె.

"ఓమహానుభావా! కురువృషభా! నిగురకప్పిననిప్పు తెఱంగున దేజంబెల్ల మాటుపఱిచి సన్యాసిరూపమున నన్నుఁగొలిచియుండుటచే నీమహామహిమమెఱుఁగఁజాలక నిన్ను సామాన్య సన్యాసియని భావించి నీయెడ ననాదరణము నేసితిని. భువనైకమల్లుండగు బల్లిదునిభీమ సేను నిశత్రుభీకరసంగ్రాముడఁగు పార్థుని నతిసుకుమారులగు నకులసహ దేవులను నీచకర్మల నియోగించితి. వరమున జన్మించి ద్రుపదునియాఁడు పడుచ్చై భరతవంశపురాజానకుఁ గోడలై మీకుఁబట్ట మహిషియైపరమసాధ్వియై. రాజసూయమహాధ్వరసమయమున సకల రాజపత్నీ సేవితయై పులోమజిత్తుని పురంధ్రికి నెనయగు పాంచాల రాజనందనను నీచకృత్యములఁ బనిచినందులకు మదోన్మత్తుండై నామఱఁది యవమానించినందులకు మీరునన్ను క్షమింపవలయు. యుధిష్ఠిర మహారాజా! విరటుఁడు నీయనుజులలో నొక్కఁడని భావింపుము. ఈరాజ్యము నీయది. ఈసిరులు కరులు హరులు నీయవి.

ఈయమాత్యులు నీయమాత్యులు. నేను నీబంటను. మత్స్యరాజ్యమునకు నీవిప్పుడె యభిషిక్తుండవై యేలుము. నన్ననుగ్రహింపుము."

అని వేఁడుకొన యుధిష్ఠిరుడు కరుణాతరంగితహృదయుఁడై పాదవులపై నుండియతనిని లేవనెత్తి "రాజా! యిట్లనజెల్లునే. నీయనుగ్రహముకతమున మేముప్రతము సంపూర్తి చేసికొని బ్రతికితిమి. నీయింటదిని నీ రాజ్యము సేకొనుట కంతమూర్ఖులమె. నీచేసిన యుపకారమున కు వేంమప్రత్యుపకారవు సేయఁగలవెం. నీరాజ్యముమాకక్కఱ లేదు మేము కౌరవులతోడిసంధికిఁ బ్రయత్నించి మాపాలు రాజ్యము గ్రహించి సుఖమున మనియెదము. క్రమముదప్పి కురురాజు సంధికియ్య కొనండేని కదనమున శత్రుమర్దనము గావించి రాజ్యంబుసేకొందుము. అంతియేఁగాని మీ రాజ్యంబు వేము స్వీకరించువారము" కామని స్పష్టముగ బలికెను. అప్పలుకులు విని విరాటుఁడు ధర్మనందనున కిట్లనియె. "దేవా! అట్లయిన నాదొక విన్న పము గలదు. నాకుమారిక యుసకలసద్గుణోత్తరయు నగునుత్తరను మీరెండవ తమ్ముడగు నర్జుననకిచ్చి పెండ్లి సేయవలయు ననినాకు సంకల్పము గలిగినది. ఇందు నకునీ డంబడి యాతని నొడంబఱపవలయు". అని ప్రార్థింప నర్జునుఁడు "రాజా! ఇదిపాడిగాదు. నేనుత్తరకుగురుండను. అమె నాకుబిడ్డవంటిది విశేషించి నేను వయసు చెల్లినవాఁడను. అమె నెర జవ్వని. ఈ రెండు కారణములచేత నామెను నేను వివాహమాడఁ జనదని" యుధిష్ఠిరుని వంకజూచెను. అప్పుడు యుధిష్ఠిరుఁడు విరాటుం జూచి "రాజా! మాయర్జునుఁడు చెప్పినదంతయు నిక్కము. అక్కారణంబున వారిసమాగమం బాదరణీయము కాదు. ధనుర్విద్యాకుశలుఁడును వయోగుణరూపంబులనుత్తరకు దుల్యుండును నగుం మాయభిమన్యుకుమారుఁ డున్నవాడు. ఇక్కుమారిక నక్కు మారునకిచ్చి వివాహము సేయుట జగదానందకర" మని పలికెను. అప్పలుకులు

భీమార్జున నకులసహదేవులు సముచితంబు లనికొని యాడిరి. సభాసదులు మెచ్చిరి. విరటుఁడు సంతుష్టహృదయుఁడై యుత్తరనభిమన్యున కిచ్చి వివాహము సేయుటకు నిశ్చయించుకొనెను. పాండునందనులు కొలువు సాలించి శమీవృక్షనిక్షిప్తములైన యాయుధంబులం దెచ్చుకొనిరి. తనపరిచారికయైన మాలిని పాండవపట్టమహిషియని వినినతోడనే విరటునిపట్టమహిషియుగుసు దేష్ణ మొదట నచ్చెరుపడి పిమ్మట భయంపడియాపాంచాలరాజనం దనునురావించి యనేక కాంచనచేలంబుల నాభరణంబులనిచ్చి యామెయడుగులఁ కెరగి యిట్లు వేఁడుకొనియెను. "ఓమహాదేవీ! నీయడుగుల గొలుచుటకై నను దగనిదానను. అట్టినిన్ను కల్లుదెమ్మని నాసైదోడుకడకుఁ బంపి నెమ్మనంబున నెంతయునొప్పిగలిగించితి. ఇందులకు నన్ను నీవు సైరింపవలయు." అవ్వేడికోలు విని యాజ్ఞసేని "అమ్మా! అది యెల్ల మాదుర్దినముల ప్రభావము కానీ చేసినయపరాధంబు కాదు. ఈయేఁడు కన్న తల్లి తెఱఁగున నీవునన్నుఁ గడుపులోఁ బెట్టుకొని గాచితివి. నీ మేలు నేనెన్నఁడు మఱవఁజాల" నని సాదరంబుగఁబలికెను అనంతరము పాండునందనులు తమ యరణ్యాజ్ఞాతవాసవ్రతములు చెల్లినవని వాసు దేవునకు ద్రుపద రాజునకును గాశీ రాజప్రముఖులగు మిత్రులకునను దూతలనంపి యభిమన్యుని వివాహమునకు బంధుమిత్రగణముతో రమ్మని వర్తమానములంపెను. ఆ వార్తలు విని బలదేవవాసు దేవులు సుభద్రాభిమన్యులును సాంబసాత్యకి కృతవర్మ ప్రముఖులగు బంధువర్గంబును దోడుకొని పాండవులకడకుఁ బోయి యన్యోన్యసమా లింగనంబులఁ బ్రియసంభాషణంబులఁ జిరవియోగక్లేశంబుఁ బాపికొనిరి. ద్రుపద మహీపాలుఁడును శిఖండి దృష్టద్యుమ్న ప్రముఖులను కుమారులును బ్రతివింధ్యాది ద్రౌపదేయులను సచివులు సామంతులుంగొలువపాండునందనులను సందర్శింపవచ్చెను. కాశీ రాజ ప్రముఖులగుసుహృజ్జనులను యాదవ పాంచాలు రట్ల

ధర్మనందనుని సందర్శించి కన్నుల పండువుగ వారు గనఁబడినందులకు పరమానందభరితులైరి. కురు వంశముతోడ వియ్యమందఁగలిగె నని విరటుఁ డెంతయు సంతసించి యాదవపాంచాలాదిబంధుగణంబునను సబహుమానంబుగ నెదుర్కొని గౌరవించి సుముహూర్తంబు నిశ్చయించి పందిళ్ళు వేయించి విడుదు లేర్పఱచి పలయుప్రయత్నంబు లెల్లఁ జేసి యభిమన్యునకు నుత్తరనిచ్చి వివాహముచేసెను. ఆటలతోడఁ బాటలతోడ వేడుకలతోడ వినోదములతోడ వివాహ మతివైభవంబుగ జరిగెను. గుణోత్తర యైన యుత్తర తమకుఁ గోడలై నందుకు సుభద్రయు ద్రౌపదియుఁ బరమానందమునొంది వీరమాతవు గమ్మనిదీవించిరి. శ్రీకృష్ణ బలరాములు మేనల్లునకు వెలలేని బహుమానములనిచ్చి దీవించిరి. పాండునందనులు కొడుకును గోడలం జూచి మేరమీఱినసంతోషము నొందిరి. రూపమునఁ జందమామయల్లుని గుణములచే జనకునియల్లుని ధనుఃపాండిత్యమున మంచుగొండయల్లుని బోలినయల్లుఁడు తనకు దొరకె నని విరటుఁ డానందాబ్ధి నోలలాడెను.

సమాప్తము.



T.T.D. Religious Publications Series No : 728
Price : Rs. 15/-

Published by K V Ramanachary, I A S , Executive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati and
Printed at TTD Press, Tirupati.